సోమవారం
01-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 341
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కలిసుందాం

మనం మిత్రులం... శత్రువులం కాదు

- ఒక్కటిగా ప్రపంచ శాంతికి హామీనిద్దాం
- 'ఎస్‌సీఓ' భేటీలో జిన్‌పింగ్, మోదీ
- భారత్-చైనా దౌత్య బంధానికి 75 ఏళ్లు

తియాంజిన్: భారత్, చైనా భాగస్వామ్య దేశాలు, శత్రు దేశాలు కాదు... మిత్రులుగా కలిసి ఉండటమే రెండు దేశాలకు మంచిదని ఇద్దరు అధినేతలు నరేంద్ర మోదీ, జిన్‌పింగ్ అన్నారు. పరస్పరం గౌరవ మర్యాదలతో నమ్మకంతో తమ స్నేహ-దౌత్య బంధాన్ని మరింత పటిష్ఠపర్చుకోవాలని సంకల్పించారు. సుస్థిరతకు, ప్రపంచ శాంతికి హామీనిచ్చేలా ఒక్కటిగా ఉండాలని నిర్ణయించుకున్నారు. భారత్-చైనా స్నేహ బంధాన్ని కొనసాగించడం సరైన నిర్ణయమని, రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ శాంతికి హామీ లభిస్తుందన్న ఏకాభిప్రాయానికి వచ్చారు. భారత్, చైనా మధ్య సయోధ్య ద్వారా మానవతాళి సంక్షేమానికి మార్గం సుగమం కాగలదని భారత్ ప్రధాని మోదీ అన్నారు. వాణిజ్యం,

- మిగతా 2 లో

ఓట్ల చోరీపై ప్రజా చైతన్యం

బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'కు అపూర్వ ఆదరణ

- హోరెత్తిన 'ఓట్ చోర్...గద్దీ చోర్' నినాదం
- 25 జిల్లాలు...110 నియోజకవర్గాల్లో సాగిన యాత్ర
- నేడు యాత్ర ముగింపు...పట్నాలో భారీ ర్యాలీ

2లో

కాంగ్రెస్ అగ్రనేత, లోకసభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బీహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'కు ప్రజలనుంచి అపూర్వ ఆదరణ లభించింది. ఆగస్టు 17న బీహార్‌లోని ససారాం నుండి ప్రారంభమైన ఈ యాత్ర పదహారు రోజులపాటు దాదాపు 1300 కి.మీ.ల పాటు 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా సాగింది.

అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించిన రాహుల్

ప్రయాగ్‌రాజ్: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 2024లో అమెరికా పర్యటన సమయంలో సిక్కులపై చేసిన వ్యాఖ్యలపై కేసులో ఎఫ్ఐఆర్ నమోదు కోసం దరఖాస్తుపై కొత్తగా విచారణ జరపాలని కిందిస్థాయి కోర్టును ఆదేశిస్తూ వారణాసి ఎంపీ-ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేశారు. ఈ వ్యవహారాన్ని జస్టిస్ సమీర్ జైన్ నేతృత్వ ఏకసభ్య ధర్మాసనం సోమవారం విచారించనుంది. వారణాసి కోర్టు ఆదేశాలపై రివిజన్ పిటీషన్‌ను రాహుల్ గాంధీ దాఖలు

- మిగతా 2 లో

బెంగాల్ మంత్రికి తప్పిన ముప్పు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మంత్రి ప్రదీప్ మజుందార్ తృటిలో పెద్ద ప్రమాదాన్ని తప్పించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం హౌరా జిల్లాలోని డోంజుర్ సమీపంలో ఎన్‌హెచ్ 16పై వేగంగా వస్తున్న లారీ మంత్రి కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయారు. కారు బాగా దెబ్బతిన్నది. కాన్వాయ్ వెళు తుండగా మంత్రికి ప్రమాదం జరిగిందని, ఆయన ఎలాంటి గాయాలు లేకుండా క్షేమంగా ఉన్నారని పోలీసు అధికారి వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ తన కారును ఢీకొట్టిన లారీ డ్రైవర్

- మిగతా 2 లో

'ఎడ్యుకేట్ గర్ల్స్'కు మెగసెసే అవార్డు

న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ ఎన్జీఓ 'ఎడ్యుకేట్ గర్ల్స్'ను ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించింది. రామన్ మెగసెసే అవార్డు-2025 అందుకున్న మొట్టమొదటి భారతీయ సంస్థగా చరిత్ర సృష్టించింది. ఆసియాలో నోబెల్ బహుమతిగా పిలవబడే ఈ అవార్డు... నిస్వార్థ సేవలు అందించే వ్యక్తులు, సంస్థలకు అందజేస్తారు. విజేతలను రామన్ మెగసెసే అవార్డు ఫౌండేషన్ (ఆర్ఎంఏఎఫ్) ఎంపిక చేస్తుంది. మనీలాలోని మెట్రోపాలిటన్ థియేటర్‌లో జరిగే 67వ అవార్డు ప్రదానోత్సవంలో ఈ ఏడాది పురస్కార గ్రహీతలకు నవంబర్ 7న

- మిగతా 2 లో

దద్దరిల్లిన అసెంబ్లీ

కాళేశ్వరంపై వాడివేడి చర్చ

- అధికార-ప్రతిపక్ష సభ్యుల మాటలయుద్ధం
- హరీశ్ చెప్పేవి అవాస్తవాలు: సీఎం రేవంత్ రెడ్డి
- నిజాలు బయటపెట్టారనే ఘోష్ నివేదికపై అక్కసు
- రికార్డులను కావాలనే బీఆర్ఎస్ ప్రభుత్వం తొక్కిపెట్టిందని వ్యాఖ్య

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ సమావేశం రెండోరోజు ఆదివారం వాడివేడిగా సాగాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం సభ ముందుంచగా దీనిపై అధికార, ప్రతిపక్ష సభ్యుల పరస్పరణ ఆరోపణలతో సభ దద్దరిల్లింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్‌ను తొలగిస్తూ బిల్లును ప్రవేశపెట్టి, దానికి ఆమోదం కూడా తెలిపింది. మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. కాళేశ్వరం నివేదిక, బీసీలకు కోటా పెంపుపై అధికార,ప్రతిపక్ష సభ్యుల మధ్య విమర్శల హోరు సాగింది. మాజీమంత్రి హరీశ్ రావు శాసనసభ వేదికగా చెప్పిన అబద్ధాన్ని మళ్లీ మళ్లీ చెబుతున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఆనాడు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఈనాటికీ మంత్రిగా ఉన్నట్టుగానే భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పై జస్టిస్ సీపీ ఘోష్ ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. ముందుగా హరీశ్‌రావుకు స్పీకర్ అరగంట సమయం ఇచ్చారు. ఆయన రెండు గంటల సమయం కోరగా హరీశ్‌రావు విజ్ఞప్తిపై అధికార కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. 650పేజీలపై అరగంటలో ఎలా సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సభ్యులను హరీశ్ నిలదీశారు. అయితే అరగంటలోనే ప్రసంగం పూర్తి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. హరీశ్ ప్రసంగం అనంతరం సీఎం.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... అవాస్తవ సమాచారంతో హరీశ్‌రావు తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్లలో నీరు అందుబాటులో ఉంది. హైడ్రాలజీ అనుమతులు ఇస్తున్నామని ఆనాటి కేంద్ర మంత్రి ఉమా భారతి 24-10- 2014 న స్పష్టంగా చెప్పారన్నారు. 205 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని లేఖరాస్తే.. మళ్లీ పటిశీలించాలని హరీశ్‌రావు లేఖ రాశారని గుర్తు చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచి సర్టిఫికెట్ తీసుకున్నాక మళ్లీ పరిశీలించాలని ఎవరైనా అడుగుతారా అంటూ ఎద్దేవాచేశారు. 2009 లో కూడా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరు అందుబాటులో ఉందని అనుమతి నిచ్చిందన్నారు. ఈ రికార్డులను కావాలనే ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఆరోపించారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టులో వాస్తవాలను బయటపెట్టారనే వారిపై విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. హరీశ్‌రావు తప్పు చేశారని నివేదికలోని పేజీ నెంబర్ 98 లో స్పష్టంగా పొందుపరిచారని, సీబీఐ కావాలా, సీబీ సీఐడీ కావా లో చెప్పకుండా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అసంపూర్తి సమాచారంతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. నీరు అందుబాటులో ఉందని చెప్పినా మళ్లీ పరిశీలించాలని లేఖ రాయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ప్రాజెక్టు నిర్మించుకుంటామని వాదించకుండా...పేరు మార్చి ఊరు మార్చి దోపిడీకి పాల్పడ్డారని దుయ్యబట్టారు. 2014 లో నీరు అందుబాటులో ఉందని చెప్పిన విషయం దాచి 13 మార్చి 2015 న ఉమా భారతి లేఖను పట్టుకుని హరీశ్ కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాసాగర్ రావు బతికి ఉంటే వీళ్ల అబద్ధాలు వినలేక అదే కాళేశ్వరంలో దూకి ఆత్మహత్య చేసుకునేవారన్నారు.

తుమ్మిడిహట్టి కట్టొద్దని మహారాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ చెప్పలేదు

మహారాష్ట్ర ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టొద్దని ఎప్పుడూ

- మిగతా 2 లో

ఓటు హక్కు హరిస్తున్న మోదీ

- విద్యకు... కేరళ రాష్ట్రానికి బలమైన బంధం
- తెలంగాణలో విద్యారంగానికి పెద్దపీట
- పదేళ్లలో ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం
- 2029లో రాహుల్‌ను ప్రధానిని చేద్దాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : యువతకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వారిలో ఉన్న శక్తిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ పరిక్షణ కోసం పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వద్ద ఆర్థిక బలం... మీడియా మద్దతు లేదన్నారు. కేవలం యువత, యువతలోని శక్తిని నమ్ముకుని ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడుతుందని పేర్కొన్నారు. బీజేపీ... యువత హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేరళలోని అలెప్పీలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ యువత హక్కులను పరిరక్షిస్తుందని అన్నారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే సంవత్సరంగా అందరికీ చాటుదామని పిలుపునిచ్చారు. మీరే మా నమ్మకం, మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు, మీ భవిష్యత్తు కోసం పోరాటం చేయండి, దేశం కోసం పోరాటం చేయండి, మీరంతా ఆ పని చేస్తారని బలంగా విశ్వసిస్తున్నా అని అన్నారు. కేసీ వేణుగోపాల్ ఎల్లప్పుడూ పేదలు... అణగారిన వర్గాల కోసం పోరాడుతూనే ఉన్నారని పేర్కొన్నారు. అణిచివేతకు, అన్యాయానికి గురవుతున్న బాధితుల తరపున వారి గొంతుకగా నిలుస్తున్నారని తెలిపారు. వేణుగోపాల్ ... తన నియోజకవర్గంతో పాటు కేరళ రాష్ట్రానికే కాకుండా దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారని చెప్పారు. ఆయన 2006 లో ప్రారంభించిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డులకు దేశంలోనే చాలా ప్రత్యేకత ఉందన్నారు. 10వ తరగతి, 12వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి, వారిలో ఒక స్ఫూర్తిని నింపడానికి ఈ మెరిట్ అవార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయని వివరించారు. ఈ ఏడాది వంద శాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లో దాదాపు 3,500 లకుపైగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులు అందిస్తున్నారని

- మిగతా 2 లో

మరో మూడు రోజులు వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మరో రెండు రోజుల్లో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో ఏపీలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రాష్ట్రంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. పశ్చిమ బెంగాల్-ఒడిశా తీరాలకు ఆనుకొని వాయువ్య బంగాళాఖాతం మీదుగా సముద్ర మట్టానికి సగటున 1.5-5.8 కిమీ ఎత్తులో ఉపరితల ఆవవర్తనం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. తీరం వెంబడి గంటకు 40-60 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగుల వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గోదావరికి పెరుగుతున్న వరద

మరోవైపు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద ప్రవాహం మళ్లీ పెరుగుతోంది. ఆదివారం

- మిగతా 2 లో

దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి...

రిజర్వేషన్లపై బీసీలను మోసగించే యత్నం

శాసనసభలో కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లేందుకు సమయం తీసుకోవాలని, తాము కూడా వచ్చి బలంగా మద్దతు ఇస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శాసనసభలో ఆదివారం పంచాయతీ రాజ్ చట్ట సవరణపై కేటీఆర్ మాట్లాడుతూ... గతంలో కేసీఆర్ దిల్లీకి వెళ్తూ తెలంగాణ సాధించుకు వస్తా అని చెప్పివెళ్లారని, ఇప్పుడు నిజంగా చిత్తశుద్ధి ఉంటే సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే విధంగా దిల్లీకి వెళ్లి బీసీ బిల్లు సాధించే వరకు జంతర్ మంతర్లోనే కూర్చోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేయాలన్నారు. అంతటి నిబద్ధత ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ఉండాలన్నారు. బీసీల రిజర్వేషన్లు తెలంగాణలో ఆమోదం పొందకముందే... తెలంగాణ ప్రజల సొమ్ముతో బీహార్లో ముఖ్యమంత్రి తన ఫొటోలతో పత్రిక ప్రకటనలు ఇచ్చుకుంటున్నాడని దుయ్యబట్టారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీలకు ఓబీసీ వెల్ఫేర్ శాఖ పెట్టాలని డిమాండ్ చేసిన నాయకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. 2004లోనే కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ పెట్టాలని కేసీఆర్ డిమాండ్ చేశారని, 2002లోనే బీసీ పాలసీని పార్టీ తరపున తీసుకొచ్చిన నాయకుడని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కంటే ముందే కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, జనగణనతో పాటు కులగణన కోసం డిమాండ్ చేశారన్నారు. 42శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇరుక్కుపోయిందని, అందుకే తమ

- మిగతా 2 లో

మున్సిపాల్టీలు నిర్వీర్యం

- నో ఎల్ఆర్ఎస్, నో కాంగ్రెస్ అనే రోజు వస్తుంది
- అసెంబ్లీలో హరీశ్ రావు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ... ఆర్థిక బిల్లులు ఇవ్వడం లేదు సరికదా కనీసం అసెంబ్లీలో పెట్టే బిల్లుపైనైనా మాట్లాడించండని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కోరారు. మున్సిపాలిటీ సవరణ బిల్లుపై ఆదివారం అసెంబ్లీలో మాజీ మంత్రి మాట్లాడుతూ కొన్ని మున్సిపాలిటీలలో పంచాయతీలను చేరుస్తూ గతంలో వచ్చిన ఆర్డినెన్స్‌ను సభ ముందుకు తీసుకువచ్చారు. ఈ బిల్లును పూర్తిగా సమర్థిస్తున్నాం... మద్దతిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలలు అవుతుంది మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉందని, ఎన్ని మున్సిపాలిటీలు ఏర్పాటు చేశాం అన్నది ముఖ్యం కాదు, మున్సిపాలిటీలను ఎంత మేరకు అభివృద్ధి చేశామని, నిధులు ఇస్తున్నారా లేదా అనేది ముఖ్యమన్నారు. సిద్దిపేటలో మున్సిపాలిటీ ఉంది ... 1,20,000 ఓట్లు ఉంటాయి ... కనీసం దోమల నివారణకు కూడా డబ్బులు ఇవ్వని పరిస్థితిలో ప్రభుత్వం

- మిగతా 2 లో

హైదరాబాద్‌కు సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్ ఎంపీల స్వాగతం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇండియా ఐక్యసంఘటన ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. తన అభ్యర్థిత్వానికి మద్దతు కోరడంలో భాగంగా ఆయన ఇక్కడికి వచ్చారు. షంషాబాద్ విమానాశ్రయంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ ఎంపీలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడతారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల మద్దతు కోరడం కోసం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి శనివారం రాంచిలో ఉన్నారు. పార్టీలకతీతంగా తనకు మద్దతు ఇవ్వాలని ఆయన ఎంపీలను కోరారు. తన ప్రచారంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇప్పటికే తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, శివసేన(ఉద్ధవ్) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే తదితరులను కలిశారు. సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఐతే.. మన ఊరి మీద విమానాశ్రయం పడుతుందా? త్వరలో.

నిరసనల హోరు

ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఇటలీలో ఆందోళనలు

సిడ్నీ/జకర్త: ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఆందోళన బాట పడుతున్నారు. చాలా దేశాల్లో ప్రజా నిరసనలు హోరెత్తుతున్నాయి. ఆస్ట్రేలియా, ఇండోనేసియా, ఇటలీ దేశాల్లో ప్రజలు వీధుల్లోకి వచ్చారు. వేలాది మంది నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆస్ట్రేలియాలో వలసకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. ఇండోనేసియా ఆర్థిక మంత్రి ఇంటిని లూటీ చేశారు. ఎంపీల ఇళ్లపై మూకదాడులు జరిగాయి. ఇటలీలోని వెనిస్‌లో ఫిలిం ఫెస్టివల్ సందర్భంగా గాజా, పలస్తీనా ప్రజలకు మద్దతుగా భారీ ప్రదర్శన జరిగింది. మారణహోమం ఆపాలన్న నినాదాలతో ఆ ప్రాంతాన్ని ఆందోళనకారులు దద్దరిల్లించారు.

వలసలు ఆపండి: ఆస్ట్రేలియా ప్రజల డిమాండ్

ఇమిగ్రేషన్ల (వలసలు)కు వ్యతిరేకంగా ఆస్ట్రేలియా వ్యాప్తంగా అనేక చోట్ల భారీ ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. ఆస్ట్రేలియాకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్న డిమాండ్‌తో తమ ప్రభుత్వాన్ని నయా నాజీలంటూ ప్రజలు వేలాది సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. ద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలను ఆక్షేపించారు. రాజధాని సిడ్నీ సహా అనేక ప్రధాన నగరాల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించారు. సిడ్నీ ర్యాలీలో సుమారు ఎనిమిది వేల మంది వరకు పాల్గొన్నట్లు ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొ వెల్లడించింది. ఆస్ట్రేలియా జెండాలతో ప్రజలు నిరసనల్లో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బ్యానర్లను ప్రదర్శించారు. ఇదే క్రమంలో జరిగిన సిడ్నీ మారథాన్‌లో 35వేల మంది పాల్గొన్నారు. ఓపెరా హౌస్ వరకు పరుగు పెట్టారు. సామూహిక వలసలను నివారించే దమ్ము రాజకీయ నాయకులకు లేదని దుయ్యబట్టారు. వలసలు ఆపాలంటూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

ఇండోనేసియాలో అనిశ్చితి: ఆర్థిక మంత్రి, ఎంపీల ఇళ్లపై దాడి

ఇండోనేసియాలో అనిశ్చితి నెలకొన్నది. ఎంపీలకు ప్రోత్సాహకాలకు భారీగా వ్యతిరేకత వచ్చింది. వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. అల్లర్లు సృష్టించారు. దీంతో పోలీసులు, సైన్యాన్ని మోహరించిన ప్రబోవో ప్రభుత్వం తగు చర్యలు తీసుకునేలా భద్రతా సిబ్బందికి ఆదేశాలిచ్చింది. కీలక ప్రాంతాల్లో సైన్యంతో భద్రత ఏర్పాటు చేసింది. ఈ నిరసనల్లో ఐదుగురు చనిపోయారు. పార్లమెంటు సభ్యులకు అనేక ప్రయోజనాలు, ప్రోత్సాహకాలు కల్పించేందుకు ఇండోనేసియా రాజకీయ పార్టీలు అంగీకరించినట్లు ఆదివారం అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ప్రకటించారు. నిరసనకారులను శాంతిపజేసే ప్రయత్నం చేశారు. దశాబ్దాల్లో జరగని రీతిలో ఆందోళనలు జరగడంపై ఆందోళన వ్యక్తంచేశారు. కాగా, శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నిరసనకారులు రెచ్చిపోయారు. ఆర్థిక మంత్రి నివాసాన్ని లూటీ చేశారు. రాజధాని జకార్త సరిహద్దు నగరమైన తాంగెరంగ్‌లోని మంత్రి ముల్యాని ఇంద్రావతి ఇంటిలోకి 150 మంది గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి టీవీ, సౌండ్ సిస్టమ్, హాల్‌లోని అలాంకార సామగ్రి, వస్త్రాలు, గాజు వస్తువులు, ఖరీదైన ప్లేట్లు, గిన్నెలు దోచుకుపోయారని, వీళ్లంతా బైకులపై వచ్చారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. లూటీ జరిగినట్లు మంత్రి ఇంట్లో లేరని స్థానిక మీడియా వెల్లడించింది. నస్‌డెమ్ పార్టీ ఎంపీ అహ్మద్ సహ్రోనితో పాటు అనేక మంది ఎంపీల ఇళ్లలోనూ ఈ తరహా లూటీలు, మూకదాడులు జరిగాయి. ఎంపీల ఇళ్లలోకి చొరబడి వస్తువులును, వాహనాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. ఉత్తర సుమత్రా ప్రావిన్స్‌లోని మేదన్ నగరం, జావాలోని యోగ్యకర్త, బందుంగ్, సెమారంగ్, సూర్యబయా తదితర ప్రాంతాల్లోనూ భారీ స్థాయిలో ఆందోళనలు జరిగినట్లు అంకారా వార్తా సంస్థ వెల్లడించింది. కాగా, నిరసనల క్రమంలో పార్లమెంటు సభ్యులకు ప్రోత్సాహకాలు అందించడంపై ఇండోనేసియా ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

గాజా కోసం వెనిస్‌లో ర్యాలీ

ఇటలీ, వెనిస్‌లో ప్రతిష్ఠాత్మకంగా జరిగే చలనచిత్ర ఉత్సవం సందర్భంగా గాజాకు మద్దతుగా భారీ ప్రదర్శన జరిగింది. గాజా స్వాధీనానికి ఇజ్రాయిల్ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు మార్మోగాయి. పలస్తీనా ప్రజల మారణహోమాన్ని తక్షణమే ఆపాలన్న డిమాండ్ వినిపించింది. బ్యానర్లు కనిపించాయి. వామపక్ష సంఘాల అధ్వర్యంలో సుమారు నాలుగు వేల మందితో ఈ ప్రదర్శన జరిగింది. లిడో జిల్లాలో ఫిలిం ఫెస్టివల్ ప్రాంగణం వరకు పలస్తీనా జెండాలతో ప్రదర్శనకారులు కదం తొక్కారు. 'గాజాలో మారణహోమం ఆపండి' అన్న భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. హాలీవుడ్ నటీనటులు కూడా గాజాకు మద్దతు పలికారు. డైరెక్టర్ మరియం తౌజాని 'గాజాలో మారణహోమం ఆపండి' అని రాసివున్న బ్యాగుతో రెడ్ కార్పెట్‌పై మెరిశారు. మారణహోమానికి మీరంతా సాక్షులు అన్న బోర్డు అక్కడ కనిపించింది. పలస్తీనాకు ప్రతి ఒక్కరు తమ వంతు మద్దతు తెలపాలని ప్రదర్శనకారులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ చలన చిత్ర ఉత్సవంగా వెనిస్ ఫిలిం ఫెస్టివల్ వేదికగా ఈ మేరకు పిలుపు ఇవ్వడం ముఖ్యమన్నారు. ఇది మానవతా పరిస్థితి... రాజకీయ పరిస్థితి కాదు అంటూ నొక్కి చెప్పారు. 'అక్కడ ఏం జరుగుతోందో మనందరికీ తెలుసు... దానిని కొనసాగించనివ్వడం ఆమోదయోగ్యం కాదు'... మారణహోమం ఆపండి... పలస్తీనాకు విముక్తి కల్పించండి' అంటూ నినాదాలు ఇచ్చారు. ఇదే క్రమంలో వెనిజ్ 4 పలస్తీనా అనే సంస్థ రాసిన లేఖపై రెండు వేల మంది చిత్రసీమ ప్రముఖులు సంతకాలు చేశారు. మేలో జరిగిన కేన్స్ ఫిలిం ఫెస్టివల్ సమయంలోనూ ఇటువంటి ప్రదర్శన జరిగిన విషయం విదితమే.

కలిసుందాం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడుల విస్తరణకు అంగీకరించారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సులో భాగంగా తియాంజిన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యారు. దాదాపు 50 నిమిషాలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఎస్‌సీఓ అధ్యక్ష బాధ్యతలు చేపట్టినందుకు జిన్‌పింగ్‌కు మోదీ తొలుత శుభాకాంక్షలు తెలిపారు. తనను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు చెప్పారు. జిన్‌పింగ్ స్పందిస్తూ మళ్లీ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కజాక్ సమావేశాన్ని గుర్తుచేసుకున్నారు. జిన్‌పింగ్ తన ప్రారంభ ప్రసంగంలో భారత్-చైనా దేశాలను 'ప్రాచీన నాగరికతలు'గా అభివర్ణించారు. అత్యధిక జనాభా కలిగిన దేశాలుగా.'గ్లోబల్ సౌత్'లో ముఖ్య సభ్య దేశాలుగా భారత్, చైనా తమ ప్రజల సంక్షేమాన్ని పెంపొందించే చారిత్రక బాధ్యతను మోస్తున్నాయన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల పునరుజ్జీవనం, మానవ సమాజ పురోగతిని ప్రోత్సహించడంలో కలిసి ముందుకెళ్లాలన్నారు. ఇరుగు-పొరుగు సంబంధాలను కలిగి వుండాలని, స్నేహంగా మెలగాలని, పరస్పర విజయాలను ప్రోత్సహించుకునే భాగస్వాములుగా ఉండాలని, ఇదే రెండు దేశాలకు మంచిదని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. చైనా-భారత్ దౌత్య బంధానికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తమ దేశాలు వ్యూహాత్మక దృక్పథంతో, దీర్ఘకాలిక ఆలోచనతో ముందుకెళ్లాలని జిన్‌పింగ్ సూచించారు. మోదీ మాట్లాడుతూ పరస్పరం నమ్మకం, గౌరవం, సున్నితత్వంతో తమ రెండు దేశాల మధ్య బంధాన్ని కొనసాగించడం కోసం భారత్ కట్టుబడి ఉందని చెప్పారు. గతేడాది కజాన్‌లో జిన్‌పింత్‌తో జరిగిన ఫలప్రదంగా జరిగిన చర్చలతో తమ బంధానికి సానుకూలమైన దిశా నిర్దేశం లభించిందని మోదీ గుర్తుచేశారు. సరిహద్దు నుంచి సైన్యాన్ని ఉపసంహరించడం ద్వారా రెండు దేశాల మధ్య శాంతి-సుస్థిరత నెలకొన్నట్లు తెలిపారు. చైనా-భారత్ మధ్య నేరుగా విమానాలు రాకపోకలను పునరుద్ధరించడం, కైలాశ మానససరోవర్ యాత్రను పున:ప్రారంభించడం వంటి పరిణామాలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలను ఇద్దరు అధినేతలు చర్చించారు. అమెరికా వల్ల వాణిజ్య ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం తదితర అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రెండు దేశాల సహకారంతో 2.8 బిలియన్ల మంది ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని మోదీ అన్నారు. మోదీ అంతకుముందు ఎస్‌సీఓ సదస్సు వేదికకు చేరుకున్నప్పుడు జిన్‌పింగ్ దంపతులు ఆయనను ఆహ్వానించారు. కరచాలనం చేసుకొని, చిరునవ్వుతో ఒకరొనొకరు పలుకరించుకున్నారు. ఇదిలావుంటే, శిఖరాగ్ర సదస్సులో భాగంగా మైన్మార్, కజకస్థాన్, బెలారస్, తజికిస్థాన్, ఈజిప్టు, నేపాల్, మాల్దీవులు తదితర దేశాల అధినేతలతోనూ మోదీ సమావేశమయ్యారు. ప్రాదేశిక-ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ప్రపంచ దేశాధినేతలతో కలిసి ఫొటో దిగారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సోమవారం మోదీ సమావేశం కానున్నారు. శాంతి చర్చల కోసం పుతిన్‌తో మాట్లాడాలంటూ భారత్‌కు ఉక్రెయిన్ విజ్ఞప్తి, అమెరికా సుంకాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

భారత్ రండి: జిన్‌పింగ్‌కు మోదీ ఆహ్వానం

భారత్‌కు రావాలని జిన్‌పింగ్‌ను మోదీ ఆహ్వానించారు. 2026లో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ తెలిపింది. ఎస్‌సీఓలో భాగంగా జరిగిన సమావేశం అనంతరం జిన్‌పింగ్‌ను మోదీ ఆహ్వానించినట్లు పేర్కొంది.

దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లండి

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో లేని అంశంపై చట్టం తీసుకువచ్చి బీసీలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ... ఎందుకు 42శాతం రిజర్వేషన్ అంశాన్ని పార్లమెంట్‌లో మాట్లాడడం లేదని ప్రశ్నించారు. . కేవలం బీసీ డిక్లరేషన్లు ఇచ్చి వదిలేస్తే సరిపోదు, కట్టుబడి ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని, గతంలో మేం పెట్టిన పంచాయతీరాజ్ చట్టం... మున్సిపల్ చట్టంలో ఎక్కడా సీలింగ్ అనే అంశం లేదన్నారు.

రాజకీయ పార్టీల మాటున నేరగాళ్ల దందా

న్యూదిల్లీ: దేశంలో లౌకికవాదం, పారదర్శకత, రాజకీయ న్యాయం పెంపొందించేలా రాజకీయ పార్టీల ఏర్పాటు, వాటి నియంత్రణ కోసం నియమాలు రూపొందించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పీఐఎల్) దాఖలైంది.

బోగస్ రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పును కలిగించడమే కాకుండా భారీ మొత్తంలో నిధులు సమకూర్చినందుకు కరడుగట్టిన నేరస్థులు, కిడ్నాపర్లు, మాదకద్రవ్యాల స్మగ్లర్లు, మనీలాండరింగ్ చేసేవారిని జాతీయ, రాష్ట్ర ఆఫీసు బేరర్లుగా నియమించడం ద్వారా దేశాన్ని అపఖ్యాతి పాలు చేస్తున్నాయని పిటిషన్ ఆరోపించింది. "ప్రస్తుతం రాజకీయ పార్టీలకు ఎటువంటి నియమాలు, నిబంధనలు లేవు. అందువల్ల, చాలా మంది వేర్పాటువాదులు విరాళాలు సేకరించడానికి రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పార్టీల్లోని కొంతమంది ఆఫీస్ బేరర్లు పోలీసు రక్షణ పొందడంలో కూడా విజయం సాధించారు" అని న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్ పేర్కొంది. ఇటీవలి మీడియా నివేదికను ప్రస్తావిస్తూ... 20 శాతం కమిషన్ తగ్గించడం ద్వారా నల్లధనాన్ని తెల్లగా మారుస్తున్న నకిలీ రాజకీయ పార్టీని ఆదాయపు పన్ను శాఖ కనుగొందని పిటిషన్ పేర్కొంది. 'రాజకీయ పార్టీల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం ప్రజా ప్రయోజనాలకు చాలా అవసరం. ఎందుకంటే అవి ప్రజా విధులను నిర్వహిస్తాయి.

ఓట్ల చోరీపై ప్రజా చైతన్యం

పట్నా: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బీహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'కు ప్రజలనుంచి అపూర్వ ఆదరణ లభించింది. ఆగస్టు 17న బీహార్‌లోని ససారాం నుండి ప్రారంభమైన ఈ యాత్ర పదహారు రోజులపాటు దాదాపు 1300 కి.మీ.ల పాటు 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా సాగింది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ఎన్నికల సంఘం చేపట్టడాన్ని రాహుల్‌గాంధీ సహా ఇండియా ఐక్యసంఘటన నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కై లక్షలాది ఓట్లను తొలగించారని రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. అలాగే ఒకే ఇంటి నంబరుతో వందలాది మంది ఓటర్లు ఉన్న విషయాలను ప్రస్తావించారు. "ఓటు చోర్, గద్దీ చోర్" నినాదాన్ని ప్రజల్లోకి గట్టిగా తీసుకువెళ్ల గలిగారు. ఈ క్రమంలో ఆయన మహిళా, రైతు సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలను లేవనెత్తుతూ స్థానికులకు మరింత చేరువయ్యారు. బీహారీల మాదిరిగా టవల్‌ను మెడపై వేసుకోవడం, బైక్‌ను స్వయంగా నడుపుతూ, హైవే వెంట దాబాలను సందర్శిస్తూ స్థానికులతో మమేకమయ్యే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో మహిళలు, దళితులు, ముస్లింలు, యాదవ్‌లు, గిరిజన, ఓబీసీ, ఈబీసీ వర్గాల వారి సమస్యలను ప్రస్తావిస్తూ వారికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేశారు. కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ సర్కార్లపై నిప్పులు చెరిగారు. యాత్ర యావత్తు హైబ్రిడ్ విధానం అంటే... కొన్ని చోట్ల పాదయాత్రగానూ, మరికొన్ని ప్రాంతాల్లో వాహనంపై రాహుల్ యాత్ర కొనసాగించారు. రాహుల్‌తోపాటు ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్, సీపీఐ-ఎంఎల్‌కు చెందిన దీపాంకర్ భట్టాచార్య, వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీకి చెందిన ముఖేష్ సహానీ యాత్ర అంతటా ఓపెన్ జీపులో కలిసి ప్రయాణించారు. వారు ఐక్యతను ప్రదర్శించి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు "ఓట్ చోరి" అనే సందేశాన్ని తీసుకెళ్లారు. నాయకులు ప్రతిరోజూ వివిధ ప్రదేశాలలో నిర్వహించన సభల్లో ప్రసంగించారు "ఓట్ చోర్, గద్దీ చోర్" అనే నినాదాలు ప్రతిధ్వనించాయి. బీహార్‌లో ఎస్ఐఆర్ ద్వారా ఓట్లను దొంగిలించడానికి ఎన్నికల సంఘం, బీజేపీ కుట్ర పన్నుతున్నాయని ప్రజలకు వివరించారు. తమిళనాడు సీఎం స్టాలిన్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, వామపక్ష నేతలతోపాటు కాంగ్రెస్ సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య ఈ యాత్రలో పాల్గొన్నారు. కాగా 'ఓటర్ అధికార్ యాత్ర' త్వరలో ఎన్నికలు జరిగే బీహార్‌లో ఎన్నికల ప్రచారానికి నాంది పలికినట్లయింది. సోమవారం యాత్ర ముగింపు సందర్భంగా పట్నాలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఇండియా ఐక్య సంఘటన నేతృత్వంలో పట్నాలో గాంధీ మైదాన్ నుండి డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ విగ్రహం, అంబేద్కర్ పార్క్ వరకు ర్యాలీ సాగనుంది. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ సహా ఇతర పార్టీల ప్రతినిధులు చివరిరోజు (సెప్టెంబర్ 1) యాత్రలో పాల్గొననుండగా.. మమతా బెనర్జీ తరఫున ప్రతినిధులను పంపించే అవకాశం ఉందని సమాచారం. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ... లక్షలాదిమందికి చేరువైన ఈ యాత్రకు భారీ ర్యాలీ పరాకాష్ఠగా నిలవనుందని తెలిపారు. 'ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జీ, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ జీ, మొత్తం మహాఘట్బంధన్ ప్రారంభించిన ఓటరు అధికార్ యాత్రకు బీహార్ ప్రజలు అపూర్వ మద్దతు ఇచ్చారు" అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాహుల్ చేపట్టిన యాత్ర ను బీహార్ ప్రజలు ఆశాకిరణంగా భావించారని ఆయన అన్నారు. 25 జిల్లాలకు పైగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1300 కి.మీ.లకు పైగా సాగిన ఈ యాత్ర బీహార్ గొప్ప ప్రజా ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. 'మా లక్ష్యాన్ని విశ్వసించిన తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ సిట్టింగ్ సీఎంలు, అలాగే అఖిలేశ్‌జీ, ప్రియాంక గాంధీజీ వంటి ఇతర సీనియర్ నాయకులు ఈ యాత్రలో పాల్గొని మరింత బలాన్ని అందించారు' అని ఆయన అన్నారు.

మరో మూడు రోజులు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం 47.9 అడుగులు ఉండగా... సాయంత్రం 6 గంటలకు 48.1 అడుగులు నమోదైంది. ఆదివారం ఉదయం ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 10.92 లక్షల క్యూసెక్కులు ఉండగా... సాయంత్రానికి 11.47 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని ప్రఖర్ జైన్ తెలిపారు. వర్షాల ప్రభావంతో కృష్ణా, గోదావరి నదుల వరద ప్రవాహం హెచ్చుతగ్గులుగా మరో నాలుగు, ఐదు రోజులు ఉండొచ్చని వెల్లడించారు. పూర్తిస్థాయిలో వరద తగ్గే వరకు ప్రజలు పొంగిపొర్లే నదులు, వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు.

'ఎడ్యుకేట్ గర్ల్స్'కు మెగసెసే అవార్డు

(మొదటిపేజీ తరువాయి)

పతకాలు, పత్రాలు అందజేస్తారు. 2007లో సఫీనా హుసైన్ స్థాపించిన ఎడ్యుకేట్ గర్ల్స్, రాజస్థాన్‌లో ప్రారంభమై గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో పాఠశాలకు వెళ్లని బాలికలను బడిబాట పట్టించే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తోంది. ఇప్పటివరకు 20 లక్షల మందికిపైగా బాలికలను పాఠశాలలో చేర్చి, వారి జీవితాలు మార్చింది. సఫీనా హుసైన్ మాట్లాడుతూ, 'బాలికల విద్య కోసం ప్రజల శక్తితో నడిచే ఉద్యమానికి ప్రపంచస్థాయి గుర్తింపును ఈ అవార్డు తెచ్చింది. ఒక గ్రామంలోని ఒకే ఒక్క బాలికతో మొదలైన ఈ ఉద్యమం, సమాజాలను మార్చడంలో విజయం సాధించింది' అని అన్నారు. ఈ విజయం ప్రభుత్వం, దాతలు, సమాజాల భాగస్వామ్యంతో సాధ్యమైందని సంస్థ సీఈఓ గాయత్రి నాయర్ లోబో తెలిపారు.

దద్దరిల్లిన అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

చెప్పలేదని, కేవలం ఎత్తు తగ్గించుకోవాలని మాత్రమే వాళ్లు సూచించారన్నారు. నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితో కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని, మేడిగడ్డ దగ్గర కట్టాలని కేసీఆర్, హరీశ్ ముందే నిర్ణయించుకున్నాక రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీని నియమించారని తెలిపారు. రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక వారికి అనుకూలంగా లేదని ఆ నివేదికను తొక్కిపెట్టి వాళ్లు అనుకున్న చోట ప్రాజెక్టు కట్టారని పేర్కొన్నారు. వీళ్ల ఉద్దేశమే తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు తరలించడం, వీళ్ల ప్రణాళికలకు ఆదిలోనే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అడ్డు చెబితే ఆ నివేదికను కనిపించకుండా మాయం చేశారన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర ఇచ్చిన వార్నింగ్ క్లాజ్ ను మేడిగడ్డ విషయంలోనూ పేర్కొన్నారని, దీనికి శిక్షించాల్సి వస్తే వీళ్లని ఉరి తీయాలి కదా అంటూ వ్యాఖ్యానించారు. ఏ కారణంతో తుమ్మిడిహట్టి వద్ద ఇచ్చిన హెచ్చరికను కారణంగా చూపి ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చారో, మేడిగడ్డ విషయంలో అదే హెచ్చరిక ఉందని పీసీ ఘోష్ కమిషన్ పేజీ నెంబర్ 72 లో పేర్కొందన్నారు. అందుకే హరీశ్ రావు కమిషన్ నివేదికపై తన అక్కసు వెళ్లగక్కుతున్నారని, ఆయన తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందనే కదా తెలంగాణ తెచ్చుకున్నది... కానీ ఏనుగులను తినేవాళ్లు పోయారనుకుంటే పీనుగులను తినేవాళ్లు వచ్చారని ధ్వజమెత్తారు. ఇప్పటికీ హరీశ్‌రావు మొండి వాదనకు దిగుతున్నారని, రిటైర్డ్ ఇంజనీర్స్ కమిటీ నివేదికను పట్టించుకోకుండా దురుద్దేశ పూర్వకంగా రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టారని ఘోష్ కమిషన్ నివేదికలో పేజీ నెంబర్-63 లో స్పష్టంగా చెప్పారని తెలిపారు. ఎక్స్‌పర్ట్ కమిటీ విచారణలో తన మామ, బావమరిది చేశారని హరీశ్‌రావు తన నిస్సహాయతను ఒప్పుకున్నారని 65వ పేజీలో స్పష్టంగా ఉందన్నారు. అందుకే నివేదికపై చర్చ జరగకుండా హరీశ్ రావు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికైనా ఏ విధమైన విచారణ చేపట్టాలో హరీశ్‌రావు చెప్పాలని కోరారు.

పీసీ ఘోష్ నివేదిక ఓ డొల్ల రిపోర్ట్: హరీశ్ రావు

తొలుత మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక రాజకీయ ప్రేరేపితమని, అదో డొల్ల రిపోర్ట్ అని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ నివేదిక న్యాయస్థానంలో నిలబడదన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ నిష్పాక్షికంగా సాగలేదని హరీశ్‌రావు ఆరోపించారు. విచారణ కమిషన్ల చట్టంలోని సెక్షన్ 8బి, 8సి ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, కమిషన్ ఆ నిబంధన పాటించలేదని గుర్తుచేశారు. గతంలో ఇలాంటి సందర్భాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావిస్తూ, ఈ నివేదిక చట్టబద్ధంగా చెల్లదని పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ కుట్రలో భాగమేనని, తమ రాజ్యాంగ హక్కును వినియోగించుకుని ఇప్పటికే ఈ నివేదికను రద్దు చేయాలని కోర్టును ఆశ్రయించినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. ఆరోపణలు చేసి, మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం సరికాదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. విచారణ కమిషన్ తన నివేదికలో ఎవరిపైనైనా ఆరోపణలు చేయాలనుకుంటే, ముందుగా వారికి సెక్షన్ 8బీ కింద నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకోవడంతో పాటు, క్రాస్ ఎగ్జామినేషన్ చేసుకునే అవకాశం కల్పించాలన్నది చట్టంలోని కీలక నిబంధన అని హరీశ్ రావు గుర్తుచేశారు. కానీ, జస్టిస్ ఘోష్ కమిటీ ఈ ప్రాథమిక సూత్రాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గానీ, తనకు గానీ, విచారణకు పిలిచిన ఇతర నేతలు, అధికారులకు గానీ ఈ నోటీసులు ఇవ్వలేదని, అందువల్ల ఈ విచారణ నిష్పక్షపాతంగా జరగలేదని ఆయన స్పష్టం చేశారు.

కాళేశ్వరం నిర్మాణంలో తీవ్ర లోపాలున్నాయి: మంత్రి ఉత్తమ్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో డ్యామ్‌కు, బ్యారేజీకి మధ్య తేడా పాటించకుండా ఘోరమైన తప్పిదాలకు పాల్పడ్డారని, దాని పర్యవసానమే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి కారణమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ సంచలన విషయాలను వెల్లడించారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికలోని అంశాలను ఆయన ప్రస్తావించారు.

ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాల వల్ల మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు గత 20 నెలలుగా పూర్తిగా నిరుపయోగంగా మారాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ఖజానాపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.87,449 కోట్లతో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం, చివరికి రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని విమర్శించారు. ఇంత భారీగా ఖర్చు చేసినప్పటికీ, కనీసం లక్ష ఎకరాలకు కూడా సాగునీరు అందించలేకపోయారని ఆయన అన్నారు. వాస్తవానికి, వ్యాప్కోస్ నిపుణుల సూచన మేరకు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కేవలం రూ.38 వేల కోట్లతో పూర్తిచేసే అవకాశం ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం దాన్ని పక్కనపెట్టిందని ఉత్తమ్ గుర్తుచేశారు. 2019 నుంచి 2023 మధ్య కాలంలో కాళేశ్వరం నుంచి కేవలం 162 టీఎంసీల నీటిని మాత్రమే లిఫ్ట్ చేశారని, అంటే సగటున ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే వినియోగించారని గణాంకాలతో సహా వివరించారు.

బెంగాల్ మంత్రికి తప్పిన ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

వాహనంతో సహా అక్కడ నుంచి పరారైనట్లు తెలిపారు. తాను వెనక్కి తిరిగి చూసేసరికి బైకుపై వచ్చిన ఇద్దరు గాయాలతో కింద పడి ఉన్నారని, వెంటనే వారిని ఆసుపత్రికి తరలించామని చెప్పారు. కాగా, లారీ డ్రైవర్ పట్టుబడినట్లు పోలీసులు అనంతరం ప్రకటించారు. అతనిని విచారిస్తున్నట్లు చెప్పారు. అయితే గాయపడిన ఇద్దరి పరిస్థితిపై ఎలాంటి సమాచారాన్ని పోలీసులు వెల్లడించలేదు.

అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించిన రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ప్రత్యేక కోర్టు తప్పుగా, చట్ట విరుద్ధంగా, తన పరిధికి మించి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కాగా, భారత్‌లో సిక్కులకు అనువైన వాతావరణం లేదని, రెచ్చగొట్టే, విభజించేలా పరిస్థితులు ఉన్నాయని, దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయని అమెరికా వేదికగా రాహుల్ చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వారణాసికి చెందిన నాగేశ్వర్ మిశ్రా ఎఫ్ఐఆర్ నమోదుకు విఫల ప్రయత్నం చేశారు. ఆపై ఆయన కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు.

హైదరాబాద్‌కు సుదర్శన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డిని ఆయన కలుస్తారు.

జగన్‌కు సుదర్శన్‌రెడ్డి ఫోన్

వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఫోన్ చేసి... మద్దతు కోరారు. ఆయన అభ్యర్థనను జగన్ సున్నితంగా తిరస్కరించారు. మీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించకముందే ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ఇస్తానని హామీ ఇచ్చానని జగన్ చెప్పారు. వ్యక్తిగతంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పట్ల అపారమైన గౌరవం ఉందని, ఆయన సేవలు దేశానికి అవసరమని జగన్ అన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. అయితే ఈ ఎన్నికల్లో 'ఇండియా' అభ్యర్థిగా ఆయనకు మద్దతు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.

ఓటు హక్కు హరిస్తున్న మోదీ

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. దేశంలో విద్యకు, కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉందని, వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళ అని కొనియాడారు. ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న వయోజన విద్యా కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. సున్నా శాతం డ్రాప్ అవుట్స్ సాధించడమంటే అందులో ఆశ్చర్యమేమీ ఉండదన్నారు. విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతిగా అభివర్ణించారు. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం. అదే అందరికీ గొప్ప శక్తి అని తాను చాలా బలంగా విశ్వసిస్తానని, అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ అని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో విద్యాభివృద్ధిపై పెద్ద ఎత్తున దృష్టి సారించామని, సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు ఏది చేసినా విద్య మనకు అత్యంత ప్రాధాన్యత కలిగిందన్నారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను ఒక ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగాపెట్టుకున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిదేందుకు కృషి చేస్తున్నామన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలని సంకల్పించామని అన్నారు. కేవలం 55 రోజుల్లో 11,055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఒక్కో స్కూల్ కు రూ.200 కోట్లు ఖర్చుతో 25 ఎకరాల్లో నిర్మించబోతున్నామని, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా విద్యను అందించాలని సంకల్పించామన్నారు. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా నియమించామని అన్నారు. ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేశాం, ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసుకుంటున్నామని వివరించారు. విద్యార్థుల్లో ఒక స్ఫూర్తిని నింపడానికి ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టిన కేసీ వేణుగోపాల్ కు అభినందనలు తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరామనీ, కానీ వారు కేరళను తమ ఇంటిగా, తమ నియోజకవర్గంగా, తమ కర్మభూమిగా ఎంచుకున్నారన్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేస్తున్నామన్నారు. ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. 2026లో కేరళలో జరిగే అసెంబ్లీ ఎన్నికలు దేశ భవిష్యత్తుని నిర్ణయించే ఎన్నికలవుతాయన్నారు. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి రాజీవ్ గాంధీ ఓటు హక్కు కల్పిస్తే... మోదీ పౌరుల నుంచి ఓటు హక్కును కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. 2029లో లోక్‌సభ ఎన్నికలు రెండు శక్తుల మధ్య జరగబోతున్నాయని అన్నారు. 21 ఏళ్ల వయసున్న యువత ఎమ్మెల్యేలుగా పోటీ చేసే దిశగా మనం రాజ్యాంగాన్ని సవరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మున్సిపాలిటీలు నిర్వీర్యం

(మొదటిపేజీ తరువాయి)

ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నెల, నెల పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చేవాళ్లమని, ఇప్పటివరకు పట్టణ ప్రగతి కింద ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు, ఎన్నికలు జరగలేదని ఫైనాన్స్ కమిషన్ డబ్బులు కూడా రావడం లేదన్నారు. ఎల్ఆర్ఎస్ విషయంలో గతంలో బీఆర్ఎస్ పై మీరే విమర్శలు చేశారు... కాంగ్రెస్ వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామన్నారు, నో ఎల్ఆర్ఎస్, నో బిల్ అన్నారు కానీ ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ డబ్బులు బరాబర్ కట్టాలని ప్రజల వద్ద నుంచి ప్రభుత్వం వసూలు చేస్తుందని దుయ్యబట్టారు. నో ఎల్ఆర్ఎస్, నో కాంగ్రెస్ అని ప్రజలు అనే రోజు వస్తుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ డబ్బులను ఎన్ని మున్సిపాలిటీలకు, పట్టణాలకు ఎప్పటిలోగా ఇస్తారని నిలదీశారు. ఎల్ఆర్ఎస్ డబ్బుల్లో కొంత మేర మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించాలని ఆ చట్టంలోనే ఉందని, ఎంతవరకు కేటాయిస్తారో చెప్పాలి... అసలు ఇస్తారా, ఇవ్వరో చెప్పాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ డబ్బు, ఎల్ఆర్ఎస్ డబ్బు, పట్టణ ప్రగతి డబ్బును ఇవ్వకుంటే మున్సిపాలిటీలు ఎలా నడవాలి అని అడిగారు. మున్సిపాలిటీ నిర్వీర్యంగా అయిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో కేసీఆర్ ఉన్నప్పుడు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు నియోజకవర్గం వర్గానికి, సంగారెడ్డి నియోజకవర్గానికి, జహీరాబాద్ నియోజకవర్గానికి రూ.50 కోట్లు ఎస్డీఎఫ్ నిధులను కేటాయించారని, ఆందోల్ లో వర్గానికి కూడా కేసీఆర్ ఇచ్చారు, మంత్రి దామోదర్ ఆందోల్ ఎస్డీఎఫ్ నిధులను ఉంచుకొని పక్కన ఇంకో వర్గం హెచ్‌డీఎఫ్‌సీ నిధులను రద్దు చేశారని చెప్పారు. ఎక్కడైతే గతంలో ఎస్డీఎఫ్ నిధులు కేటాయించారో వాటిని తిరిగి మంజూరు చేయాలని కోరారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

విశాలాంధ్ర - తొర్రూర్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే సూర్యం అన్నారు. ఆదివారం తొర్రూరులో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అధ్యక్షతన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత 18 నెలలుగా తెలంగాణ ప్రభుత్వాన్ని నడుపుతున్న రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సుమారు 60 లక్షల మంది కార్మిక వర్గానికి కనీస వేతనాల జీవోను అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం బీరువాలో పెట్టిన కనీస వేతనాల జీవోలను అమలు చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నేడు విస్మరించటం లక్షలాది మంది కార్మిక వర్గానికి వారి కుటుంబాలకి తీరని అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ప్రజా పరిపాలన అంటూ అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక పని స్థలాలలోకనీస వసతులు కల్పించని కారణంగా వందల మంది అకాల మరణాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలను ఆదుకోవడంలో కనీస శ్రద్ధ కూడా చూపటం లేదన్నారు. కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పి, కనీస వేతనం అందేటట్లు బాధ్యత నాది అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన మాటలు నీటి మీద రాతలుగా మారినాయన్నారు. సామ్రాజ్యవాద బహుళ జాతి కంపెనీల లాభాల కోసం కార్మిక చట్టాలనురద్దు చేసిన మోడీ దేశంలోని కోట్లాదిమంది కార్మికుల జీవితాలలో పెద్ద ఎత్తున కల్లోలం సృష్టించిందని అన్నారు. జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి,కార్యదర్శి బిల్లా కంటి సూర్యం, ఉపాధ్యక్షులు జక్కుల యాకయ్య, జిల్లా నాయకులు శ్రీరాం పుల్లయ్య, అరవపల్లి వెంకన్న, పాడియా బీకు, వేర్పుల మహేందర్, పూనం రవికుమార్ పాల్గొన్నారు.

గణనాధునికి ఎస్పీ దంపతుల పూజలు

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్టించిన వినాయక మండపంలో ఆదివారం గణనాథుడి సహస్ర పుష్ప అర్చన పూజ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సతీ సమేతంగా పాల్గొని ఘనంగా పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని, అందరు తాము మొదలు పెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేటట్లు చూడాలని, కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని మహాగణపతిని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ముఖ్యంగా వనపర్తి జిల్లా పరిధిలోని ప్రజలలో ఉన్న సోదరభావం, ఐక్యత ఎంతో సంతోషాన్ని కల్పిస్తుందని ప్రజలందరూ సోషల్ మీడియాలో వచ్చే వదంతులు పుకార్లపై అప్రమత్తంగా ఉండాలని అపోహలకు గురి కావద్దని, ఏదైనా సమస్య ఉన్న ఏదైనా సమాచారం ఉన్నట్లయితే డయాల్ 100, స్థానిక పోలీసులు సమాచారం అందించాలని ఇదేరీతిలో ఈరోజు నుండి నిమజ్జనం రోజు వరకు ప్రతి ఒక్కరు పోలీసు వారికి సహకరించాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా నవరాత్రులు, నిమజ్జన శోభయాత్ర నిర్వహించుకోవాలని కాలనీ వాసులకు జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్పీ సతీమణి తెలంగాణ రాష్ట్ర బాలల పరిరక్షణ సమితి సభ్యురాలు, బండి అపర్ణ, వినాయక మండప నిర్వాహకులు, కాలనీవాసులు, ఎస్పీ సీసీ, మధు, సూరా రవీందర్, పురుషోత్తంశెట్టి, నరేంద్రచారి, భాస్కర్ నాయక్, గట్టయ్య, వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, రవి కుమార్‌రెడ్డి, వెంకట్‌స్వామి, రామకృష్ణ, కాలనీ మహిళలు అశ్విని, ప్రసన్న, మంజుల, పల్లవి, నేహా, మానస, లలిత, సరస్వతి, భారతి, సూర్య కళ, సరిత పాల్గొన్నారు.

హైదరాబాదులో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

విశాలాంధ్ర - గూడూరు: పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పి ఆర్ టి యు టి ఎస్ గూడూరు మండల శాఖ అధ్యక్షులు సోనబోయిన రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి మండల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం అమలులోకి వచ్చిన సెప్టెంబర్ 1వ తేదీ పెన్షన్ విద్రోహ దినాన్ని పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదు నందలి ఇందిరాపార్క్ వద్ద (నేడు) సోమవారం నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని వారన్నారు. సిపిఎస్ విధానం వల్ల ఉపాధ్యాయ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్కువ సర్వీస్‌తో రిటైర్డ్ అయిన ఉద్యోగులు రిటైర్మెంట్ పెన్షన్ లేనందువల్ల అప్పటివరకు జీతంతో కుటుంబాలను పోషించిన వారిని కుటుంబ సభ్యులు భారంగా భావిస్తుండడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి ఎన్నికల్లో భాగంగా పాత పెన్షన్ పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీని అమలు పరచాలని కోరారు. తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్‌తో పిఆర్‌టియూఎస్ (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్) ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి నాయకత్వంలో ఇందిరాపార్క్ వద్ద తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమంలో ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు లక్షపతి, చింత బాలయ్య, పోనుక విజయ్, నీలం రమేష్, మనుగొండ రమేష్, తోగరు కమలాకర్ రెడ్డి, ఊక లక్ష్మయ్య, మనోహర్ జిల్లా మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంక్ చోరీ నిందితులు అరెస్టు

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: ఎస్‌బీఐ చెన్నూరు బ్యాంక్‌లో దొంగిలించబడిన 15.237 కిలోల బంగారు ఆభరణాలు రికవరి చేసుకొని 44 మంది నిందితులను అరెస్టు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రంజోల్కర్ ఆదివారం కమీషనరేట్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. గోల్డ్ లోన్ ఖాతాల ఆభరణాలు (25.17 కిలోల బంగారం) విలువ రూ.12.61 కోట్లు, నగదు రూ.1.10 కోట్లు దుర్వినియోగం చేయబడి, దొంగిలించబడ్డాయని బ్యాంక్ మేనేజర్ పిర్యాదు మేరకు దర్యాప్తు చేసి ప్రధాన నిందితుడు ప్రధాన నిందితుడు నరిగె రవీందర్ (క్యాషియర్)ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా మొత్తం వ్యవహారం బయటపడిందని, నేరానికి పాల్పడిన అతనితో ముగ్గురు బ్యాంకు ఉద్యోగులతో మిగతా బయటి వ్యక్తులతో పాటు మొత్తం 44 మందిని అరెస్టు చేశామని వివరించారు. ఈ కేసును తక్కువ కాలంలోనే చాకచక్యంగా ఛేదించినందుకు ఏ.భాస్కర్, ఐపీఎస్ డీసీపీ మంచిర్యాల్, ఏ.వెంకటేశ్వర్ ఏసీపీ జైపూర్, దేవేందర్‌రావు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చెన్నూర్, ఆర్.బన్సీలాల్ సీఐ చెన్నూర్ రూరల్, డి.వేను చందర్ సీఐ శ్రీరాంపూర్, ఏ.అశోక్ సీఐ మంచిర్యాల్ రూరల్, కె.నరేష్‌కుమార్ ఇన్స్పెక్టర్, శ్బాబురావు ఇన్స్పెక్టర్, ఎస్‌ఐలైన పి.సుబ్బారావు, శ్రీధర్, రాజేందర్, శ్వేత, సంతోష్, లక్ష్మీ ప్రసన్న, కోటేశ్వర్, ఉపేందర్‌రావు, చంద్రశేఖర్, రవి, హెడ్ కానిస్టేబుళ్లైన శంకర్, రవి, పీసీలైన రమేష్, ప్రతాప్, తిరుపతి, లింగమూర్తిలను రామగుండం కమీషనర్ అభినందించారు.

భద్రాచలం వద్ద 48 అడుగులు దాటిన గోదావరి...

2వ ప్రమాద హెచ్చరిక జారీ

ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాసనికి తరలించాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం/భద్రాచలం : మహారాష్ట్ర రాష్ట్రంతో పాటు తెలంగాణలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాలుస్తుంది. శనివారం సాయంత్రం నుంచి భారీ ప్రవాహం చేరుతూ భద్రాచలం వద్ద ఆదివారం సాయంత్రం నాటికి 48 అడుగుల పైన నీటిమట్టం దాటింది. సోమవారం ఈ వరద ఎంత ఉధృతం కావచ్చని అంచనా వేస్తున్నారు. దింతో 2వ ప్రమాద హెచ్చరిక జారీ చేసారు. గోదావరి పరివా హక ప్రాంతాల్లోని ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. నీటి మట్టం క్రమంగా పెరుగుతూ ప్రమాదకర స్థాయికి చేరే అవకాశాలు ఉన్నట్లు ఇక్కడి పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం నదీ ప్రవాహం ద్వారా 11,44,645 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో గోదావరి వరద ఉధృతి కొనసాగుతుందన్నారు. ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఇప్పటికే పునరావాస చర్యలు చేపట్టారన్నారు. అవసరమైతే మరిన్ని అదనపు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆయన వివరించారు. ప్రజల కోసం తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అన్ని మౌలిక సదుపాయాలు విధిగా అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు ముంపు ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ గోదావరిలోకి దిగి స్నానం చేయరాదన్నారు. గణేష్ నిమజ్జనానికి అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే వెళ్లాలని చెప్పారు. పడవ ప్రయాణాలు కూడా పూర్తిగా నిషేధించబడినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. వరద నీరు ప్రవహిస్తున్న వంతెనలు, చెరువులు, వాగులు, కాలువల వద్దకు ప్రజలు వెళ్లకుండా పోలీసులు, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెల్ఫీలు లేదా వీడియోల కోసం ప్రాణాలను మీదకు తెచ్చుకోవద్దని విద్యార్థులు యువతరాన్ని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం ప్రజలకు సులభంగా సహాయం అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం 08743-232444, వరదల కంట్రోల్ రూమ్-7981219425తో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయం-08744-241950, ఐటీడీఏ కార్యాలయం-7995268352 లకు సంప్రదించాలని కలెక్టర్ కోరారు. జిల్లా యంత్రాంగం 24 గంటలూ పనిచేస్తూ ప్రజలకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

తాడే సాయం... గోడెక్కి ప్రయాణం

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : భారీ వర్షాలతో పోచారం ప్రాజెక్టు వరద ధాటికి మెదక్ - కామారెడ్డి జిల్లా సరిహద్దులో పోచమ్మరాల్ వద్ద రోడ్డు వంద మీటర్లకు పైగా తెగిపోయింది. ప్రధానంగా మెదక్-ఎల్లారెడ్డి, బాన్సువాడ, బోధన్, పిట్లం, జూకల్‌తో పాటు మహారాష్ట్ర నాందేడ్ తదితర ప్రాంతాలకు పూర్తి స్థాయిలో రాకపోకలు బంద్ అయ్యాయి. వాహనాలు వెళ్లలేక వంతెనకు ఉన్న గోడకు రెండు తాళ్లు కట్టుకుని తప్పని పరిస్థితిలో ప్రమాదపు అంచున ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. తాడు సాయంతో ఎక్కేందుకు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం పట్టు తప్పినా నీళ్లలో పడిపోయే ప్రమాదం ఉంది. సాధారణ ప్రజలు సుదూరం నుండి ప్రయాణం చేయలేని దుస్థితిలో ఈ తిప్పలు తప్పడం లేదు. చిన్న పిల్లలు, వృద్దులు తాడు సాయంతో గోడ ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

వేగంగా రోడ్డు పనులు : జిల్లా సరిహద్దు పోచమ్మరాల్ బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన జాతీయ రహదారి పునరుద్దరణకు అధికారులు చర్యలు చేపట్టారు. హైవే పనులు చేస్తున్న సంస్థతో భారీ వాహనాలు తట్టుకునేలా పెద్ద బండరాళ్లు, మొరంతో రోడ్డు వేయిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి మొదలైన పనులు మరో రెండు, మూడు రోజులు పట్టే అవకాశం ఉంది. పోచారం వైపు కూడా తెగిపోయిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. ఈ రోడ్డు పునరుద్దరణ కోసం రెండు జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ దారి గుండా బాన్సువాడ, బోధన్ ఆర్టీసీ బస్సులు నిత్యం పదుల సంఖ్యలో తిరుగుతూ వేలాది మంది ప్రయణీకులను తమ గమ్య స్థానాలకు చేరుస్తారు. ప్రస్తుతం బస్సులు నడవక ప్రజలు హైదరాబాద్, మెదక్, నర్సాపూర్ వైపు, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి వైపు వెళ్లేందుకు చాలా ఇబ్బందిగా మారింది. మరోవైపు గూడ్స్ వాహనాలు వెళ్లలేక నిత్యవసర వస్తువులపై ప్రభావం చూపుతుంది.

మట్టి గణపతులే శ్రేష్టం

విశాలాంధ్ర బ్యూరో - నాగర్‌కర్నూల్ : మట్టితో చేసిన గణపతి విగ్రహాలే పూజా కార్యక్రమాలకు సర్వ విధాల శ్రేష్టమైన విగ్రహాలని విరివింటి శ్రీకాంత్ శర్మ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ తెల్కపల్లి మండల కేంద్రంలోని కొత్త ప్రహ్లాదరావ్ కాలనీలో ఏర్పాటు చేసిన నిలువెత్తు మట్టి గణపతి పూజకు ఆదివారం ఆయన హాజరై పౌరోహిత్యం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వికృత రూపం దాల్చిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వాడకం, రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలు మానవ మనుగడకు అత్యంత ప్రమాదకరంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు మాకం వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్ట్ గుండూర్ శ్యామ్, కర్నాటి బాలస్వామి, బొడ్డు కుమార, మాకం శ్రీనివాసులు, ప్రభాకర్ గుప్త, కుమ్మరి నారాయణ, యువకులు, అనిల్ రావ్, ఏ తిరుపతి రెడ్డి, మేదరి నారాయణ, అర్జున్, శ్రీశైలం, రాంబాబు, శివశంకర్, జనార్ధన్ రెడ్డి, రుకుమయ్య, రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడటమే డివైఎఫ్ఐ లక్ష్యం

విశాలాంధ్ర - కారేపల్లి : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడడమే డివైఎఫ్ఐ లక్ష్యమని యువజన, ప్రజా సమస్యలపై నిరం తరం సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ అన్నారు.శుక్రవారం కారేపల్లి మండల మహాసభ భాగం రామనర్సయ్య భవన్‌లో దారావత్ వినోద్ అధ్యక్షతన జరిగింది. ఈ మహా సభలో అయన మాట్లాడుతూ దేశంలో మత ప్రాతిపదికన మోడీ డైవర్షన్ రాజకీయాలు నడిపిస్తున్నారని యుద్ధం వైపు దృష్టి మరలుస్తూ తన అధికారాన్ని కాపాడుకుంటున్నాడని విమర్శించారు. యువతకు బీజేపీ మోడీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఇచ్చారని, నేడు ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ పరం చేస్తూ నిర్వీర్యం చేస్తూ ఉన్న ఉద్యోగాలను తీసివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రత్యేక ఓటర్ సవరణ(సర్) పేరుతో ప్రతిపక్షాల అనుకూల ఓట్లను తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో బలమైన పోరాటాల రూపకల్పనకు ఆగస్టు 31న ఖమ్మం మంచికంటి భవన్‌లో డీవైయఫ్ఐ జిల్లా మహాసభలు జరుగుతున్నాయన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా గిరి ప్రసాద్ భవన్‌లో జరిగిన టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో సమావేశంలో సురేష్ పాల్గొని మాట్లాడారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడిన ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అవే ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారం జరగడం లేదని ఆయన అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం చేసిన వాగ్దానం నెరవేరలేదని ఇప్పటికైనా వారి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో తమ పార్టీ కార్మికులకు పూర్తి మద్దతునిచ్చి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) నూతన మండల అధ్యక్షుడిగా యారవ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సత్తార్, కోశాధికారిగా గుంజా రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు యారవ శ్రీనివాస్ అధ్యక్షతన పూర్తి కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పారేపల్లి శేఖర్‌రావు, ముఖ్య సలహాదారులుగా షేక్ చిన్న ఖాజా వలి, నకిరేకంటి కోటేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా షేక్ షరీఫ్, తుడుం అజయ్ కుమార్, సహాయ కార్యదర్శులుగా షేక్ సైదా, పఠాన్ కరీముల్లా, గుంజ బిక్షం, సహాయ కోశాధికారిగా నీలా రామ్మూర్తి, ఆర్గనైజర్‌గా బొమ్మ మట్టయ్య, సహాయ ఆర్గనైజర్‌గా చింతల ఈశ్వరయ్య, కమిటీ సభ్యులుగా పటాన్ నాగుల్ మీరా, ఇంజమూరి వెంకన్న, సట్టు నాగరాజు, షేక్ రహీమ్ తుల్లా, షేక్ జానీ, మక్కల నాగమ్మ, జంపాల శ్రీనివాస్, నన్నేపంగ నరేష్, వేముల శివ, కుర్రి శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు యారవ శ్రీనివాస్ మాట్లాడుతూ భవన ఇతర నిర్మాణ కార్మికులందరూ భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్న కార్మికుల పెండింగ్ క్లైమ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు. 55 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని, పనిముట్ల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించాలన్నారు. వెల్ఫేర్ బోర్డు ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా సంక్షేమ పథకాలను అందించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్, భవన ఇతర నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పీర్యానాయక్ కుటుంబానికి సమ్మయ్య గౌడ్ సాయం

విశాలాంధ్ర - కేసముద్రం: జిల్లాలోని కేసముద్రం మున్సిపాలిటీ సబ్ స్టేషన్ తండాకి చెందిన గుగులోత్ పీర్యా నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం మృతుని భార్య బిచ్చాలి, కుమారుడు రాము, కుమార్తెలు సుజాత, సునీత, సంగీతల ను పరామర్శించి పీర్యా నాయక్ పవిత్ర ఆత్మకు భగవంతుని సన్నిధిలో శాంతి చేకూరాలని చిలువేరు సమ్మయ్య గౌడ్ కోరుకుంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెపారు. అనంతరం కాంగ్రెస్ మండల నాయకులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ వారి కుటుంబానికి 1క్వింటా బియ్యం,15 కేజీల మంచి నూనె అందజేసి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా భరాస గ్రామ పార్టీ అధ్యక్షులు సురేష్ నాయక్ మాట్లాడుతూ ఏ గ్రామం లోనైనా సరే పేద కుటుంబాలు ఆపదలో ఉంటే విషయం తెలిసిన వెంటనే సమ్మయ్య గౌడ్ సహాయం అందించడం, ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడిగా ఉంటూ వారికి చేదోడు వాదోడుగా ఉంటారన్నారు. గోపాల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుగులోత్ హనుమ, వాంకుడోత్ రమేష్, వాంకుడోత్ భీమా నాయక్, వాంకుడోత్ రాజా, పార్వతి, గుగులోతు రవీందర్, నరేష్, శంకర్, తండా వాసులు పాల్గొన్నారు.

మారుతి సుజుకి, రాజస్థాన్ రవాణా శాఖల ఒప్పందం

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లో రోడ్డు భద్రతను పెంపొందించడానికి ఒక ముఖ్యమైన అడుగులో, మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ రాజస్థాన్ ప్రభుత్వ రవాణా శాఖతో 21 డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష ట్రాక్‌లను ఆటోమేట్ చేయడానికి ఒక ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ట్రాక్‌లను రాష్ట్రంలోని 20 ప్రధాన నగరాల్లో, అంటే అల్వార్, బరాన్, బార్మెర్, భరత్‌పూర్, బికనీర్, చిత్తోర్‌గఢ్, చురు, దౌసా, ధోల్‌పూర్, దిద్వానా, దుంగర్‌పూర్, హనుమాన్‌గఢ్, జైపూర్, ఝులావర్, జోధ్‌పూర్, కోటా, రాజ్‌సమంద్, భిల్వారా, సికార్, ఉదయపూర్‌లలో ఏర్పాటు చేస్తారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ, రాజస్థాన్ ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి, రవాణా, రోడ్డు భద్రత మంత్రి డాక్టర్ ప్రేమ్ చంద్ బైర్వా సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకం చేశారు. రాజస్థాన్ ప్రభుత్వ కార్యదర్శి, రవాణా కమిషనర్ శుచి త్యాగి, మారుతి సుజుకి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తరుణ్ అగర్వాల్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. ఈ చొరవకు మారుతి సుజుకి దాని సీఎస్‌ఆర్‌లో భాగంగా నిధులు సమకూరుస్తుంది. ఏడీటీటీలు ద్విచక్ర వాహనాలు, తేలికపాటి మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుదారులకు సేవలు అందిస్తాయి.

అవసంత్ జీసీసీ సర్వీసెస్‌లో లీడర్‌గా హెచ్‌సీఎల్‌టెక్

న్యూఢిల్లీ : ప్రముఖ గ్లోబల్ టెక్నాలజీ కంపెనీ అయిన హెచ్‌సీఎల్‌టెక్, అవసంత్ గ్లోబల్ కాంపిటెన్సీ సెంటర్ (జీసీసీ) సర్వీసెస్ 2025 రాడార్‌వ్యూ నివేదికలో లీడర్‌గా ఎంపికైంది. జెన్‌ఏఐ, ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, లోతైన డొమైన్ నైపుణ్యం ద్వారా ఆధారితమైన ఎండ్-టు-ఎండ్ జీసీసీ సేవలలో హెచ్‌సీఎల్‌టెక్ నాయకత్వాన్ని నివేదిక హైలైట్ చేస్తుంది. టెక్నాలజీ-ఫస్ట్, ఇండస్ట్రీ-సెంట్రిక్ డెలివరీ మోడల్, పూర్తి-స్టాక్ సామర్థ్యాలతో, హెచ్‌సీఎల్‌టెక్ ఫైనాన్స్, హెచ్‌ఆర్, కస్టమర్ ఆపరేషన్స్, అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్‌లో 200పైగా జీసీసీలను స్థాపించడంలో సహాయపడింది. "హెచ్‌సీఎల్‌టెక్ బలమైన నిలువు దృష్టితో ఎండ్-టు-ఎండ్ జీసీసీ సేవలను అందిస్తుంది" అని అవసంత్ అసోసియేట్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రవీణ్ కోనా అన్నారు. న్యూ విస్టాస్ ప్రోగ్రామ్ ద్వారా టైర్ 2 భారతీయ నగరాలకు విస్తరణతో భారతదేశం, పోలాండ్, ఫిలిప్పీన్స్‌లలో దాని ప్రపంచవ్యాప్త పాదముద్ర విస్తరించింది. ప్రతిభ, ఐపీ, భాగస్వామ్యాలలో పెట్టుబడులు - ఏడబ్ల్యుఎస్, గూగుల్ క్లౌడ్, ఇతర పర్యావరణ వ్యవస్థ ఆటగాళ్లతో సహా - హెచ్‌సీఎల్‌టెక్‌ను మా రాడార్ వ్యూలో అగ్రగామిగా నిలిపాయని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచి భారీ వర్షం కురిసే అవకాశం

వాతావరణ శాఖ హెచ్చరిక : కలెక్టర్ వెల్లడి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఎప్పుడైనా 2 నుంచి 3 గంటలపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరిక చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన సూచించారు. జిల్లాలో ఏదైనా ప్రాంతంలో మూడు గంటలకు పైగా వర్షం నిరంతరంగా కురిస్తే లేదా 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైతే అక్కడి పరిస్థితులను అధికారులు అప్రమత్తంగా ఉండి పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రదేశాలకు తరలించాలని చెప్పారు. అదేవిధంగా అవసరమైతే సమీపంలోని పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించాలన్నారు. ఆహారం, తాగునీరు, ప్రజలకు అవసరమైన ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తమ ప్రాంతాల్లో ఎటువంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ 08744-241950, 08744-241951 నెంబర్లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

తాత్కాలిక మరమ్మత్తులపై దృష్టి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: తాత్కాలిక మరమ్మత్తులతో రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రధానంగా 11 మండలాల్లో వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం ఏర్పడిందన్నారు. వరద నష్టం అంచనాలు జిల్లా అధికారులు రూపొందిస్తారన్నారు. ఆదివారం మెదక్ మండలం బాలనగర్ వద్ద పిల్లికొట్టాల్ నుండి వెల్దుర్తి వెళ్లే రోడ్ కల్వర్టు డామేజ్ కాగా పరిశీలించారు. రామాయంపేట, నిజాంపేట్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. రోడ్లు కల్వర్టులు, వంతెనలు చాలా ప్రాంతాలలో కోతకు గురైనట్లు పేర్కొన్నారు. రామాయంపేట నుండి సిద్దిపేట్ వెళ్ల జాతీయ రహదారి నిజాంపేట్ మండలం బ్రిడ్జ్ డామేజ్‌ను పరిశీలించారు. నిజాంపేట్ మండలం చల్మెడ గ్రామంలోని ప్రవాహానికి కొట్టుకపోయిన రెండు బ్రిడ్జిలను, నిజాంపేట్ నుండి నస్కల్ వెళ్లి దారిలో వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన పురాతన బ్రిడ్జలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో చెరువు, పర్వతాపూర్ వెళ్లేదారిలో కొట్టుకుపోయిన బ్రిడ్జిని సందర్శించారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వ నుండి సహాయ సహకారాలు అందుతాయని ఆందోళన పడవద్దని సూచించారు. తహసిల్దార్ రజని, ఆర్ అండ్ బి ఈఈ సర్దార్ సింగ్ తదితరులున్నారు.

టి-20 క్రికెట్‌లో ఐయల్‌పిఎ టీం విజయం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : స్థానిక ప్రకాశం స్టేడియంలో జరిగిన టి - 20 ఫ్రెండ్స్ కప్ సీరీస్ క్రికెట్‌లో ఐఎల్పిఎ టీం విజయం సాధించింది. ఆదివారం ఈ పోటీలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.యల్.పి.ఏ.11) టీం, మీడియా 11 మ్యాసీవ్ టీం పై టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఐ.యల్. పి.ఏ నిర్ణీత 16 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసింది. కాగా 163 పరుగుల విజయలక్ష్యం ఉండగా బ్యాటింగ్ కు దిగిన మీడియా 11 మ్యాసీవ్ టీం నిర్ణీత 16 ఓవర్లు ముగిసే సమయానికి 123 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. 39 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఐ.యల్. పి.ఏ. ఓపెనింగ్ జోడి 58 పరుగుల భాగస్వామ్యం అందించి శుభారంభం ఇచ్చారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్స్ కుడా చేలరేగడంతో మంచి స్కోర్ నమోదు చేసింది. ఈ టీం కట్టుదిట్టమైన బౌలింగ్ చేయడంతో విజయం సాధించింది. ఈ టీం జిల్లా కమిటీ కన్వీనర్ సినియర్ న్యాయవాది జనపరెడ్డి గోపి కృష్ణ మ్యాచ్ అడి, ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నారు. విజేతలకు ఇన్స్పెక్టర్ నరేష్ కూమార్ ట్రోఫిని అందించారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక, వైద్య భద్రత అవసరం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి ద్వారా దేశానికి వెలుతురు ప్రసరింపజేసేందుకు తమ జీవితాలను పణంగా పెట్టిన కోల్ ఇండియా, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల జీవితాల్లో చీకట్లు క్రమ్ము కుంటున్నాయని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, నాయకులు వంగ వెంకట్ ఆవేదన వ్యక్తం చేసారు. విశ్రాంతి ఉద్యోగులను ప్రభుత్వం, యాజమాన్యాలు చాలా నిర్లక్ష్యం చేస్తున్నాయని చెప్పారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ రిటైర్డ్ ఉద్యోగుల బాధలు వెల్లడించారు. గౌరవ ప్రదమైన జీవితం కొనసాగాలంటే ఆర్థిక భద్రత, వైద్య సౌకర్యాలు అవసరం అన్నారు. ఇలాంటి అవసరాలు తీర్చేందుకు బొగ్గు గనుల విశ్రాంత ఉద్యోగులకు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం 27 సంవత్సరాల క్రితం కనీస పెన్షన్ రూ.350 నిర్ణయించారన్నారు. దీన్ని పెన్షన్ అంటారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఇతర విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ తొ పోల్చుకుంటే సింగరేణి ఉద్యోగుల పెన్షన్ ఇసుమంత కూడా లేదన్నారు. నేటి ధరలకు అనుగుణంగా కరువు భత్యం లేకుండా పెన్షన్ పెరగకపోవడం వలన దేశ వ్యాప్తంగా 5 లక్షల పెన్షన్ దారులు దారిద్ర్య రేఖ దిగువున జీవిస్తున్నారన్నారు. ఎన్నో సార్లు పెన్షన్ పెంచాలని, మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, రాజకీయ నేతలకు వినతులు చేసినప్పటికీ ఏ మాత్రం ఫలితాలు కనబడటం లేదన్నారు. పార్లమెంట్ ప్రతిపాదించిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సిఫార్సులను కూడ అమలు చేయక పోవడం శోచనియమన్నారు. 2007కు ముందు రిటైర్ అయిన వారికి రూ.5 వందల శాతం పెన్షన్ పెంచాలని డిమాండ్ చేసారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రద్దు చేసి బొగ్గు మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వశాఖ, కోల్ ఇండియా, సింగరేణి, పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ పెన్షన్ ఫండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. న్యాయమైన తమ డిమాండ్లు పరిష్కరించాలని సెప్టెంబర్ 15 న కోల్ ఇండియా హెడ్డాఫీస్ ముందు కలకత్తాలో భారీ ప్రదర్శన నిర్వహించాలని అసోసియేషన్ పిలుపు మేరకు కోల్ ఇండియా, సింగరేణి విశ్రాంత ఉద్యోగులు సిద్ధమవుతున్నారని తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా అన్నదానం

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, మెయిన్ రోడ్డులో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని శ్రీ వినాయక ఉత్సవ కమిటి సభ్యులు కొత్త సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ అన్న దాన కార్యక్రమంకు దాతలుగా పూలవ్యాపారి సామ్రాజ్ పద్మ - రాకేష్ వారి ఆర్థిక సహాయంతో అన్న దానం చేశామన్నారు. శ్రీ వినాయక ఉత్సవ కమిటి గత 11 సంవత్సరాల నుండి అంగరంగ వైభవంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ సంస్కృతి సంప్రదాయంతో, వినాయకునికి ఉదయం సాయంత్రం రోజుకు రెండుసార్లు పూజలు నిర్వహిస్తూ, ములుగు పట్టణ ప్రజలు, యావత్ ప్రపంచమంతా కూడా భక్తులందరూ సుఖసంతోషాలతో ఆరు ఆరోగ్యాలతో ఐశ్వర్యాలతో జీవితాన్ని పొందాలని వినాయకునికి పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నేటికీ ఐదవ రోజున పురస్కరించుకొని, మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నేటి మహా అన్నదాతలుగా సామ్రాజ్ రాకేష్ పద్మ దంపతులు మహ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి, భక్తులకు అందజేయడం జరిగిందని, దాదాపుగా 700 మంది భక్తులందరూ పాల్గొన్నారన్నారు. శ్రీ వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు ఇమ్మడి రాకేష్ యాదవ్, సానికొమ్ము శ్రీనాథ్ రెడ్డి, ఎల్లాపుల అశోక్, బైకాని మధు, ఎల్కతుర్తి శివ, కోయిల కవిరాజ్, కల్లెపు ప్రవీణ్,నగర బోయిన రాజు, నాగ సాయి, అమ్ము, అఖిల్, పండు పాల్గొన్నారు.

సాహితి

శాబ్దిక ప్రపంచంలో... అద్దేపల్లి 'లోపలి నిశ్శబ్దాలు'!

వి.యస్.ఆర్.ఎస్. సోమయాజులు
సెల్: 9441148158

అక్షయామసుల - ఆ రామమోహనం, సౌకుమార్యం కాలంతో పరిణతి చెందిన ప్రగతిశీల కవి డా॥అద్దేపల్లి రామమోహనరావు. ఆధునిక కవిత్వాన్ని పాఠకులు, పరిశోధకులు అర్థం చేసుకునేలా రచనలు చేసిన కవిత్వమయ చిరంజీవి అద్దేపల్లి. సాహిత్య ప్రస్థానంలో అద్దేపల్లి రామమోహనరావుగారిది అరుదైన వ్యక్తిత్వం. కవిత్వంలో వాడిన విలక్షణ శబ్దాలు, ప్రయోగాలు యువతరానికి మార్గదర్శనమయ్యాయి. అద్దేపల్లి కవితాపఠనం విన్న వారందరికీ ఇంకా చేయెత్తి, గొంతెత్తి పిలుస్తూన్న పలకరింపులు అనుభవేకవేద్యాలు.

తనదైన సొంతముద్ర అస్తిత్వం నిబద్ధతలు అద్దేపల్లి రామ మోహనరావుగారి శేషకీర్తిని- కీర్తిశేషుడైనా కాలం సంపుటాల్లో నమోదు చేసుకున్నారు. అద్దేపల్లి సాహిత్య ప్రస్థానంలో కాలానుగత మార్పులు, ప్రగతిశీల ఆశావహ దృక్పథం, అభ్యుదయదృష్టిపథం వైపునే సాహిత్యసృష్టి చేశారు. అద్దేపల్లి వెలార్చిన గ్రంథాలన్నింటా ఒక విశిష్టత సంతరించుకుని, సందేశాత్మకంగా సాగాయనడంలో అతిశయోక్తి లేదు. అద్దేపల్లికి జీవితం- సాహిత్యం అవిభాజ్యాలని ప్రకటించుకున్నారు.

"నేనెప్పుడూ ఒక స్థిర బిందువు దగ్గర నుంచి బయలుదేరలేదు, పరిణతి చెందడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండడమే నా జీవన మూలసూత్రం" అని చెప్పేవారు. ఒకరకంగా తన సాహిత్య జీవన తాత్వికతల్ని నిర్దేశించుకున్నారు. ప్రాచీనతలోని మంచి నించి అభ్యుదయంలోని ఆధునికాభివ్యక్తుల వరకు కాలంవెంబడి పోరాటాలను, ప్రవాహోర్ధతల్ని ఒక స్పందనగా చిరుగాలి తాకిడిని, ఉరవడిలో ఎగిసిపడే కెరటాన్ని అక్షరాలాచిరునామాగా మార్చుకున్నారు.

అద్దేపల్లి మొదటికవిత "మధుజ్వాల"(1969) ఉమర్ ఖయ్యాం రచనల స్వేచ్ఛానువాదం పద్యాలలోని ప్రాణం ప్రతిష్టింప చేశారు. అంతర్జ్వాల(1973), రక్తసంధ్య(1980), గోదావరి నా ప్రతి బింబం (1992), మెరపుపువ్వు(1995)ల గురించి ఒక సాధికారిక అభిప్రాయం. "జ్వాల నుంచి మెరపు" దాకా అన్న అనుయాయుల మాట అక్షర సత్యమే అయ్యింది. "ఆధునిక సంఘమనే "రక్తసంధ్య" మానవుడే ఆధునికుడు, లయకారుడుగా భాసించారు.

అద్దేపల్లి కవిగానే కాక విమర్శకు, సాహిత్య వ్యాసాలకు అంతే ప్రాచుర్యం లభించింది. కవి- విమర్శకుడు ఒకేలాంటి వస్తువుల గురించి అభివ్యక్తి, శిల్పం, పరిణామ క్రమాల్ని గ్రంథావలోకనం చేసిన తీరు వందలాది కవుల ముందు మాటలు గీటురాళ్లుగా - విమర్శ విలోకనం, మహోపన్యాసకునిగా విస్పష్ట తాత్వికతల్ని- సమకాలీన సమాజానికి అందించారు. ఈయన కవితా వస్తువులో మట్టిని, మనిషిని సమాజపరంగా ప్రేమించడం వచనాన్ని, గేయాన్ని సమంగా రాయగలిగారు. అద్దేపల్లి వెలిగించిన సాహితీ జ్యోతి కొలిమి నుంచి అక్షర కొనలు విస్తరిస్తూ నేటి తరాలకు నిలుస్తున్నాయి.

పరిణామ క్రమంలోంచి మినీ కవితల్ని, దీర్ఘ కవితల్ని, గజల్, రెక్కలు వంటి ప్రక్రియల పట్ల మంచి అవగాహన నేర్పర్చుకున్నారనే చెప్పాలి. ఆధునిక కవిగా తన సంపుటాల్లోని "సంఘం శరణం గచ్ఛామి" "పొగ చూరిన ఆకాశం", "కాలం మీద సంతకం", "ఆకుపచ్చని సజీవ సముద్రం నా నేల" లు అచిరకీర్తిని సంతరించుకున్నాయి.

యిక విమర్శ గ్రంథాలలో శ్రీశ్రీ కవితా ప్రస్థానం, విమర్శ వేదిక, సాహిత్య సమీక్ష, కుందుర్తి కవిత, మినీ కవిత, జాషువా కవితా సమీక్ష, స్త్రీవాద కవిత్వంలతో పాటు వచన కవితా విప్లవ వీరగాథా కావ్యంగా అల్లూరి సీతారామరాజు చరిత్రను ఆనాటి స్వాతంత్ర్యోద్యమ నేపథ్యాల్ని వివరించిన గ్రంథం (2017) లో ఆయన మరణానంతరం కుటుంబ సభ్యులచే వెలువరించడం జరిగింది. యిక 2016 లో "అద్దేపల్లి రామమోహనరావు లోపలి నిశ్శబ్దాలు" అద్దేపల్లి కీర్తి కౌముదిని వేలాది అభిమానులు అక్షరాలా దర్శించగలిగారు. ఈ సంపుటిలోని ప్రతి పదం ఆలోచింపచేస్తుంది.

"తననే శేషంగా మిగుల్చుకోవడానికి/ ఆకాశం నేల మీద సాల్వుచేసుకుంటున్న/ బ్రహ్మాండమైన ప్రాబ్లమ్ ఈ ప్రపంచం/ అందుకే ప్రతి అంకెకీ/ అవినాభావ సంబంధం ఉంది" పై పాదాల్లో చీకటి పొరల్లో నించి కూరుకుపోనివ్వనీ- అడుగు ముందుకేసే మనిషి అడుగు- ఆత్మబలాన్ని చాటారు.

"పువ్వు నవ్వి నవ్వి పండౌతుంది/ అనుభూతి కన్నీరు కార్చి కార్చి ఆత్మ ఔతుంది" ఈ పై వాక్యాలలో అద్దేపల్లి కవిత్వ సూత్రం - ఆత్మద్రవ్యం పట్టుకోవడమే అన్నా సూత్రీకరణం చెప్పకనే చెప్పినట్లయింది. ఇంకా మనిషిని నమ్ముదామంటారు. ఒక్క మనిషి నిజమైన పూనికతో వందలాది కవుల కవిత్వం జ్వలిస్తుందన్న ఆశావాది అద్దేపల్లి. ముఖ్యంగా 1970 ల నుంచి 1980 ల దాకా, దరిమిలా వచ్చిన దేశీయ, అంతర్జాతీయ మార్పులు, గాట్ ఒప్పందాలు, ఆర్థిక సరళీకరణలు, ప్రపంచీకరణలు, విదేశీ వస్తు వ్యామోహాలు మనిషి తానే ఒక వస్తువుగా మారినప్పటి దైన్యాల్ని- పరిణామ వాద దిశగా సమాజ చేతనకు అక్షరాలా అ(ర్ధ)ద్దం పట్టిన ఒక అగ్నిశిఖలా ప్రపంచ వినిమయ విపణి విపరీత ధోరణులు, సాంస్కృతిక పరాయీకరణలు కవితా వస్తువులుగా తీసుకున్నారు.

"పరాయీకరణ భావాలకి మంట పెట్టలేకపోతున్నప్పుడు బహుళ జాతుల రక్తం నీలో ఇంకిపోనీయకు" అంటూ చేసిన హెచ్చరికలున్నాయి. జీవితంలో మనిషిగా ఓడిపోకుండా, ఆర్య, ద్రావిడ సంస్కృతుల మేలు కీడుల్ని సోదాహరణలు అద్దేపల్లి ఎంచుకున్న వాక్యాలు ఆలోచనాశీలత్వాన్ని కలిగించాయి. అద్దేపల్లిలో గొప్ప శాస్త్రీయ దృక్పథం ఉంది. వ్యక్తిగత ప్రతిష్టలకు, చౌకబారు రాజకీయాలకు తావీయని జీవనాదర్శం అద్దేపల్లి మూర్తిమంతం. 1976 ప్రాంతంలోనే "ఒక్క చమురు చుక్క కోసం లక్షల ప్రాంతాలను ఆర్పివేసే విష సంస్కృతిని అక్షరీకరించారు. అదే వేదనా వర్తమానంలోనే కొలిమిగా నివుర్లు కప్పుతూనే ఉందన్నది అధివాస్తవం కాబట్టే ఆయన క్రాంతదర్శి అయ్యారు. పెట్టుబడిదారీ వ్యవస్థ, రక్త వ్యాపారం, ఆయుధ వ్యాపారం విష సంస్కృతి కీలల్ని వెలిగించిన సాహితీజ్యోతి. కవిత్వ విలువను కాలం చేతబట్టుకున్న థర్మామీటరులో సమాజపు జ్వరాన్ని కొలుస్తుందన్నారు.

కాల ప్రబంధంలో సిరాక్షరాలే కాదు శిలాక్షరాలుగా నిల్చే వేలాది పద కవితా భావ శబలత నిర్మాణ ప్రక్రియలు అద్దేపల్లికి సాధ్యాలయ్యాయి. ఆయన రాసి పాడిన పాటలు మూడు కాలాలకు జీవధారలయ్యాయి. జీవితంలోంచి జీవితంలోకి చైతన్యంగా రూపాంతరం చెందటం ఒక్క పాట వల్లే సాధ్యపడ్తుందని ఆయన మాట- పాట- బాటలు ప్రత్యక్షానుభూతుల్నిచ్చాయి. కవిలోని యాంత్రికతలే కాదు ప్రగతిశీలతలు జీవనానికి శిల్ప కవిత్వం అన్వయించిన దృష్టిపథికుడు.

"పాట గొంతులోంచి రాదు/ పాట నరాల కదలికలోంచి రాదు/ పాట జీవితంలోంచి వస్తుంది/ మరణం గొంతు నులిమే/ జీవితం వేసే కేకలోంచి వస్తుంది/ యీ వాక్యాల్లోని నిజాయితీని పాట ఆయువును గ్రహించగలుగుతాము/ నే సలాము చేస్తా/ ఈ జనానికి పేదవాడి కోసం పోరు చేసేవాడికి" అంటూ గళమెత్తిన గాయకుడు.

యిక బాల్యం గురించి రాసి పాడిన గజల్స్‌లో "ఈ ధనమంత పోనీ యవ్వనమంత పోనీ/ ఆనాటి బాల్యాన్ని ఒకసారి రానీ" శాస్త్రీయ దృక్పథం- సమాజగత పరిశీలనం- ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి సాహితీ విలువల ప్రతిపాదనలు "లోపలి నిశ్శబ్దాలు" లో ప్రతి పదంలోను వివరించారు.

ముగింపు: కవిత రాసిన క్షణాలు మాత్రమే నీవి- పదేళ్ల క్రితం నువ్వు రాసిన కవిత ఈనాటికి ప్రజల్లో ప్రకంపనాలు కలిగిస్తే- నువ్వు కవిగా బతికి ఉన్నట్లు కాదు- ప్రజలు పాఠకులుగా బతికి ఉన్నట్లు మాత్రమే. అద్దేపల్లి జ్ఞాపకాలు సుమగంధపు పూతలు.

ఇలా లక్షలాది అభిమానుల సాహితీ దీపం వెలిగించిన అక్షర జ్యోతికి- ఆత్మిక స్మృతి! కృష్ణా గోదావరుల సారస్వత వేది అద్దేపల్లి. చిరస్మరణీయ స్ఫూర్తి! దీప్తి!

(అద్దేపల్లి జయంతి 6-9-2025)

బాధిత జనరవం సురవరం

ఏటుకూరి ప్రసాద్

సురవరమా జోహార్!
బాధిత జనరవమా జోహార్
జనవరమా జోహార్
రూపెత్తిన కమినిజమా జోహార్

చిరునవ్వులు చిలకరించు
మృదు స్వరమా
కోపం తాపం ఎరుగమి
మీ వరమా

సిద్ధాంత ప్రచారంలో
గుండెలు మీటే మాటలు
వాడే మర్మం తెలివిడి
సొంతమా

అనునిత్యం నినదించిన
జనస్వనమా
దోపిడిపై పూరించిన
రణరవమా

అలుపెరుగని అధ్యయనం
భావజాల వినిమయం
తుదివరకూ మీకబ్బిన
వ్యసనమా
నిన్నమొన్న కలిసి మనం
మాటలాడుకున్న క్షణం
ఇదే వీడుకోలన్నది
తెలియదు ఆ దినం
మీ ద్యాసలె ఊసులై
మీ ఆశలె శ్వాసలై
కలిసెళ్తూ వెలిగిస్తాం
గుండెల్లో దీపం
రగిలిస్తూ కదిలిస్తాం
ఆశయాల లోకం
సురవరమా జోహార్
బాధిత జనస్వరమా జోహార్

సామాజిక నీతిని ప్రబోధించే చక్కని కథలు 'లిటిల్స్'

వేల్పుల నారాయణ, 9440433475

గ్రంథ సమీక్ష

విద్యార్థులకు సామాజిక నీతిని,శాస్త్రీయ స్పృహ కల్పించాలనే దృక్పథంతో పుల్లూరు జగదీశ్వరరావు రాసిన బాలల 24 కథల సంపుటి ఇది. ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలు కూడా చదువుకునే విధంగా అవే కథలను తానే ఇంగ్లీషులో అనువాదంచేసి ఇదే సంపుటిలో ప్రచురించారు.

ఆధునిక సాహిత్యంలో ఈనాడు బాలల కోసం రావల్సినంత బాల సాహిత్యం రావడంలేదు. వచ్చినా ముఖ్యంగా సామాజిక, శాస్త్రీయ ఆలోచన విధానాలను రేకెత్తించే బాల సాహిత్యం అరుదుగా వస్తుంది. ఈ నేపథ్యంలో తాను ఒక ఉపాధ్యాయుడిగా పనిచేసి పిల్లలకు పాఠాలు చెప్పిన క్రమంలో ఆ పిల్లలకు చిన్నతనంలోనే వారి మనసులకు నాటుకునే విధంగా ఎలాంటి కథలు వస్తే బాగుంటుందో, తనదైన చైతన్యం, సామాజిక దృక్పథంతో జగదీశ్వరరావు పిల్లలకు సులభంగా అర్థమయే విధంగా రాసి అర్థవంతమైన బొమ్మలతో పిల్లలకు అందించారు.అనంతరం ఆయన ప్రభుత్వ ఉన్నత ఉద్యోగిగా, తహసీల్దార్‌గా తీరిక లేకున్న బాలల సాహిత్యంపై బాలలకు సంబంధించిన అనేక కథలు రాస్తూనే ఉన్నారు.

ఈ కథల్లోని గొప్పతనాన్ని గుర్తించి, రచయితను ప్రోత్సహిస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రభుత్వం తరపున దాదాపు ఐదువందల పుస్తకాలవరకు కొని జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందచేయడం మరో గొప్ప విషయం. ఇక కథల విషయానికొస్తే ఈ కథలన్నీ దాదాపు వివిధ పత్రికల్లో అచ్చయినవే. ఇందులో కొన్ని మౌఖిక ప్రచారంలో ఉన్న కథలను మార్చి తన ఆలోచనలను జోడించి విద్యార్థులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు.

ఎడారి మొక్కలు అనే కథలో ఒకరు తక్కువ ఒకరు ఎక్కువ అని గేలి చేయకూడదని, అందరూ సమానమనే బోధను విప్పి చెపుతారు. ప్రయోజనం అనే కథలో ఏదీ తక్కువ ఏదీ ఎక్కువకాదని, దేని ప్రయోజనం దాని కుంటుందని చూపిస్తారు. రెంటికి చెడ్డ రేవడ కథలో ఇతరులను అనుకరిస్తూ తాను అలాగే కావాలనే అత్యాశ వల్ల అనర్థాన్ని సులభతరమైన మాటలతో చూపిస్తారు. తగిన శాస్తి అనే కథలో మంచికోరి మాటలు చెప్పే స్నేహితుల మాటలు వినాలని, లేకుంటే వినని వ్యక్తికి తగిన శాస్తి జరుగు తుందని చెపుతారు.

ఒంటెపరుగు అనేకథలో పరిస్థితులను అంచనావేయకుండా ఎవరినీ తక్కువగా అనుకోరాదని చెపుతారు. గర్వభంగం అనే కథలో ఎప్పుడు మిడిసిపడ కూడదని, ఎప్పుడూ పరిస్థితులు ఒకే రకంగా ఉండవని చెపుతారు. కుందేటి పరుగు అనే కథలో ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించగలమని చెపుతారు. నిన్నునీవు తెలుసుకో అనే కథలో ఎంత ఉన్నతంగా పైకి వచ్చినా ఎట్లా వచ్చావో మూలాన్ని మరచిపోవద్దని చెపుతారు.

ఇంకా ఇలాంటి కథలెన్నో వ్యక్తుల్లో అహంకారం, గర్వం, అసమాన దృష్టి తగదనే నైతికతను బోధిస్తాయి. అదేవిధంగా సైన్సు మాంత్రికుడు కథలో భాస్వరం మండించడం లాంటివి చూపిస్తూ సైన్సు పై అవగాహన కల్పిస్తారు. మ్యాజిక్ పెన్ను కథలో స్వయంకృషే ముఖ్యమని, దేనిపైనా అతిగా ఆధారపడ కూడదని, మూఢ నమ్మకాలు కథలో మూఢనమ్మకాలను నమ్మకూడదని తార్కికంగా ఆలోచించాలని చెపుతారు. ఇలా జలకాలుష్యం, నిన్ను నీవు తెల్సుకో లాంటికథలు శాస్త్రీయ అవగాహన, తార్కిక ఆలోచనను రేకెత్తిస్తాయి. పక్షులను, జంతువులను, చెట్లను ప్రధాన పాత్రలుగా చేసుకొని ప్రకృతి పరిసరాల్లో చిక్కగా అల్లిన చక్కని బాలల కథలు ఇవి.ప్రతి పాఠశాలలో బాలలతో పాటు ఉపాధ్యాయులు కూడా చదవాల్సిన మంచి పుస్తకం ఇది.

లిటిల్స్, బాలల కథలు(తెలుగు, ఇంగ్లీష్)
రచన : పుల్లూరు జగదీశ్వర రావు
వెల : రు.120/ పేజీలు : 142
ప్రతులకు : కె. శ్రీలత ఇం.నం:9-4-460/3 సప్తగిరి కాలని, కరీంనగర్,505001, సెల్.నం:9441538797.

అనువాద కవిత

త్రిపది

హిందీ మూలం:
డా॥కైలాష్ బాజ్‌పేయ్
తెలుగు అనువాదం:
పారనంది నిర్మల
సెల్: 9985103804

దుఃఖానికి దుఃఖంగా ఉంది
దానినెవరూ కోరుకోరని
ఐతే సుఖానికీ దుఃఖంగా ఉంది
తన కన్ను యేడవ లేదని
సుఖం దెబ్బ తిని పడుకోలేదు

స్ఫూర్తిదాయక కవిత్వానికి నిదర్శనం

పల్లె సతీష్, 9010953659

కవిత్వం మనిషిలోని లోతైన భావాలు, ఆలోచనలు, అనుభూతులను వ్యక్తీకరించడానికి ఒక శక్తిమంతమైన సాధనం. మాటల్లో చెప్పలేని వాటిని కవితా రూపంలో వ్యక్తపరచడం వల్ల మానసిక ఉల్లాసం కలిగిస్తుంది. దుఃఖం, కోపం, ఆనందం వంటి భావోద్వేగాలను భాషలోని అందాన్ని లయాత్మకంగా ఆస్వాదించేలా చేస్తుంది. ఇది జీవితంలోని సౌందర్యాన్ని, సూక్ష్మంగా గ్రహించే శక్తిని పెంచుతుంది. కవులు తమ కవిత్వం ద్వారా సమాజంలోని సమస్యలను ప్రశ్నించారు. ఇది ప్రజలలో సామాజిక స్పృహను పెంపొందించి, మార్పుకు ప్రేరణగా నిలుస్తుంది. కవులు ఎంత బలమైనవారంటే, తమ చుట్టూ ఉన్న వారిని వారి మాటల ద్వారా, రచనల ద్వారా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేయగలరు.

డా. మహమ్మద్ హసేన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే తెలుగు సాహిత్యంలో భిన్నమైన రచనలు చేస్తూ, ఎందరో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ చేస్తున్నారు. తన రచనల ద్వారా నేటి సమాజంలోని సాహితీ ప్రియులకు ఒక కొత్త ఒరవడిని పరిచయం చేస్తూ, ఇటీవలే వెలువరించిన కవితాసంపుటి 'నువ్వే ఒక సమూహం'.

'నువ్వే ఒక సమూహం' అనే పేరు చాలా శక్తిమంతంగా, ఆలోచింపజేసే విధంగా ఉంది. మనిషి లోపల అనేక సంఘర్షణలు ఉంటాయి. ఇవన్నీ కలిపి ఒక వ్యక్తిని ఒక సంక్లిష్టమైన శక్తిగా మారుస్తాయి. మనుషులు సంఘజీవులు. ప్రతి వ్యక్తి తన ఆలోచనలు, భావజాలాలతో ఈ సమాజంలో భాగమవుతాడు. ఈ కవితాసంపుటిలో తొలికవిత 'మంచు దుప్పటి' ఈ కవిత్వంలో చలికాలపు పల్లె వాతావరణాన్ని, దానితో ముడిపడిన మానవ సంబంధాలను, భావోద్వేగాలను అద్భుతంగా చిత్రీకరించారు. మానవ స్వభావంలోని అలసత్వాన్ని, సుఖలోలత్వాన్ని ప్రకృతికి ఆపాదించి కవి చూపారు. ఇది మనుషులు తమ విధులను తాత్కాలికంగా పక్కన పెట్టి సుఖాలను ఆస్వాదించడాన్ని వ్యంగ్యంగా తెలియజేస్తుంది. 'ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మల్లెల మంచు' అనేది చలిని, హిమపాతాన్ని సున్నితమైన, సువాసనభరితమైన మల్లెపూలతో పోల్చడం కవితలోని గొప్ప సౌందర్యం. చలిని కూడా ఆస్వాదించగలిగే గ్రామీణ జీవితపు సానుకూల దృక్పథాన్ని సూచిస్తుంది.

'వాన వెలిశాక' అనే కవితలో 'కళ్లంలో ఆశలు ఆరబోసిన అన్నదాతకు కన్నీరే మిగిలింది'
'మక్కలు ముక్కినవి'
'వరి ఉరికొయ్యలా మారింది'
'కష్టాలు నష్టాల త్రాసులో పాసంగం మిగిలింది' ఈ కవితా పంక్తుల్ని పరిశీలించి చూస్తే...

రైతు పడే కష్టాలను, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను, నిరాశను, నిస్సహాయతను, వారి కన్నీటి గాథను ఆవిష్కరించారు. రైతులు నిత్యం ఎదుర్కొనే సవాళ్లను, వారి జీవితంలోని విషాదాన్ని తెలిపారు.

'నువ్వు నేను భాయీభాయీ' అనే కవితలో



హిందూ,ముస్లిం, క్రైస్తవం అనే మతాల అడ్డుగోడల్ని కూల్చివేసి, మానవత్వంతో పాలునీళ్లలా కలిసిపోవాలని తెలిపిన విధానం అద్భుతం.

'ఆశ' అనే కవితలోని ఒక పంక్తిలో- 'కాలం కలిసి రావట్లేదని నిరాశపడకు కార్యం మంచిదైతే కాలం కూడా సహకరిస్తుందినిరీక్షించి చూడు' అని. ఆత్మవిశ్వాసంతో ప్రయత్నం చేస్తే ప్రతిఒక్కరు 'విజేతగా' నిలవొచ్చు అని వెన్నుతట్టి ప్రోత్సహించే విధంగా రాశారు.

'బాధభయం' అనే కవితలో మనిషికి మంచి ఆలోచనలు తట్టాలంటే! కొన్ని ప్రతీకలతో చక్కని కవిత్వం అల్లిన విధానం బాగుంది. అవి జనన మరణాల మధ్య ప్రాణి, పగలు, రాత్రుల వెంట ముడిపడి ఉన్న భూత, వర్తమాన, భవిష్యత్‌ల మధ్య జీవిత చక్రం నడిపించే ఆలోచనలను తట్టిలేపాలని గుర్తుచేశారు.

'నువ్వే ఒక సమూహం' ఈ కవితాసంపుటిలో చివరి కవిత. ఈ కవితలో సూర్యుడు, జాబిలి, దీపం, నది వంటి అంశాలను ఒంటరితనానికి ప్రతీకలుగా ఉపయోగించడం ద్వారా మానవ అనుభవంలోని లోతైన భావోద్వేగాన్ని అద్భుతంగా చిత్రీకరించారు. సూర్యుడు, తన తేజస్సుతో లోకాన్ని ప్రకాశింపజేస్తాడు. జాబిలి చీకటి ఆకాశంలో ఒంటరిగా ప్రకాశిస్తూ, చల్లని వెన్నెలను పంచుతుంది. దీపం తనను తాను కాల్చుకుంటూ ఇతరులకు వెలుగునిస్తుంది. నది నిరంతరం ప్రవహిస్తూ, అనేక ప్రాంతాలను కలుపుతూ వెళ్లినా, దాని ప్రవాహం ఏనాడూ ఆగదు, ఎక్కడా స్థిరంగా ఉండదు. నది ప్రవాహం మానవ జీవితంలోని నిరంతర కదలిక. ఈ ప్రతీకలన్నీ కలిసి, ఒంటరితనం నుంచి సమూహం వైపు మన ప్రయాణం సాగాలని చక్కగా వ్యక్తం చేశారు.

ఈ కవితా సంపుటి ప్రతి వ్యక్తిలోని వైవిధ్యాన్ని, సామాజిక అనుసంధానాన్ని తెలియజేస్తుంది. ఒక మనిషి ఆలోచనలు, భావనలు, జీవన శైలికి ఒక సమూహంలా విస్తరించడాన్ని ఇది సూచిస్తుంది. కొన్నిసార్లు మనిషి ఒంటరిగా ఉన్నా, తన భావాలతో, తన అనుభవాలతో, ఎంతో కొంత సంఘర్షణకి లోనవుతాడు. తనలోని ఒంటరితనాన్ని పారద్రోలి ఆత్మస్థైర్యాన్ని కలిగించేలా ఉంది ఈ కవితాసంపుటి. ఇందులో మొత్తం 55 కవితలు దేనికవే వస్తువైవిధ్యంతో రాయడం కవి గొప్పతనం. ఈ కవితా సంపుటిని గుడిపాటిగారు 'యువత మనోవరణాన్ని వెలిగించే కవితాదీపం' అనే శీర్షికతో ముందుమాట రాయడం కొసమెరుపు. ఈ సంపుటిని పాలపిట్ట బుక్స్ హైదరాబాద్ వారు ప్రచురించారు.

నలందలో యువకుడి కాల్చివేత

ఇది ప్రతీకార హత్య: డీఎస్పీ

పట్నా: బీహార్‌లోని నలంద జిల్లాలో పట్టపగలు ఓ యువకుడి(18)ని గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. ఈ ఘటన సర్మెరా పోలీస్ స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. యువకుడిని చంపిన అనంతరం దుండగులు పారిపోయారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. నలంద జిల్లాలోని చుహార్‌చక్ గ్రామం శివారులో గుర్తు తెలియని దుండగులు అదే గ్రామానికి చెందిన బ్రిజ్ యాదవ్ కుమారుడు శిశుపాల్ కుమార్ అలియాస్ కరుపై కాల్పులు జరిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... శిశుపాల్ కుమార్ హత్య శత్రుత్వం, పాత పగల కారణంగా జరిగి ఉండవచ్చని చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బీహార్‌షరీఫ్ సదర్ ఆస్పత్రికి తరలించారు. హత్యపై సదర్ డీఎస్పీ నూరుల్ హక్ మాట్లాడుతూ... జూలై 12, 13 తేదీలలో చుహార్‌చక్ గ్రామంలో కిషోరి యాదవ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేయబడ్డాడు. ఈ హత్య కేసులో శిశుపాల్ పేరు బయటికి వచ్చింది. ఈక్రమంలో తండ్రీకొడుకులు వారి పొలాల్లో పనికి వెళ్లినప్పుడు గుర్తుతెలియని దుండగులు శిశుపాల్ కుమార్‌పై కాల్పులు జరిపారు. కిషోరి యాదవ్ హత్యకు దుండగులు ప్రతీకారం తీర్చుకోవడానికి శిశుపాల్‌ను కాల్చి చంపి పారిపోయారని అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే, సర్మెరా స్టేషన్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం బీహార్ షరీఫ్ సదర్ ఆస్పత్రికి తరలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నేరస్థులను గుర్తించి అరెస్టు చేస్తామని చెప్పారు.

కత్తెరతో భార్యను, అత్తను కడతేర్చాడు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని రోహిణి సెక్టార్ 17లో ఓ వ్యక్తి తన అత్తను, భార్యను కత్తెరతో హత్య చేశాడు. కుమార్తె పుట్టినరోజున వచ్చిన బహుమతి విషయంలో భార్యాభర్తల మధ్య వివాదం చోటుచేసుకోవడంతో నిందితుడు తన భార్య, అత్తని కత్తెరతో హత్య చేసినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తెరలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... రోహిణి సెక్టార్‌లో యోగేష్ సెహగల్ అనే వ్యక్తి తన భార్య ప్రియ (27), అత్త కుసుమ్ సిన్హా (63), కుతూరుతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో కుమార్తె పుట్టిన రోజున వచ్చిన బహుమతుల విషయంలో భార్యాభర్తలకు గొడవ జరిగింది. అలాగే వారి మధ్య గృహ వివాదం కూడా చోటుచేసుకుంది. దీంతో నిందితుడు యోగేష్ తన భార్య, అత్తపై కత్తెరతో దాడి చేసి కడతేర్చాడు. అనంతరం నిందితుడు ఘటనా స్థలం నుంచి తప్పించుకొని పారిపోయాడు. వెంటనే నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. విచారణలో హత్య వెనుక అసలు కారణాలు తెలుస్తాయని అన్నారు. వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బీహార్‌లో బీఎస్పీ ఒంటరి పోరు: మాయావతి

లక్నో: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి ప్రకటించారు. రెండు రోజుల పాటు జరిగిన పార్టీ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని, ఎన్నికల సన్నద్ధతపై రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "రాబోయే కొన్ని నెలల్లో జరగనున్న ఎన్నికలకు మొత్తం సన్నద్ధత, అభ్యర్థుల ఎంపికపై పార్టీ సీనియర్ నేతలతో చర్చలు జరిగాయి' అని అన్నారు. సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభం కానున్న పార్టీ ర్యాలీలు, బహిరంగసభలు వంటి కార్యక్రమాలు తన ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించబడతాయని ఆమె స్పష్టం చేశారు. ఇందుకోసం బీఎస్పీ జాతీయ సమన్వయకర్త ఆకాష్ ఆనంద్, రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్, పార్టీ బీహార్ శాఖకు ప్రధాన బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. రాష్ట్రాన్ని మూడు జోన్‌లుగా విభజించి...సీనియర్ నాయకులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మార్చి 2న మాయావతి...తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను పార్టీ పదవుల నుండి బహిష్కరించారు. కానీ ఆయన బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాత, ఏప్రిల్‌లో ఆయనను తిరిగి పార్టీ జాతీయ ప్రధాన సమన్వయకర్తగా నియమించారు. బీహార్‌లో మెరుగైన ఫలితాలను అందించడానికి లోపాలను సరిదిద్దుకుని, పూర్తి అంకితభావంతో పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించినట్లు బీఎస్పీ అధినేత్రి చెప్పారు. కాగా బీహార్‌లో పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిస్థితుల, ఎన్నికల సమీకరణాలను తెలియజేస్తూ... రాబోయే ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధిస్తామని బీఎస్పీ నాయకులు ఉన్నతస్థాయి సమావేశంలో మాయావతికి హామీ ఇచ్చారు. ఒడిశా, తెలంగాణలో పార్టీ నిర్మాణ ప్రయత్నాలను కూడా మాయావతి సమీక్షించారు.

బీహార్‌లో రాజకీయ వారసుల హవా

టికెట్ల కోసం విశ్వప్రయత్నాలు

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు గుర్రాల వేటలో నిమగ్నమయ్యాయి. అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ప్రధానంగా కుల, కుటుంబ, వారసత్వ, ధన రాజకీయాలపై దృష్టి సారించాయి. దీనికి ఏ ఒక్క రాజకీయ పార్టీ అతీతం కాదు. కండబలం, ధనబలం గల నేతల వారసులకు అసెంబ్లీ టికెట్లు ఇచ్చేందుకు పార్టీలన్నీ సిద్ధమయ్యాయి. ప్రముఖ రాజకీయ కుటుంబాల వారసులు ఈ ఎన్నికల్లో పోటీకి సమాయత్తమయ్యారు. వాస్తవంగా బీహార్‌లో కొన్ని కుటుంబాలదే ఆధిపత్యం ఉంటుంది. బీహార్ రాజకీయాల్లో నితీశ్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్, రాంవిలాస్ పాశ్వాన్, జితన్ రామ్ మాంఝీ, శకుని చౌదరి కుటుంబాల హవా వీస్తోంది. వీటితో పాటు మరో 15 కుటుంబాలు రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నాయి. ఈ రాష్ట్రంలో షాబుద్దీన్, ఆనంద్ మోహన్, పప్పూ యాదవ్ వంటి కండబలం గల నేతలు, వారి వారసులు, కుటుంబీకులు రాజకీయాల్లో దూసుకుపోతున్నారు. బలమైన కుటుంబ, రాజకీయ నేపథ్యాలు గల నేతలు ఈ ఎన్నికల్లో తమ వారసుల కోసం అసెంబ్లీ టికెట్లు సాధించేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఈ అంశంపై జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 30 ఏళ్లుగా బీహార్ రాజకీయాలపై 1250 కుటుంబాలే పెత్తనం చెలాయిస్తున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఏ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉన్నా... బీహార్ అధికారం మాత్రం ఆ కుటుంబాల చేతిలోనే ఉంటోందన్నారు. ఇప్పటికే లాలు కుటుంబం, నితీశ్‌కుమార్ కుటుంబం, రాం విలాస్ పాశ్వాన్, బాబు జగ్జీవన్‌రామ్, కర్పూరి ఠాకూర్, శకుని చౌదరి, జితన్‌రామ్ మాంఝీ, తస్లీముద్దీన్ కుటుంబాలు రాజకీయంగా బలంగా నాటుకుపోయాయి. వీటితో పాటు మహ్మద్ షాబుద్దీన్ ఆర్‌జేడీకి చెందిన పెద్దనాయకుడు. ఆయన అనేకసార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిచారు. ఇప్పుడు తన కుమారుడు మహ్మద్ ఒసామా ఆర్‌జేడీ టికెట్‌పై అసెంబ్లీకి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. మహ్మద్ షాబుద్దీన్ 2021 మే 1న చనిపోయారు. రాజకీయంగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆనంద్‌మోహన్ తన రెండో కుమారుడు అన్షుమన్ ఆనంద్ పోటీకి రెడీగా ఉన్నారు. బీహార్ రాజకీయాల్లో పప్పుయాదవ్ పేరు తెలియని వారు లేరు. ఆయన తొలిసారిగా 1990 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. ఆ తర్వాత 1991, 1996, 1999, 2004, 2014, 2024 ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. ఒకసారి స్వతంత్ర ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు స్వతంత్ర ఎంపీగా ఎన్నికయ్యారు. ఆర్‌జేడీ టికెట్‌పై ఒకసారి ఎంపీ అయ్యారు. పప్పూ యాదవ్ కొంతకాలం సొంత పార్టీ నడిపారు. అయితే దాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేసి, కాంగ్రెస్ నాయకుడిగా మారారు. ఇందుకు ప్రతిగా పప్పూ యాదవ్ భార్య రంజిత్ రంజన్‌కు కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ టికెట్ (సుపాల్ స్థానం) ఇచ్చింది. ఇప్పుడు పప్పూ యాదవ్ కుమారుడు సార్థక్ రంజన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సమాయత్తమయ్యారు.జేడీయూ నేత ప్రభునాథ్‌సింగ్ తన కుమారుడు రణధీర్ కుమార్‌ను రంగంలోకి దించుతున్నారు. ఇక రాజకీయ కుటుంబాలను పరిశీలిస్తే...లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం చాలాకాలం పాటు బీహార్ రాష్ట్రాన్ని పాలించింది. ఆయన భార్య రాబ్డీదేవి, ఇద్దరు కుమారులు తేజస్వీ యాదవ్, తేజ్ ప్రతాప్ యాదవ్, కుమార్తెలు మీసా భారతి, రోహిణి రాజకీయాల్లో ఉన్నారు. లాలూ ప్రసాద్ బావమరుదులు సాధు యాదవ్, సుభాష్ యాదవ్ కూడా రాజకీయాల్లో ఉన్నారు. అయితే ఇటీవలే తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి లాలూ బహిష్కరించారు. దీంతో ఇప్పుడు తేజ్ ప్రతాప్ సొంత రాజకీయాలు చేస్తున్నారు. తేజస్వీ యాదవ్ ఆర్‌జేడీలో అగ్రనేతగా ఎదిగారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వీ, తేజ్ ప్రతాప్ ఇద్దరూ పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. రాంవిలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఇప్పుడు ఎల్‌జేపీని ఈయనే నడుపుతున్నారు. రామ్ విలాస్ పాశ్వాన్ సోదరుడు పశుపతి పారస్ రాష్ట్రీయ లోక్‌జనశక్తి పేరుతో మరో పార్టీ నడుపుతున్నారు. రాంవిలాస్ మేనల్లుడు ప్రిన్స్ పాశ్వాన్, అల్లుడు అరుణ్ భారతి కూడా రాజకీయాల్లో ఉన్నారు. రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తరువాత ఎల్‌జేపీ రెండు ముక్కలుగా విడిపోయింది. ఒక భాగాన్ని చిరాగ్, మరో భాగాన్ని పశుపతి నడుపుతున్నారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని చిరాగ్ ప్రకటించారు. జితన్ రామ్ మాంఝీ ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఆయన గతంలో బీహార్ సీఎంగా సేవలు అందించారు. జితన్ రామ్ మాంఝీ కుమారుడు సంతోష్ మాంఝీ ఎమ్మెల్సీ హోదాలో మంత్రిగా ఉన్నారు. జితన్ మాంఝీ కోడలు దీపా మాంఝీ, అత్త జ్యోతి మాంఝీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఆయన కోడలు, అత్త ఈసారి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి ఈ కుటుంబం నుంచి మరో కొత్త రాజకీయ వారసుడు కూడా ఎంట్రీ ఇస్తాడనే ప్రచారం జరుగుతోంది. బీహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న బీజేపీ నేత సామ్రాట్ చౌదరి... శకుని చౌదరి కుమారుడు. ఈయన చాలాకాలంగా రాజకీయాల్లో ఉన్నారు. గతంలో మంత్రిగానూ శకుని చౌదరి సేవలు అందించారు. ఆయన భార్య పార్వతీదేవి ఎమ్మెల్యే అయ్యారు. శకుని చౌదరి ఇతర కుమారులు రాజకీయాల్లో ఉన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ లభిస్తే పోటీ చేస్తామని వారు అంటున్నారు.

సీఎం నితీశ్ కుమార్ మొదటి నుంచీ వారసత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తున్నారు. జేడీయూ పార్టీలోనూ ఈ దిశగానే ఆయన నిర్ణయాలు తీసుకుంటారు. అయితే ఇటీవల కాలంలో నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. దీంతో జేడీయూ పార్టీ రాజకీయ భవితవ్యం ఎలా ఉంటుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. తమ వారసులకు అసెంబ్లీ టికెట్లు ఇవ్వాలంటూ కొంతమంది జేడీయూ నేతలు నితీశ్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. ఒకవేళ జేడీయూలోని నేతల రాజకీయ వారసులకు అసెంబ్లీ టికెట్లు ఇవ్వకుంటే, వారు ఇతర పార్టీల వైపు చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్పూరి ఠాకూర్ కుటుంబం బీహార్ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించింది. కర్పూరి ఠాకూర్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు వంటి కీలక పదవులు నిర్వర్తించారు. చాలాకాలం ఎమ్మెల్యేగా ఉన్నారు. అయినప్పటికీ ఆయన జీవితకాలంలో కుటుంబంలోని ఎవరూ రాజకీయాల్లోకి రాలేదు. అయితే కర్పూరి ఠాకూర్ మరణం తరువాత ఆయన చిన్న కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు కేంద్రమంత్రి పదవి కూడా లభించింది. ఇటీవలే కర్పూరి ఠాకూర్ రెండో కుమారుడి కుమార్తె రాజకీయాల్లోకి వచ్చారు.

ఆమె ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీలో చేరారు. టికెట్ లభిస్తే ఎన్నికల్లో పోటీ చేస్తానని ఆమె అంటున్నారు. బాబూ జగ్జీవన్ రామ్ కుటుంబం సైతం కీలకంగా ఉంది. జగ్జీవన్ రామ్ పేరు బీహార్‌తో పాటు యావత్ దేశ రాజకీయాల్లో ప్రముఖమైనది. లోక్‌సభ మాజీ స్పీకర్, కాంగ్రెస్ నాయకురాలు మీరా కుమార్ బాబూ జగ్జీవన్ రామ్ కుమార్తె. ఇప్పుడు మీరా కుమార్ కుమారుడు అన్షుల్ రాజకీయాల్లోకి వస్తున్నారు. ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల్లో పట్నా సాహిబ్ నుంచి పోటీ చేశారు. ఇలా చాలా కుటుంబాలు తమ వారసులను రాజకీయ చిత్రంపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి.

నిరసనకారులకు చాక్లెట్లతో రాహుల్ సమాధానం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తనపై విమర్శలు చేస్తున్నవారికి అత్యంత విచిత్రంగా సమాధానం చెప్పారు. బీహార్‌లోని ఆరాలో 'ఓటర్ అధికార్ యాత్ర'లో పాల్గొన్న రాహుల్ గాంధీ తనకు ఎదురైన నిరసనకారులకు ప్రేమతో సమాధానం చెప్పారు. ఇటీవల బీహార్‌లో రాహుల్ గాంధీ ర్యాలీ వేదికపైనున్న కొందరు నేతలు... ప్రధాని మోదీ, ఆయన తల్లిపై దుర్భాషలాడారని బీజేపీ ఆరోపించింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. ఈ వ్యాఖ్యలను బీజేపీ నేతలు ఖండించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా... కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇందుకు బాధ్యత వహిస్తూ, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం నేపథ్యంలో బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) కార్యకర్తలు రాహుల్ గాంధీ యాత్రకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసనలు చేపట్టారు. తాజాగా ఆరా జిల్లాలో జరుగుతున్న ఈ నిరసనలకు రాహుల్ గాంధీ అనూహ్యంగా స్పందించారు. నిరసనకారులకు చాక్లెట్లు ఇచ్చి, సమస్యను స్నేహపూర్వకంగా పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అలాగే రాహుల్ యాత్ర మరింతమంది దృష్టిని ఆకర్షించింది. కాంగ్రెస్ నేతలు ఈ వివాదాన్ని బీజేపీ రాజకీయ కుట్రగా అభివర్ణించారు. దర్భంగా ఘటనలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి బీజేపీ ఏజెంట్ అని, యాత్ర జనాదరణను అడ్డుకోవడానికి ఈ ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. అయితే, బీజేపీ నేతలు ఈ ఘటనను ఖండిస్తూ, రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన బీహార్ రాజకీయాల్లో మరింత ఉద్రిక్తతను సృష్టించింది. రాహుల్ చేపట్టిన ఈ యాత్ర బీహార్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనున్నదని పలువురు అంటున్నారు. రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్‌లతో పాటు ఇతర ఇండియా ఐక్యసంఘటన్ నేతలు ఈ యాత్ర ద్వారా ఓటర్లను చైతన్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు.

యూపీఎస్సీ అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు'

మన్‌కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ: యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. దీని ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నట్లు మన్‌కీ బాత్ 125వ కార్యక్రమంలో ఆయన తెలిపారు. దేశంలో కఠినమైన పరీక్షల్లో సివిల్ సర్వీసెస్ ఒకటని... ప్రతి ఏడాది ఎంతో మంది అభ్యర్థులు రాస్తుంటారన్నారు. ఎంతో సమయం, డబ్బును ఖర్చు చేసి నిజాయతీగా కష్టపడుతున్న అభ్యర్థులు ఒక్కోసారి స్వల్ప తేడాతో సివిల్స్ తుది జాబితాలో చోటు దక్కించుకోలేకపోతున్నారని... ఇలాంటి వారి కోసం 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. సివిల్స్ పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించి... మెరిట్ లిస్టులో పేరు లేని అభ్యర్థుల వివరాలను ఇకపై ఈ పోర్టల్‌లో ఉంచనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఈ వివరాలను ప్రైవేట్ కంపెనీలు తీసుకొని... తమ సంస్థలలో వారికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలపై మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయన్నారు. అనేక రాష్ట్రాల్లో భారీ వరదల కారణంగా చాలామంది ప్రాణాలు కోల్పోయారని... వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారన్నారు. తీవ్రంగా శ్రమిస్తున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు, భద్రతా దళాలు, సామాజిక కార్యకర్తలు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వినాశకరమైన ప్రకృతి వైపరీత్యాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నప్పటికీ... అనేక విషయాల్లో ముందుకు వెళ్తుందన్నారు. ఇటీవల శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో నిర్వహించిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ గురించి మోదీ ప్రస్తావించారు. దేశ్యాప్తంగా 800 మందికి పైగా అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారన్నారు. పురుషులతో సమానంగా మహిళా అథ్లెట్లు కూడా ప్రతిభ చూపారన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా కశ్మీర్‌లోని పుల్వామాలో తొలిసారిగా డే-నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని పేర్కొన్నారు. దేశం మార్పువైపు పయనిస్తోందనడానికి ఇవి ఉదాహరణగా నిలిచాయన్నారు.

చైనాతో మెతక వైఖరి తగునా?

మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య టియాంజిన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిగిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. చైనా పట్ల మోదీ సర్కార్ మెతక వైఖరి అనుసరిస్తూ... దేశ భద్రత విషయంలో రాజీ పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. చైనా దూకుడుకు, బెదిరింపులకు తలొగ్గడమే భారత కొత్త భద్రతా విధానమా అని సూటిగా ప్రశ్నించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా మోదీ సర్కారు విధానాలపై నిప్పులు చెరిగారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన విషయాన్ని విస్మరించి చైనాతో రాజీకి ప్రయత్నించడం దారుణమని విమర్శించారు. "చైనా దురాక్రమణను గుర్తించడానికి బదులుగా, ప్రధాని మోదీ వారికి క్లీన్ చిట్ ఇచ్చారు" అని ఆయన ఆరోపించారు. సరిహద్దుల్లో యథాతథ స్థితిని పూర్తిగా పునరుద్ధరించాలని భారత సైన్యాధిపతి కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చైనాతో సయోధ్యకు మొగ్గుచూపడం వారి దురాక్రమణను చట్టబద్ధం చేయడమేనన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో చైనా కుమ్మక్కైన తీరును మన ఆర్మీ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ జులై 4న స్పష్టంగా వివరించారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. "ఈ అపవిత్ర పొత్తుపై స్పందించాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం దానిని మౌనంగా అంగీకరించి ఇప్పుడు చైనాకు రాచమర్యాదలు చేస్తోంది" అని ఆయన ఆక్షేపించారు. దేశంలోకి ఇబ్బడిముబ్బడిగా చైనా ఉత్పత్తులు వచ్చిపడుతుండటంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యార్లంగ్ త్సాంగ్పో (బ్రహ్మపుత్ర) నదిపై చైనా నిర్మిస్తున్న భారీ హైడల్ ప్రాజెక్టు వల్ల ఈశాన్య రాష్ట్రాలకు తీవ్ర ముప్పు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ విషయంపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

సీఎం అభ్యర్థిని నేనే: తేజస్వి

పట్నా: బీహార్‌లో ప్రతిపక్ష మహా ఘట్‌బంధన్ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిని తానేనని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రకటించుకున్నారు. ఆరా జిల్లాలో ఓట్ అధికార్ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సమక్షంలో తేజస్వి ఈ ప్రకటన చేశారు. అయితే రాహుల్‌గాంధీ మాత్రం తేజస్వి ప్రకటనపై మౌనంగా ఉండిపోయారు. ఆరా ర్యాలీలో తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ... తాను ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలనే సీఎం నితీశ్ కుమార్ అమలు చేస్తున్నారని ఆరోపించారు. ముందు తాను వెళ్తుంటే ప్రభుత్వం వెనుక వస్తోందని అన్నారు. మీకు కాపీ కొట్టే సీఎం కావాలా... నిజమైన సీఎం కావాలా అని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినప్పటికీ బీహార్‌లో ఆర్జేడీ పెద్దన్న అని వ్యాఖ్యానించారు. అంటే రాష్ట్రంలో కాంగ్రెస్ కంటే ఆర్జేడీదే పైచేయి అన్న అర్థంలో తేజస్వి మాట్లాడారు.

మహువా మొయిత్రాపై ఎఫ్ఐఆర్

రాయ్‌పూర్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానిక నివాసి గోపాల్ సమంటో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, మానా పోలీస్ స్టేషన్‌లో మొయిత్రాపై బీఆర్ఎస్ సెక్షన్లు 196, 197 కింద కేసు నమోదు చేసినట్లు ఓ అధికారి పేర్కొన్నారు. గత గురువారం పశ్చిమబెంగాల్‌లోని నాడియా జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మహువా మొయిత్రా మాట్లాడుతూ... సరిహద్దు భద్రతపై మోదీ ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ... ఆమె అమిత్‌షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని గోపాల్ సమంటో ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు రాజ్యాంగవిరుద్ధమని అన్నారు. 1971లో రాయ్‌పూర్‌లోని మానా క్యాంప్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో బంగ్లాదేశ్ శరణార్థులు స్థిరపడ్డారని, మొయిత్రా ప్రకటన వారిలో భయాన్ని సృష్టించిందని అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ఆ శరణార్థులపై ఇతర వర్గాల్లో ఆగ్రహాన్ని రేకెత్తించే అవకాశం ఉందని అన్నారు.

ఎయిరిండియా ఇంజిన్‌లో మంటలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ నుంచి ఇండోర్‌కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం కుడి ఇంజిన్‌లో మంటలు రేగినట్లు సూచన అందుకున్న పైలట్... ఆ విమానాన్ని వెంటనే ఢిల్లీకి మళ్లించినట్లు ఎయిరిండియా తెలిపింది. ఆ విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశామని, ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలో ఇండోర్‌కు తరలించామని అధికారులు తెలిపారు. ఢిల్లీ నుంచి ఇండోర్‌కు ఆదివారం బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కాక్‌పిట్ సిబ్బందికి ఇంజిన్‌లో మంటలు వస్తున్నట్లు సూచన అందింది.

పంజాబ్‌కు వరద పోటు

- సట్లేజ్, బియాస్, రావి నదుల ఉధృతి
- మూడు లక్షల ఎకరాల్లో పంట నష్టం
- జల దిగ్బంధంలో ఏడు జిల్లాలు
- నీట మునిగిన 1,018 గ్రామాలు

చండీగఢ్: పంజాబ్ రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయి. నాలుగు దశాబ్దాల్లో చూడని విధంగా వరదలు పోటెత్తగా ఏడు జిల్లాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. 1,018 గ్రామాలు నీట మునిగాయి. మూడు లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వరదల్లో చిక్కుకున్న 11,300 మందిని సహాయక సిబ్బంది కాపాడగా, ముంపు ప్రాంతాల నుంచి 4,700 కుటుంబాలను ఖాళీ చేయించారు. ఒక్క ఫజిల్కా జిల్లాల్లోనే 41,099 ఎకరాల పంట నష్టం సంభవించింది. ఇక ఫిరోజ్‌పూర్, కపుర్తలా, పఠాన్, హోషియార్పూర్ జిల్లాల్లోనూ వేలాది ఎకరాలు నీటి మునిగాయి. బకర్నాలా, ఫిరోజ్‌పూర్, కపుర్తలాలో ఒకొక్కరు చొప్పున ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లో భారీగా వర్షాలు, వరదలు సంభవించడంతో సట్లెజ్, బియాస్, రావి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పంజాబ్‌లోని గురుదాస్‌పూర్, అమృత్‌సర్, తారన్ తార్న్, ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫజిల్కా కపుర్తల, హోషియార్పూర్ జిల్లాలు ముంపునకు గురయ్యాయి. 77 శిబిరాలలో 4,729 మందికి పునరావాసం కల్పించారు. కపుర్తల, ఫిరోజ్‌పూర్, గురుదాస్‌పూర్, మోగా, ఫజిల్కా సహా అనేక జిల్లాల్లో సహాయ సామగ్రి పంపిణీ జరుగుతోంది. ఆర్మీ, వైమానిక దళం, బీఎస్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌తో పాటు పంజాబ్ పోలీసులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. హెలికాప్టర్ల ద్వారా మందులు తదితర అత్యవసాల పంపిణీ సాగుతోంది. మూడు ఆధునిక తేలికపాటి హెలికాప్టర్లు, ఆరు ఎంఐ-17, ఒక చినూక్, 10 నిఘా-పరిశీలన హెలికాప్టర్లను రంగంలోకి దింపి అత్యవసర సేవలు అందిస్తున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. వెస్టరన్ కమాండ్ ఆర్మీ కమాండర్, లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ పర్యవేక్షణలో మానవతా సహాయ, పునరావాసం (హెచ్ఏడీఆర్) ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. ఆయన క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సహాయక చర్యలను సమీక్షిస్తున్నారు.

రూ.60వేల కోట్ల పెండింగ్ నిధులివ్వండి: మోదీకి మాన్ లేఖ

వరద పరిస్థితి దృష్ట్యా తమకు రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కోరారు. పెండింగ్ ఉన్న రూ.60వేల కోట్లను వెంటనే విడుదల చేయాలంటూ ఆయన ఆదివారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. నష్టపోయిన రైతులకు సముచిత పరిహారం ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రతి ఎకరాకు రూ.50వేలు చొప్పున పరిహారం ఇచ్చేందుకుగాను ఎస్డీఆర్ఎఫ్ నిధులకు సంబంధించిన నిబంధనలను సవరించాలని విజ్ఞప్తి చేశారు. డ్యామ్‌ల నుంచి భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో ఏడు జిల్లాలు... గురుదాస్‌పూర్, కపుర్తలా, అమృత్‌సర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, ఫజిల్కా, హోషియార్పూర్ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయని, వెయ్యికిపైగా గ్రామాలు ముంపునకు గురయ్యాయని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత క్షీణించే అవకాశం ఉందని వెల్లడించారు. పశు సంపదకూ భారీ నష్టం వాటిల్లిందని, గ్రామీణ ప్రజలు తమ ఇల్లు, జీవనోపాధిని కోల్పోయారని సీఎం పేర్కొన్నారు. 'జీఎస్టీ అమలు, వ్యాట్ మార్పు వల్ల రూ.49,727 కోట్ల ఆదాయాన్ని శాశ్వతంగా కోల్పోతామన్న అంచనా ఉంది... కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. గ్రామీణాభివృద్ధి నిధి (ఆర్‌డీఎఫ్), మండి అభివృద్ధి నిధి (ఎండీఎఫ్)లో కోతలతో రూ.8వేల కోట్లకుపైగా నష్టం వచ్చింది. రూ.828 కోట్లు విలువ చేసే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) ప్రాజెక్టులను కేంద్రం ఇటీవల రద్దు చేసింది, దీని వల్ల రాష్ట్ర గ్రామీణ అనుసంధానంపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుంది' అని తన లేఖలో మాన్ పేర్కొన్నారు. ఎస్డీఆర్ఎఫ్ నిధుల కోసం నోటిఫై చేసిన నిబంధనలు క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా లేవని, వాటిని సవరించాలని కోరారు. 33 శాతం, లేదా అంతకంటే ఎక్కువగా పంట నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతి హెక్టారుకు రూ.17,000 (అంటే ఎకరాకు రూ.6,800) చొప్పున ఖరారు చేయడమంటే రైతులకు నామమాత్రపు పరిహారం ఇవ్వడమే అవుతుందని, ఇది వారికి అన్యాయమన్నారు. అయితే, తమ ప్రభుత్వం అదనంగా రూ.8,200 కలిపి ఎకరా పంట నష్టానికి రూ.15వేలు చొప్పున రైతులకు ఇస్తుందని తెలిపారు. పంట కోతకు వచ్చిన సమయంలో వరదలు ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టంపోయారని, ఎకరాకు కనీసం రూ.50వేలు చొప్పున పరిహారం చెల్లించడం సముచితమని మాన్ వెల్లడించారు. ఆ దిశగా ఎస్డీఆర్ఎఫ్ నిధుల నిబంధనలను మార్పు చేయాలని ప్రధానిని కోరారు. ఎస్డీఆర్ఎఫ్ పథకం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 25 శాతం సమకూరుస్తుందని, కట్టుబడి ఉంటామని తన లేఖలో ప్రధాని మోదీకి భగవంత్ మాన్ స్పష్టంచేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పన్ను చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మోసం, పన్ను ఎగవేత మనీలాండరింగ్ లకు పాల్పడుతూ పన్ను చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తెలుగు రాష్ట్రాల ఆదాయపు పన్ను (దర్యాప్తు) డైరెక్టర్ జనరల్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్ తెలిపారు. హైదరాబాద్, బషీర్ బాగ్, ఓ హెటల్‌లో ఆదివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తు విభాగం అధికారులతో ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు సీఏ చంద్రశేఖర్ వేముల అధ్యక్షత వహించగా ఆనంద్ రాజేశ్వర్ బైవార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆర్థిక నేరాల వివిధ కోణాలను, అటువంటి నేరాల యొక్క కొత్త రకాల ఆవిర్భావాన్ని పర్యవేక్షించడానికి కొత్త రకాల ఆర్థిక నేరాలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఆదాయపు పన్ను (దర్యాప్తు) విభాగం సమర్థవంతంగా పని చేస్తుందని అన్నారు. పన్ను చట్టాలపై చార్టర్డ్ అకౌంటెంట్లు ప్రజలకు అవగాహన కల్పించి దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అనంతరం అసోసియేషన్ కార్యవర్గం ఆనంద్ రాజేశ్వర్ బైవార్‌ను శాలువా జ్ఞాపికతో సమానించారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను (దర్యాప్తు) అడిషనల్ కమీషనర్‌లు కొల్లిపాక శ్రీనివాసులు, జితేందర్ యాదవ్, అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సిఏ రామ్‌దేవ్ భూతాడ, సిఏ హితేష్ జైన్, కార్యదర్శి సిఏ ఆశిష్ జోషి, ఉపాధ్యక్షుడు సిఏ పి.వి. నారాయణరావు, కోశాధికారి సిఏ సోమేశ్వర్ నేమాని, ఎపి దహిమా, సీనియర్ సభ్యులు సిఏ దేవదాస్, సిఏ హరిహరన్ సిఏ అమృత్ కుమార్ కోటా తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలను దర్శించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక నగర్ డివిజన్ పరిధిలోని వినాయక మండపాలను కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, బీజేపీ నాయకులతో కలసి దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అదే విధంగా ఆయా మండపాలు వద్ద అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఓం ప్రకాష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంగేష్, నాయకులు గోపాల కృష్ణ, గోపాల్, సాయిసురేష్, జగదీష్ చారీ, జ్యోతిర్మయి, సుమలత, లక్ష్మి, మల్లేష్ యాదవ్, రమేష్, వెంకటేష్, సోమనాథ్ చారీ, పంజా శ్రీనివాస్, శ్రుకేశ్, సాయి రామ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు,

గణనాధుడి మండపాలను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి నిజాంపేట్ పాత గ్రామ పంచాయతీ, జర్నలిస్ట్ కాలనీ మారుతి అలెక్స్ అపార్ట్మెంట్స్, కొలన్ నారాయణ రెడ్డి కాలనీలలో వివిధ వినాయకుని మండపాలలోని నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమలలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, లీడర్ నరసింహ రెడ్డి, ఎన్ ఎమ్ సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వినాయకునికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ వెంకటేశ్వర్ నగర్ కాలనీలో అసోసియేషన్ ద్వారా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఘనంగా కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ పూజలు నిర్వహించారు. వారితో పాటు డివిజన్ అధ్యక్షులు నోరి సత్యమూర్తి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, హరికిషన్, జగదీశ్, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు బ్రహ్మయ్య, కాలనీ ప్రతినిధులు రాము, ప్రతాప్ సింగ్, ప్రసాద్, నర్సింగ్‌రావు, శంకర్, శోభ, సునీత పాల్గొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలు అయ్యేటట్లు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు తెలపాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. అసెంబ్లీలో మాత్రమే బిల్లు పాస్ అయితే సరిపోదనీ, పార్లమెంట్లో సైతం బీసీ బిల్లు పాసు కావడానికి బిజెపి నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలనీ, అదేవిధంగా ప్రతిపక్ష పార్టీ టిఆర్ఎస్ కూడా సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చ జరగాలనీ, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కామారెడ్డి, మెదక్, నిర్మల్, సిరిసిల్ల జిల్లాల ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. చనిపోయిన కుటుంబ సభ్యులకు 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. జాబ్ నోటిఫికేషన్లు వేసి ఉద్యోగాలను భర్తీ చేయాలనీ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అన్నింటిని అమలు పరచాలన్నారు. పెన్షన్లు 2వేల నుండి 4వేలు, వికలాంగులకు 4000 నుండి 6000 చేయాలి ప్రతి మహిళకు ఇస్తామన్న రెండువేల రూపాయలను వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర రాముగౌడ్, మాజీ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ అన్సారి, మాజీద్ అలాగే మహిళా నాయకులు, యమునాగౌడ్ హేమా సుదర్శన్ జిల్లోజు, మాజీ అధ్యక్షులు దర్శనం రమేష్ విజయ్, నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ హైదర్ మంచిర్యాల కన్వీనర్ నయీమ్ పాషా, అబ్దుల్ ముక్తధీర్, షహబాజ్, అఫ్జల్ సలాం, రమ్య గౌడ్, సుధారాణి, కొడంగల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్ట చర్యలు

రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని అవసరమైన చర్యలను తక్షణమే తీసుకుంటామని సింగరేణి సంస్థ చైర్మన్, ఎండి ఎన్.బలరామ్ తెలియజేశారు. ఎంఎన్ఆర్ గార్డెన్స్‌లో అదివారం జరిగిన 49వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో ఆయన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధులు, సింగరేణి అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్ థా అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. చైర్మన్, ఎండి బలరామ్ మాట్లాడుతూ... సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, అలాగే రక్షణలో కూడా ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, ప్రతి కార్మికుని ప్రాణాలు ఎంతో విలువైనవని, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, అలాగే యాజమాన్యంతో పాటు కార్మికులు కూడా రక్షణను ఖచ్చితంగా పాటించాలని కోరారు. చాలా ప్రమాదాల్లో నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్లే ప్రాణనష్టం చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వహించమని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదని అదే సమయంలో ప్రతీ ఒక్కరూ కూడా స్వీయ రక్షణ అత్యంత ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. అలాగే మహిళా ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, వారి రక్షణ తప్పనిసరిగా సంస్థ చూసుకుంటుందని తెలియజేశారు. ఈ సమావేశంలో గనుల్లో రక్షణ పెంపుదలకు కార్మిక సంఘాలు అనేక సూచనలు చేశాయి. నాణ్యమైన హెల్మెట్లు, బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు పెంపుదల, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు. కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి అనేక అంశాలపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయుసి యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయుసి జనరల్ సెక్రటరీ రాజ్ కుమార్, ఐఎన్ టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఇతర నాయకులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో మహిళలకు భూగర్భంలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్ థా, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ టీ.ఆర్. కన్నన్, ఇతర డి.జి.ఎం.యస్. అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం సంస్థ డైరెక్టర్లు (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణరావు, ఎల్.వి సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతం పొట్రూ రక్షణ చర్యలపై ప్రసంగించారు. సమావేశంలో ముందుగా ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమానికి జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ రక్షణ నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును వ్యతిరేకిస్తే రాజకీయ సమాధే : ఎంపీ ఆర్.కృష్ణయ్య

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు సాధించిన స్ఫూర్తితోనే చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఇదే చివరి పోరాటమని, బిసిలకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీసుకువచ్చిన బిల్లును ఎవరైనా వ్యతిరేకిస్తే సహించేది లేదని, రాజకీయ సమాధి చేస్తామని హెచ్చరించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్ అధ్యక్షతన ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'బిసిల యుద్ధభేరి' సభలో ఆయన మాట్లాడారు. కోర్టుకు ఏవరు వెళ్ళరాదని, ఏవరైన వెళితే పోరాడి విజయం సాధిస్తామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వేలాది హాస్టల్స్, గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కాలర్షిప్‌లు, ఫీజుల రీయంబర్స్మెంట్ పథకాలను సాధించడం జరిగిందని, ఈ పథకాలన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రీయంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుక రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఎత్తివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ, రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి మాట్లాడుతూ దోపిడి, అన్యాయం, అణిచివేతకు గురైన బిసిలు రాజ్యాధికారం సాధించాలని, ఇది సాధ్యం కావాలంటే బిసిలంతా ఐక్యంగా ఉండి బిసిలకే ఓట్లు వేయాలని సూచించారు. 56 శాతం ఉన్న బిసిలు రాజ్యాధికారంలో లేకపోవడం దారుణమన్నారు. ఆర్.కృష్ణయ్య తన జీవితాన్ని బిసిలకే అంకితం చేశారని, ఆయన వెంట ఉండి రాజ్యాధికారం సాధించాలన్నారు.

అనంతరం సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ మాట్లాడుతూ ఒక శాతం జనాభా ఉన్నవారు రాజ్యాన్ని పాలిస్తున్నారని అన్నారు. అసెంబ్లీలో బిసి బిల్లు ప్రవేశపెడుతుంటే మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌజ్ లో పడుకోవడానికేనా ఓటర్లు గెలిపించిందని ప్రశ్నించారు. బిసిలు చట్ట సభల్లో రిజర్వేషన్లు సాధించేంతవరకు వారి వెంట సిపిఐ ఉంటుందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి సాధించాలన్నారు. మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా ప్రధాని నరేంద్రమోదీ జనగణనలో కులగణన చేపడుతున్నారని, స్థానిక సంస్థల్లో, చట్ట సభల్లో బిసిలు పోరాటం ద్వారా రాజ్యాంగ బద్దంగా రిజర్వేషన్లు సాధించాలని పిలుపునిచ్చారు. ఇందుకు తమ మద్దతు ఉంటుందన్నారు. అలాగే బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖ ఉండాలన్నారు. ఈ సభలో బిసి నేతలు కోలా జనార్ధన్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, పి.సుధాకర్, భరత్ గౌడ్, శ్రావణి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాగేరి వెంకట్రామయ్యకు పదవి విరమణ సన్మానం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి స్టేషన్ మేనేజర్‌గా పని చేసిన రాగేరి వెంకట్రామయ్య పదవి విరమణ సందర్భంగా కినారా గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు పార్టీకి పెద్ద ఎత్తున రిటైర్డ్ స్టేషన్ మాస్టర్లు, ప్రస్తుతం పని చేస్తున్న స్టేషన్ మేనేజర్లు, కుటుంబ సభ్యులు, జెడ్ ఆర్ యు సి సి మెంబర్ నూర్ పాల్గొన్నారు. వెంకట్రామయ్య సేవలను కొనియాడుతూ... పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వెంకట్రామయ్య మాట్లాడుతూ... తనకు అందరు సహకరించి స్నేహ పూర్వాంగా ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు లేకుండా పని చేశానని తెలిపారు. నారాయణ, శ్రీనివాస్‌రావు, షంషుల్ హాక్, శశి రేఖ స్టేషన్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నవరాత్రి మండపాల్లో అన్నదానం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : వినాయక నవరాత్రుల సందర్భంగా ఆదివారం ఐదో రోజు వివిధ వినాయక మండపాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేష్ ముదిరాజ్. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొని రాంనగర్, అడిక్మెట్, గాంధీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లో పర్యటించి అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల నిర్వాహకులు వారికి శాలువ కప్పి సత్కరించారు.

టెలిఫోన్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెలిఫోన్ కాలనీ 60 ఫీట్ రోడ్లో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఉదయం బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో వజ్ర హాస్పిటల్ డాక్టర్ ప్రకాష్ జనరల్ ఫిజిషియన్ ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ సేవలు, శ్రాన్వి డయాగ్నోసిస్ సర్వీసెస్ డయాగ్నోసిస్ సేవలు, మందుల పంపిణీ, డాక్టర్ అనుస్ డెంటల్ అండ్ కాస్మటిక్ ఫ్రీ డెంటల్ చెక్అప్ చేసినారు.

ఈ ఉచిత వైద్య శిబిరంలో టెలిఫోన్ కాలనీ వాసులే కాకుండా చుట్టుపక్కల కాలనీ వాసులకు ఉచితంగా చికిత్స చేసినారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఏ ప్రభాకర్ రెడ్డి, బి మహేందర్, ధర్మేందర్ రెడ్డి, రమేష్ గౌడ్, ఆర్మీ వెంకటేష్, రుద్రారం గిరి, బానుమూర్తి, విట్టల్, రమేష్, జి నరసింహ, పి బాలరాజ్, గాజుల శ్రీనివాస్ గౌడ్, బిక్షపతి, రామ్‌చందర్, రాజశేఖర్, పి శేఖర్, వెల్డింగ్ రాజు, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, టెలిఫోన్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్లిష్టమైన కేసుల్లో హోమియోపతి చికిత్సతో మెరుగైన ఫలితాలు

విశాలాంధ్ర - బషీర్ బాగ్: హెూమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, హైదరాబాద్ ఆధ్వర్యంలో కందుల వెంకట నర్సింగరావు, మాణిక్యం డా.గౌరీబాయి కీర్తనే స్మారక ప్రసంగం ఆదివారం స్థానిక జూపల్లి బాలమ్మ ఆడిటోరియంలో జరిగింది. స్టార్ హెూమియోపతి అధినేత డా.కె శ్రీనివాస్ గుప్త, రత్నమాలలు వారి తలిదండ్రుల పేర స్పాన్సర్ చేసిన ఈ కార్యక్రమానికి గోవా నుండి వచ్చిన ప్రముఖ హెూమియో వైద్య నిపుణుడు, ప్రపంచ ప్రఖ్యాతి వక్త డా.అశోక్ బోర్కర్, హెూమియోపతిలో దీర్ఘ కాలిక వ్యాధులు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, క్లిష్ట మైన వ్యాధులకు చికిత్స, నిర్వహణ గురించి విపులంగా చర్చించారు. హెచ్.ఎం.ఎ.టి. అధ్యక్షుడు డా. కె. గోపాలకృష్ణ స్వాగతోపన్యాసం చేయగా, ప్రధాన కార్యదర్శి డా. జి. దుర్గాప్రసాద్ రావు అసోసియేషన్‌లో అందిస్తున్న వైద్య సేవలు, ఇతర కార్యక్రమాల గురించి ప్రసంగించారు. స్మారక ఉపన్యాసం గురించి డా. వేణుగోపాల్ గౌరీ మాట్లాడగా, డా. గణేష్ ఆచారి డా.అశోక్ బోర్కర్‌ని పరిచయం చేసారు. డా. అశోక్ బోర్కర్ ప్రసంగంలో అడ్వాన్స్ పాథాలజికల్ కండిషన్స్‌లో హెూమియోపతి చికిత్సలి పద్ధతులు, నిర్వహణ పై తనకున్న అపార అనుభవాన్ని తెలియజేశారు. పి.సి.ఒ.డి, థైరాయిడ్ డయాబెటిస్, పైలో నెఫ్రైటిస్, ఎ వాస్క్యూలర్ నెక్రోసిస్ ఆఫ్ ది హిప్, హెపాటిక్ ఎన్సిఫలోపతి, క్యాన్సర్ మున్నగు సంక్లిష్టమైన కేసులల్లో హెూమియోపతి చికిత్సతో మెరుగైన ఫలితాలను సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డా. బోర్కర్ కూతురు డా. సిమ్రాన్ అశోక్ బోర్కర్, స్పాన్సర్, డా. కె.యస్. గుప్త, హెచ్. ఎం. ఎ.టి ఉపాధ్యక్షులు డా. ఆనంద్ రావు మెంగ్జి, ఇతర గవర్నింగ్ సభ్యులు, టెక్నికల్ అడ్వైజర్ డా.సి.వి. స్వామి, సంయుక్త కార్యదర్శులు డా. రఘురాం, డా.అన్నపూర్ణ మంత ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కె. చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి బాలాజీ వెంచర్‌ను ప్రారంభించిన సినీ నటి రాశి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : హైదరాబాద్‌కు అత్యంత దగ్గరలో అభివృద్ధి చెందుతున్న రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో వెంచర్ల నిర్వహణ చాలా బాగుందని సినీనటి రాశి అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని చౌడమ్మ గుట్ట సమీపంలో శ్రీ లక్ష్మీ బాలాజీ వెంచర్‌ను నటి రాశి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న షాద్ నగర్ లాంటి పట్టణాలలో ప్లాట్లను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో మంచి లాభాలు ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక్కడి వారికి అందుబాటులో అన్ని సదుపాయాలతో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఈ వెంచర్ ఏర్పాటు అయిందని ఆమె అన్నారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సినీనటి రాశి వస్తున్నట్లు ప్రచారం జరగడంతో చాలా మంది వెంచర్ వద్దకు చేరుకున్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను ఘనంగా సన్మానించారు. కొనుగోలుదారులకు అందుబాటులో ఉన్న ధరల్లో ప్లాట్లు అందజేస్తున్నామని, నిబంధనలకు అనుగుణంగా ప్లాట్ల రూపకల్పన జరిగిందని ఈ సందర్భంగా వెంచర్ నిర్వాహకులు వెల్లడించారు. 46 ఎకరాల్లో 578 ప్లాట్లు ఈ వెంచర్‌లో అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఒక్కో ప్లాటు 165 గజాలతో ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

శ్రీ లక్ష్మీ బాలాజీ టౌన్ షిప్ నిర్వాహకులు శ్రీ రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వీరారెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ఎల్కుర్తి శ్రీనివాస్, పిసి రావు, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఏఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవనములో రాష్ట్ర అధ్యక్షురాలు పి.ప్రేంపావణి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగినది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అట్టి నిర్ణయాలను తెలుపుతూ ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనాలు పెంచాలని, గత 24 సంవత్సరాలుగా స్వంత డబ్బులు పెట్టుబడి పెట్టి వంటలు చేస్తూ ఆ బిల్లులు, వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న విధ్యార్థులకు నాణ్యమైన బోజనాలు అందిస్తున్న వంట కార్మికులను ఎవ్వరికి కోపం వచ్చినా తొలగించే ప్రయత్నం చేస్తున్నారు కనుక ఎవ్వరినీ తొలగించకుండా కృషి చేయాలని, అలాగే గ్యాస్ సిలిండర్లు, కోడిగుడ్లతో సహ వంటకు ఉపయోగించే నిత్యావసర సరుకుల పూర్తిగా ప్రభుత్వమే సరఫరా చేయాలని లేదా మెనూ చార్జీలు ప్రతీ విద్యార్థికి రూ. 25 లు చెల్లించాలని కోరారు. ఈ సమస్యలు పరిష్కరించాలని సెప్టెంబర్ 1 నుండి నిరవధిక సమ్మె చేయాలనే నిర్ణయాన్ని ముఖ్యమంత్రి గ్రీన్ చానల్ ద్వారా బిల్లులు చెల్లిస్తామని మిగితా సమస్యలు పరిస్కరిస్తానని తెలిపినందున సమ్మె తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగినదన్నారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందితే జరిగే పోరాటానికి కార్మికులు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేష్, ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు కొరిమి సుగుణ, తోపునూరి చక్రపాణి, సహాయ కార్యదర్శులు దర్మల రామ్మూర్తి, మీస లక్ష్మణ్, నిమ్మటూరి రామకృష్ణ, పోలప్పోలు వెంకటేష్, కోశాధికారి ఆది రంగారెడ్డి, కార్యవర్గ సభ్యులు సామల రమ, పోరెడ్డి ప్రమీల, పద్మ, ప్రభావతి, ఓదెల రమేష్, మంగ, చంద్రకల, సభ్యులు గద్దం భారతి, కమలక్క, రాధ, కుడుముల సమ్మక్క లక్ష్మి, జ్యోతి, తిరుపతి, లత, రేఖమ్మ, లక్ష్మి, సాయమ్మ, తులసి, షఫియా పాల్గొన్నారు.

నేడు పెన్షన్ విద్రోహదినాన్ని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సెప్టెంబర్ 1న జరిగే పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న జరిగే పెన్షన్ విద్రోహదినాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, కొంగరకలాన్‌లో ఉదయం 10:45 గంటలకు నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆర్టీసీ కళ్యాణ మండపం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి జిల్లా నుండి పెద్ద ఎత్తున హాజరు కావాలని రంగారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు కోరారు.

వైదిక బ్రాహ్మణ సంఘానికి స్థలాన్ని కేటాయించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి శాసనసభ నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఐ.టీ., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఇండస్ట్రీస్, కామర్స్ శాఖల మంత్రివర్యులు, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబుని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్కాజిగిరి నియోజక వర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, భూకేటాయింపులు, ప్రజావసరాలపై మంత్రివర్యుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మల్కాజిగిరిలోని తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘానికి స్థలాన్ని కేటాయించాలని, నియోజకవర్గంలో బ్రాహ్మణ కుటుంబాలు ఎక్కువగా ఉండడంతో, వారు వివాహాలు, కర్మకాండలు, ఇతర సామాజిక కార్యక్రమాల నిర్వహణ కోసం బ్రాహ్మణ కమ్యూనిటీ భవనం అవసర మని ఎమ్మెల్యే తెలిపారు. పేద బ్రాహ్మణులకు ఇది ఎంతో ఉపయోగ పడుతుందనీ, ఒకే స్థలంలో వీరి అవసరాలను తీర్చే సదుపాయాన్ని కల్పించాలనీ అభిప్రాయపడ్డారు. ఈ అంశాలపై వినతిపత్రాన్నిమంత్రికి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అందజేశారు. మల్కాజిగిరి ప్రజల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. అందుకుగాను మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారు.

ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : వినాయక చవితి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సూచించారు. నలగండ్ల హుడా రెసిడెన్షియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద చరణ్ ఇంటీరియర్స్ వారు నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమానికి హాజరై ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు నాగేందర్ యాదవ్ ను శాలువాతో సత్కరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, చరణ్ ఇంటీరియర్స్ అధినేత నాగేష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

'నా నగరం హైదరాబాద్ 2050లో' పై ఊహాచిత్రాల పోటీలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గ్లోబల్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన కలర్ ఛాంప్ 2025లో నగరంలోని అతి పెద్ద ప్రాంతీయ స్థాయి ఆర్ట్ పోటీలో 570 మంది చిన్నారులు తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ పోటీ శంషాబాద్‌లోని ఎస్ఆర్ క్లాసిక్ కన్వెన్షన్‌లో జరిగింది. నగరంలోని 26 కేంద్రాల నుంచి చిన్నారులు ఒకేచోట చేరారు. ఈ పోటీకి "నా నగరం హైదరాబాద్ 2050లో" అనే థీమ్ ఇచ్చారు. పిల్లలు తమ శిక్షణ స్థాయిని బట్టి 1 గంట 45 నిమిషాల నుంచి 2 గంటల 45 నిమిషాల వరకు తమ ఊహా చిత్రాలను గీయటానికి సమయం ఇచ్చారు. ఈ థీమ్ పిల్లల్లో వినూత్నమైన, వినోదాత్మకమైన, హృదయాన్ని తాకే ఊహలను రేకెత్తించింది. ఎగిరే ఆటోలు, ఇంద్రధనుస్సు రంగుల సరస్సులు, రోబో పోలీసులు, డ్రోన్ బిర్యానీలు, ఇలా నిర్దోషమైన అమాయకత్వం, అతిశయోక్తి, విచిత్రమైన తర్కం అన్నీ కలసి కాగితంపై వెలిశాయి. ముఖ్య అతిథి శైలజా రెడ్డి, మెరిడియన్ స్కూల్, ఉప్పల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "ఈ రోజుల్లో ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల స్క్రీన్ టైమ్ తగ్గించేందుకు పోరాడుతున్నారు. డ్రాయింగ్ దృష్టి కేంద్రీకరణను పెంచుతుంది. ఫిన్లాండ్‌లో స్కూల్ సమయాల్లో స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు వాడకూడదని చట్టం తీసుకొచ్చారు. ఆస్ట్రేలియాలో 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలు నిషేధించారు. భారత్ కూడా ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించాలి" అని అన్నారు.

బాపూజీ నగర్‌లో ఘనంగా గణపతి ఉత్సవాలు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ బాపూజీ నగర్ కాలనీలో ఆదివారం గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్, సీనియర్ నాయకులు కాటపాక కుమార్, కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్, బండారి యాదగిరిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించి భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ కాలనీవాసులందరు భక్తితో పాటు ఐక్యమత్యాన్ని చాటడం అభినందించదగిన విషయమని అన్నారు. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించి మమ్మల్ని ఆహ్వానించడం చాల సంతోషంగా ఉందని ఇలాగే మన సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు అలవాటు చేయాలని సూచించారు. కాలనీ అధ్యక్షుడు బాల్దె వెంకటేష్ మాట్లాడుతూ అయిదు రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు నిర్వహించాము. ప్రతి సంవత్సరం కాలనీవాసులందరం వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తూ పిల్లలు పెద్దలందరం కలిసి వివిద కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రదాన కార్యదర్శి రాజయ్య, కోశాదికారి కన్నె ఉపెందర్, ఉపాధ్యక్షుడు కిష్టయ్య, కాలనీ వాసులు ననుబోతు రాము యాదవ్, జూపల్లి యాదగిరి, సామల రఘు, శ్రీరాముల బాబు, కాటి ఆంజనేయులు, బండారి యాదగిరి, అనిత, జి.రమేష్, విష్ణు, నిమ్మల మల్లేష్, సయ్యద్, శ్యామల్ కుమార్, రాము నాయక్, విష్ణు, యాదమ్మ, చిక్కుడు లక్ష్మీ, కన్నె మానస, నవనీత, వసంత, మౌనిక, లావణ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నిస్సహాయ వీధి శునకాలకు చేయూత

గ్రేటర్‌లోని అన్ని జోన్‌లలో దత్తత మేళాను నిర్వహిస్తాం : జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభాకరుని రాకతో ప్రజ్వలిస్తున్న లేలేత బంగారు కిరణాలు భూమాతను తాకుతున్న శుభోదయానా కాసు బ్రహ్మానంద రెడ్డి పార్క్‌లో ఆదివారం ఎప్పటిలాగే పక్షుల కిలకిల రావాలు, ప్రకృతి పరిమళాలతో పాటు, చిన్నచిన్న పాదాలతో, అమాయక చూపులతో దేశీ కుక్క పిల్లలు ఓ ప్రేమగల ఆత్మీయ ఇంటి కోసం ఎదురు చూస్తున్న సరికొత్త దృశ్యాలు ఆవిష్కృతం అయ్యాయి. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండీ పప్పీ మేళా మానవతా భావనకు అద్దం పట్టిన వేడుకలో కనిపించగా ప్రజలను ఆలోచింపజేశాయి.

బి ఎ హీరో, అడాప్ట్, డోంట్ షాప్...

అనే హృదయాన్ని హత్తుకునే నినాదంతో, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ , ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఈ ఇండీ పప్పీ దత్తత మేళాను ప్రారంభించారు. ఈ దత్తత మేళాలో వాక్సినేషన్ పూర్తి చేసుకుని పూర్తి ఆరోగ్యంగా ప్రేమతో నిండినవి 35 మంది దేశీ కుక్క పిల్లలను ప్రజల ముందు ప్రదర్శనకు జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం ఉంచింది. అందులో 22 పప్పీలు ప్రేమతో కూడిన కుటుంబాల్లోకి అడుగుపెట్టాయి. ప్రతి దత్తత ఒక మౌన విప్లవం, ఒక ప్రేమపూరిత వాగ్దానం సూచికగా నిలిచింది. "దత్తత అంటే కేవలం స్వీకరణ కాదు, ఆత్మీయత, బాధ్యత, ప్రేమతో కూడిన బంధం," అని కమిషనర్ ఆర్ వి కర్ణన్ పేర్కొన్నారు. షేక్ పేట నివాసి చింతకుంట రాజుకు మొదటి పప్పీని స్వయంగా కమిషనర్ అందజేసి అభినందించారు. దేశీ కుక్కల ప్రత్యేకతలను, విశేషాలను కమిషనర్ ఆర్ వి కర్ణన్ వివరించారు. వీటి సహజ శక్తి, తెలివితేటలు, తక్కువ నిర్వహణ అవసరం, స్థానిక వాతావరణానికి సులభంగా అలవాటు పడతాయని చెప్పారు. వీధి కుక్కల సంఖ్యను తగ్గించడమే కాకుండా, వాటికి సురక్షితమైన జీవితాన్ని కూడా కల్పించడమే లక్ష్యంగా ఈ మేళాలను జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఆర్‌వి కర్ణన్ తెలిపారు. ఈ మేళా ద్వారా, నగర ప్రజలు మానవత్వం చాటి, వీధి కుక్కలపై తమ ప్రేమను, బాధ్యతను ప్రదర్శించారనీ కొనియాడారు. ఈ కార్యక్రమం ద్వారా వీధి కుక్కల పట్ల అవగాహన పెరిగి, వాటిని దత్తత తీసుకోవడానికి ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. దత్తతకు ఎక్కువ మంది ముందుకు వస్తే వీధుల్లో కుక్కల సంచారం, బెడద ఉండదు. కుక్క కాటు ఘటనలు ఉండవన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని నిర్వహిస్తున్న దత్తత మేళాలను అన్ని జోనల్ సర్కిళ్లలో విడతల వారిగా నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రకటించారు. జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా చొరవ తీసుకుని కుక్క పిల్లలదత్తత మేళా ఏర్పాటు పట్ల మేళాలో జీహెచ్ఎంసీనీ జంతు ప్రేమికుల ప్రశంసించారు. కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ మేళాలు మిగతా పురపాలికలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డా. అబ్దుల్ వకీల్, డిప్యూటీ డైరెక్టర్ డా.చక్రపాణి రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డా. వివేకానంద్, పిఆర్ఓ మామిండ్ల దశరథం, వెటర్నరీ అధికారులు, ఎనిమల్, డాగ్ లవర్స్, ఎన్‌జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక తల్లిపై నీచమైన వ్యాఖ్యలు చేయడం వారి విష సంస్కృతికి నిదర్శనం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ బొల్లారం చౌరస్తా వద్ద శేరిలింగంపల్లి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ తల్లి మీద చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం కార్యక్రమం చేపట్టగా శాంతియుతంగా కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, నాగుల గౌడ్, జిల్లా నాయకులకు కృష్ణంరాజు, దుర్గాప్రసాద్, మాణిక్ రావు, డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, జితేందర్, మహేష్ యాదవ్, నర్సింగ్ యాదవ్, నరసింహచారి, సీతారామరాజు, గణేష్, పట్టాభిరామ్, జితేందర్ని, నియోజకవర్గ బీజేపీ శ్రేణులను అధికారం ఉందనే అహంకారంతో పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమంగా అడ్డుకుని అరెస్ట్ చేసి నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం కాంగ్రెస్ పార్టీ నిరంకుశ పాలనకు నిదర్శనం. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ భారతదేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తల్లి గురించి కాంగ్రెస్-ఆర్జేడీ పార్టీల మద్దతు చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలు ప్రతి భారతీయుడి హృదయాన్ని కలిచివేసాయని, తల్లి పట్ల ఇంత హీనమైన వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల అసలైన వారి విష సంస్కృతికి నిదర్శనం అని అన్నారు. ఇది మొదటిసారి కాదు.

వ్యక్తిగత దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీకి పరిపాటీగా మారింది. అందువల్లే వారికీ దేశ ప్రజలు ప్రతి ఎన్నికలలో తగిన బుద్ధి చెప్తున్నారు, ఈసారి కూడా బీహార్‌లో, దేశ వ్యాప్తంగా నారీ శక్తి ముందుకు వచ్చి కాంగ్రెస్-ఐఎన్‌డీఐ కూటమికి ఘాటైన సమాధానం ఇస్తుందన్నారు, మన తల్లుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. తల్లిని దూషించే ఇలాంటి నీచపు నాయకత్వాన్ని భారత ప్రజలు ఎప్పటికీ అంగీకరించరన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులతో మమల్ని భయపెట్టలేరని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని, సరైన సమాధానం చెప్పే తీరుతామని ధీటుగా బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో శాంతి భూషణ్ రెడ్డి, ప్రసాద్, రాజు శెట్టి, రామ్ రెడ్డి, శ్రీనివాస్, శివరాం, విష్ణువర్ధన్ రెడ్డి, సందీప్ గౌడ్, ఆంజనేయులు యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రాము, చాంద్, సురేష్, మాన్యం, అభిషేక్, ప్రభాకర్, శివ భాష,జ్యోతి పాల్గొన్నారు.

మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

విశాలాంధ్ర-దుండిగల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణరెడ్డి, నాయకులు హెచ్చరించారు. దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి ఆధ్వర్యం నందు ఆదివారం గండిమైసమ్మ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిజెపి శ్రేణులు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పిసరి కృష్ణారెడ్డి, నాయకులు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ అహర్నిశలు శ్రమించి అసమానతలు బాపుతూ విదేశీ దండయాత్రలు ఎదుర్కొంటూ దేశాన్ని ఉన్నత స్థానానికి తీసురావడానికి ప్రయత్నిస్తుంటే మరో వైపు దేశానికి స్వతంత్రం తెచ్చాం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీకి చెందిన రాహుల్ గాంధీ అనే వ్యక్తి ఉన్నతమైన ఒక గొప్ప దేశానికి ప్రతిపక్ష నాయకుడు విదేశాలకు టైమ్ పాస్‌కు వెళ్లి అక్కడ సొంత దేశం గురించి హేళన చేస్తూ అవమానపరిచాడని తెలిపారు. భారతదేశంలో ఉంటూ శక్తితో పోరాడుతూనని, సంస్కృతిని, సంప్రదాయాలను, మహిళలను ప్రధాని మాతృమూర్తిని అవమానిస్తున్నాడని వ్యక్తం చేశారు. ఇలాంటి మాటలు మనకపోతే చెప్పులతో సత్కారం, తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే అరాచకం, అవినీతి, తీవ్రవాదులకు స్తావరం కాంగ్రెస్ హటావో దేశ్ బచావో అని నినదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిల్లా ప్రధానకార్యదర్శి విగ్నేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షురాలు మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు తురాయి భాను గౌడ్, దమ్మగారి సీతారాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఉపాధ్యక్షులు ఎంబరి ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలు రోజా, కోశాధికారి కొమ్ము ప్రశాంత్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నర్సింహా చారీ, యశ్వంత్ రెడ్డి, నామాల శ్రీకాంత్ నేత, ఆకుల విజయ్, దశరథ్ యాదవ్, ఆకుల యశ్వంత్, క్యాసారం శ్రీనివాస్ యాదవ్, పోలింగ్ బూత్ అధ్యక్షులు మాధవరెడ్డి, అందె అశోక్, క్యాసారం గణేష్, గాగిల్లాపూర్ చిన్న, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

అవినీతికి అలవాటు పడ్డ అధికారులు

విశాలాంధ్ర-దుండిగల్: మండలంలో ప్రభుత్వ భూములకు రక్షణ కొరవడుతోంది. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులు కూల్చిన అక్రమ నిర్మాణం చోటే భూ కబ్జాదారులు మళ్లీ నిర్మాణాలను చేపట్టడం గమనార్హం. గండిమైసమ్మ -మేడ్చల్ ప్రధాన రహదారికి అత్యంత సమీపంలో 120 సర్వే నంబరు భూమి ఉన్నది. ఈ ప్రాంతంలో గజం స్థలం రూ.20 వేలకు పైగా డిమాండ్ ఉండడంతో కొంతమంది కబ్జాదారులు ప్రభుత్వ స్థలంపై కన్నేసి అక్రమంగా ఇళ్లను నిర్మించి, పాత తేదీలతో తప్పుడు ఇంటి నంబర్లను సృష్టించి ఒక్కో ఇంటిని రూ.20 నుంచి రూ.25 లక్షల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న డి.పోచంపల్లి సమీపంలో ఉన్న 120 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యక్తులు రాజకీయ నాయకుల అండతో అక్రమంగా 80 గజాల స్థలంలో ఓ ఇంటిని నిర్మించారు. ఈ భూమిలో గతంలో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్‌లను రెవిన్యూ అధికారులు జెసిబి సహాయంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసినప్పటికీ మళ్లీ అదే చోట రేకుల ఇంటి నిర్మాణాన్ని చెక చెక పూర్తి చేశాడు. ఇందులో భాగంగానే డాక్టర్ బస్తి ఏరియాలో మరో 80 గజాల స్థలని అక్రమించి శనివారం ఇంటి నిర్మాణాన్ని మొదలుపెట్టారు. అధికారులకు తెలిసిన తమకేమీ పట్టనట్లు ఉండడం వెనుక అధికారులకు కూడా పెద్ద మొత్తంలో ముడుపులు అందినట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా 120 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్ఐ రవి కుమార్ వివరణ...

ప్రభుత్వ కార్యాలయానికి దగ్గరగా ఉన్న డి.పోచంపల్లి సర్వేనెంబర్ 120 ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణలపై మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్‌ని ఫోన్ ద్వారా వివరణ కోరగా అక్రమ నిర్మాణలను చేపడుతున్న విషయం ఆలస్యంగా తెలిసిందని, అదే రోజు కూల్చివేతలు జరపడానికి జెసిబి, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేరని కావున సోమవారం తప్పనిసరిగా 120 డి.పోచంపల్లిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలని కూల్చివేస్తామని తెలిపారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విశ్వేశ్వరరావుకు చోటు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయిలాపురం గ్రామానికి చెందిన పాటల రచయిత, స్వరకర్త, గాయకుడు రాయరావు విశ్వేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. 2019 నుండి 2025 వరకు ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహం గురించి పాటలు రాయడం, కంపోజ్ చేయడం ద్వారా అద్భుతమైన ఘనతను విశ్వేశ్వరరావు సాధించారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లండన్ సంస్థ వారు అతని ప్రతిభను గుర్తించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. స్నేహితుల రోజున ప్రతిఏటా స్వీయ రచనతో పాటు స్వరకల్పన చేసి ప్రతి పాటను తగిన వీడియో చేసి రాయరావు విషు యూ ట్యూబ్ ఛానెల్‌లో రిలీజ్ చేసిన ఏకైక వ్యక్తిగా ఈ రికార్డ్‌ను వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, హాస్యబ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ, ఆర్. వేణుగోపాలరావులు అందజేశారు. అయితే విశ్వేశ్వరరావుకు వండర్ బుక్ రికార్డులో చోటు దక్కడం పట్ల సీనియర్ జర్నలిస్టు దోర్బల బాలశేఖర శర్మ,టీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్‌చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి శ్రీనివాస శర్మలు హర్షం వ్యక్తం చేశారు.

వినాయక మండపాలను దర్శించిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల, నల్లగండ్ల హుడా కాలనీ, అపర్ణ సైబర్ జోన్, అపర్ణ సైబర్ కమ్యూనిటీ, గోపన్ పల్లి సోఫా కాలనీ, గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ కాలనీలలో వినాయక చవితి పర్వదినంను పురస్కరించుకుని వినాయక మండపం వద్ద నిర్వహించిన పూజ కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగించి విజయాలను దరిచేర్చే వాడు వినాయకుడు. అని అందుకే ఆయన్ను విఘ్నేశ్వరుడు అంటారు అని ఎంతోమంది దేవుళ్లు ఉన్నప్పటికీ మొదట పూజలు అందుకునేది ఆయనే కాబట్టి ఆదిదేవుడుగా కొలుస్తారు అని ఏనుగు తల, మనిషి శరీరం కలిగి ఉండి ఒకే దంతం కలిగి ఉండటంచేత ఏకదంతుడుగా కీర్తించబడుతున్నాడు అని దేవగణాలకు అధిపతి కాబట్టి గణపతిగా పూజలు అందుకుంటున్నాడు అని సకల లోకాల సర్వ జనులకు శుభాలు కలిగించే ఆ బొజ్జ గణపయ్య పండుగ వినాయక చవితిని అందరూ ఘనంగా జరుపుకుంటారని తెలియజేసారు. పండుగ ను చక్కటి వాతావరణం లోకుటంబ సభ్యుల మధ్య ఆనందాయకంగా, సంతోషకరంగా జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగినది. అదేవిదంగా వినాయక చవితి పండుగ ను ఘనంగా నిర్వహించుకోవడానికి అన్ని రకాల వసతులు కలిపించాలని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ అధికారులను ఆదేశించడం జరిగినది. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చక్కటి వాతావరణంలో జరుపుకునేందుకు వీలుగా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగినది అని గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో జగదీష్ గౌడ్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ సందర్శించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వినాయక వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. నిమజ్జన సమయంలో ప్రజలు సంయమనంతో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో మనోహరంగా పద్మశ్రీ సంకీర్తనాలాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. శోభారాజు ఆధ్వర్యంలో అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థిని కుమారి పద్మశ్రీ, ఆదిపురుషా, భజరే రామనామం, చిత్తము, నామనసే తిరుపతి, కంటి అఖిలాండ, ఇంత చక్కని, నారాయణతే నమో నమో వంటి బహుళ ప్రాచుర్యం పొందిన కీర్తనలకు సుమనోహరంగా ఆలపించారు. కీబోర్డ్‌తో శ్రీనివాస్, తబలాతో నటరాజ్ సహకారం అందించారు. తదనంతరం కళాకారులను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డా.నందకుమార్ జ్ఞాపికను అందించారు. చివరిగా స్వరసిద్ధి వేంకటేశ్వరస్వామి వారికి మంగళ హారతులు అందించి విచ్చేసిన భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు.

గణేష్ నవరాత్రి వేడుకల్లో మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాజీ మేయర్ అమర్‌సింగ్ వివిధ గణేష్ మండపాలను ఆదివారం సందర్శించి, అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని, వినాయక విగ్రహ శోభాయాత్రల్లో భాగస్వామ్యం అయ్యి, భక్తులతో కలిసి శ్రీ గణపతి బప్పా ఆశీర్వాదాలు పొందారు. ఈ ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్లు నవీన్ రెడ్డి, సుబాష్ నాయక్, అనంత్ రెడ్డి, సహభాగ్య సభ్యుడు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బైటింటి ఈశ్వర్ రెడ్డి, పీఎంసీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, మెడిపల్లి హనుమాన్ దేవాలయం చైర్మన్ రామ్ రెడ్డి, డైరెక్టర్ ప్రశాంత్ నాయకులు గణేష్, ఉదయ్, కాలనీ వెల్ఫేర్ సంఘాలు, కమిటీలు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటాలు చేసేది కమ్యూనిస్టులే

విశాలాంధ్ర - కారేపల్లి : ప్రపంచ వ్యాప్తంగా పీడితుల పక్షం వహిస్తూ వారి పక్షాన నిఖార్సుగా నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని భాగ్యనగర్‌తండాలో ఇటీవల మృతి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు గుగులోత్ మంగు సంస్మరణ సభ సీపీఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది.ఈ సభలో అయన మాట్లాడుతూ ప్రజా సమస్యలే ఏజెండాగా కమ్యూనిస్టులు నిరంతరం పోరాటాలు చేసిన ఫలితంగానే పాలకులు పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పాలకులు ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు ప్రభుత్వాలపై పోరాటాలతో ఒత్తిడి తెస్తామన్నారు. గుగులోత్ మంగు నిబద్ధత గల కార్యకర్త అని కొనియాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ లో కీలక భూమిక పోషించారన్నారు. మంగు లేని లోటు కుటుంబానికే కాక ఈప్రాంత సిపిఐ పార్టీకి తీరని లోటన్నారు. ఈ సంస్కరణ సభలో సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ఎర్రబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, రావి శివరామకృష్ణ, శంకర్, బంధం నాగయ్య, ఉంగరాల సుధాకర్, గుగులోతు రామ్ చందర్, బస శ్రీనివాసరావు, నాయకులు పాటి అనంతరాములు, రాయల రామారావు, పోతనబోయిన రవి, సహదేవ్, అమల, బాపుసింగ్ కౌలియా, హరి సింగ్, రవి, మంగు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అత్యధిక వర్షాలు... ఆకస్మిక వరదలు

- సెప్టెంబరులోనూ ముప్పు తప్పదేమో!
- 109శాతం పెరగనున్న వర్షపాతం
- వాతావరణశాఖ అంచనా

న్యూదిల్లీ: దేశంలో సెప్టెంబరు మాసంలోనూ సాధారణం కంటే ఎక్కువ వర్షాలే కురిసే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. సెప్టెంబరులో ఈసారి సాధారణం కంటే 109 శాతం ఎక్కువ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని ఐఎండీ పేర్కొంది. అయితే ఈశాన్య భారతం, తూర్పు భారత్, దక్షిణ భారతం, వాయవ్య భారత్‌లోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షాలే పడొచ్చని తెలిపింది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో సాధారణ స్థాయిలో, సాధారణాన్ని మించిన స్థాయిలో వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని చెప్పింది. ఆదివారం దిల్లీలో విలేకరుల సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర ఈ వివరాలు వెల్లడించారు. సెప్టెంబరులో ఉత్తరాఖండ్, దక్షిణ హర్యానా, న్యూదిల్లీ, ఉత్తర రాజస్థాన్‌లోని అనేకప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చన్నారు. దీనివల్ల ఆకస్మిక వరదలు సంభవించి, కొండచరియలు విరిగిపడి జనజీవనం స్తంభించే ముప్పు ఉంటుందని ఆయన తెలిపారు. చాలావరకు నదుల జన్మస్థానం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోనే ఉందని, భారీ వర్షాల వల్ల ఈ నదులు ఉప్పొంగి సమీపంలోని నగరాలు, పట్టణాల్లో వరదను సృష్టించే ముప్పు ఉందన్నారు. చత్తీస్‌గఢ్‌లోని మహానది ఎగువ పరివాహక ప్రాంతానికి భారీ వర్ష సూచన ఉందని మృత్యుంజయ్ చెప్పారు.

ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం

ఇక భారత్‌లో 1980 సంవత్సరం నుంచి ఏటా సెప్టెంబరులో కురిసే వర్షపాతం క్రమంగా పెరుగుతోందని మృత్యుంజయ్ తెలిపారు. అయితే 1986, 1991, 2001, 2004, 2010, 2015, 2019 సంవత్సరాల సెప్టెంబరు నెలల్లో తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. సెప్టెంబరులో పశ్చిమ మధ్య భారత్, వాయవ్య భారత్, దక్షిణ భారత్‌లలోని చాలా ప్రాంతాల్లో నెలవారీ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలో, సాధారణం కంటే తక్కువ స్థాయిలో ఉండొచ్చని ఆయన తెలిపారు. తూర్పు మధ్య భారత్, తూర్పు భారత్, ఈశాన్య భారత్, వాయవ్య భారత్‌లోని పలు ప్రాంతాలు, పశ్చిమ తీర ప్రాంతాలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువ స్థాయుల్లో ఉండొచ్చన్నారు.

ఆగస్టులో 268.1 మి.మీ వర్షపాతం

ఆగస్టు నెలలో భారతదేశంలో మొత్తం 268.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ తెలిపింది. ఇది సాధారణం కంటే 5 శాతం ఎక్కువ. గత 3 నెలల్లో (జూన్ - ఆగస్టు) మన దేశంలో అత్యధికంగా 743.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వ్యవధిలో సాధారణం కంటే 6 శాతం ఎక్కువ వర్షాలు పడ్డాయి.

దక్షిణ భారతదేశంలో ఆగస్టు నెలలో ఇప్పటివరకు 250.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందని ఐఎండీ వెల్లడించింది. సాధారణం కంటే ఇది దాదాపు 31 శాతం ఎక్కువ. 2001 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఏటా ఆగస్టు నెలల్లో దక్షిణాదిలో కురిసిన 3వ అత్యధిక వర్షపాతం ఇదే. 1901 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఆగస్టు నెలల్లో దక్షిణాదిలో కురిసిన 8వ అత్యధిక వర్షపాతం ఇదే. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 31 మధ్యకాలంలో (గత 3 నెలల్లో) మొత్తం 607.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏటా ఇదే మూడు నెలల వ్యవధిలో నమోదయ్యే సాధారణ వర్షపాతం (556.2 మిల్లీమీటర్లు) కంటే ఇది దాదాపు 9.3 శాతం ఎక్కువ.

కేసీఆర్ బాధ్యతారాహిత్యం

ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలి: నారాయణ



విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు (కేసీఆర్) తక్షణమే ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రానప్పుడు ఎమ్మెల్యే హోదా ఎందుకంటూ ప్రశ్నించారు. కీలకాంశాలపై చర్చలతో అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే కేసీఆర్ గైర్హాజరవుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు, కాళేశ్వరం ప్రాజెక్టుపై నివేదిక సమర్పించారు కానీ కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా కీలక చర్చల్లో పాల్గొనకుండా ఫామ్‌హౌస్‌లో నాటకాలు ఆడుతున్నారు' అని నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ వైఖరి ఆయన బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నారాయణ అభినందించారు. అసెంబ్లీలో ఈ బిల్లును ఆమోదించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపాలని కోరారు. రిజర్వేషన్ బిల్లు వ్యవహారంలో రేవంత్ రెడ్డికి సీపీఐ తరపున సంపూర్ణ మద్దతు ఉంటుందని నారాయణ వెల్లడించారు.

మంత్రి లోకేశ్‌కు అరుదైన గౌరవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ మంత్రి నారా లోకేశ్‌కు అరుదైన గౌరవం దక్కింది. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ (ఎస్‌వీపీ)లో భాగస్వామ్యం కావాలని కోరుతూ ఆస్ట్రేలియన్ హైకమిషన్ ఆయనకు ఆహ్వాన లేఖ పంపింది. ఏపీలో మానవవనరులు, సాంకేతిక, ఆర్థికాభి వృద్ధిని ప్రశంసించింది. ప్రధాని మోదీ కూడా 2001లో ఎస్‌వీపీలో భాగస్వామ్యం అయ్యారని వెల్లడించింది.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు... ఏడుగురి దుర్మరణం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆదివారం బాణసంచా ఫ్యాక్టరీలో సంభవించిన భారీ పేలుడులో ఏడుగురు దుర్మరణం చెందారు. గుడంబా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెహ్తా ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని ఫ్యాక్టరీలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ కార్మికులను పోలీసులు అంబులెన్సుల్లో ఆసుపత్రికి తరలించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ఈ పేలుడులో దాదాపు ఏడుగురు మరణించినట్లు తెలిసింది. ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లుగా సమాచారం. సహాయక చర్యలు కొనసాగు తున్నాయి. బాణసంచా ఫ్యాక్టరీ పేలుడు ప్రమాదంపై సీఎం ఆదిత్యనాథ్ ఆరా తీశారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన సరైన చికిత్స అందించాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు.

బ్యాంకులకు రూ.1,396 కోట్ల మోసం

ఒడిశా వ్యాపారవేత్త నిర్వాకం

ఈడీ సోదాల్లో లగ్జరీ కార్లు, విలువైన ఆభరణాలు లభ్యం

భువనేశ్వర్: దేశంలోనే అతిపెద్ద బ్యాంకు మోసాలలో ఒకటిగా ఉన్న రూ.1,396 కోట్ల వ్యవహారంలో ఒడిశా వ్యాపారవేత్త శక్తిరంజన్ దాస్‌పై కేసు నమోదైంది. ఇదే క్రమంలో భువనేశ్వర్‌లోని ఆయన నివాసం, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు జరిగాయి. రూ.7 కోట్లపైగా విలువ ఉండే 10 లగ్జరీ కార్లు, మూడు సూపర్ బైక్‌లు, ఆభరణాలు, నగదు లభ్యమయ్యాయి. పోర్షే కయేన్, మెర్సిడెస్ బెంజ్ జీఎల్‌సీ, బీఎమ్‌డబ్ల్యూ×7, ఆడి ఏ3, మినీ కూపర్, హోండా గోల్డ్ వింగ్ బైక్ వంటి హైఎండ్ వాహనాలతోపాటు రూ.1.12 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.13 లక్షల నగదు, స్థిరాస్తుల పత్రాలు స్వాధీనం చేసుకొని, రెండు లాకర్లు సీజ్ చేసినట్లు సమాచారం. శక్తిరంజన్ దాస్ నివాసంతో పాటు ఆయనకు చెందిన అన్మోల్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్), అన్మోల్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్‌పీఎల్) కంపెనీల కార్యాలయాల్లో ఈడీ దాడులు జరిగాయి. ఇది ఇండియన్ టెక్నోమాక్ కంపెనీ లిమిటెడ్ (ఐటీసీఎల్) అనే సంస్థ ద్వారా జరిగిన భారీ మోసం. 2009-2013లో ఈ కంపెనీ తప్పుడు పత్రాలు, వృద్ధి ప్రణాళికలు చూపి బ్యాంకుల నుంచి రుణాలు పొందింది. ఆ మొత్తాన్ని డొల్ల కంపెనీలకు మళ్లించింది. ఈ వ్యవహారంలో ఐటీసీఎల్ ప్రోత్సాహకుడైన రాకేశ్ కుమార్ శర్మ, అన్మోల్ మైన్స్ కంపెనీకి డబ్బులు తరలించినట్టు ఆధారాలు లభించాయి. దాదాపు రూ.59.80 కోట్లు అన్మోల్ మైన్స్ ఖాతాకు చేరాయి. ఈ డబ్బును మైనింగ్ బిజినెస్‌లో ఉపయోగించి, వ్యాపార లావాదేవీలుగా శక్తిరంజన్ దాస్ చూపించారని ఈడీ పేర్కొంది. ఇప్పటికే ఈడీ రూ.310 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది. ఏప్రిల్‌లో రూ.289 కోట్ల విలువైన ఆస్తులను బ్యాంకులకు అప్పగించారు. ఈడీ తాజా దాడులతో మరిన్ని సోదాలు, అరెస్టులకు అవకాశం ఉంది.

హోంగార్డుల సమస్య పరిష్కరించండి

రేవంత్‌కు కూనంనేని, రామకృష్ణ వినతి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హోంగార్డుల సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని సీపీఐ తెలంగాణ-ఏపీ కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, కె.రామకృష్ణ కోరారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీకి చెందిన హోంగార్డులను ఆంధ్రప్రదేశ్‌కు పంపిచాలన్నారు. అలాగే ఏపీలో ఉన్న తెలంగాణకు చెందిన హోంగార్డులను ఆ రాష్ట్రానికి పంపాలని కూనంనేని, రామకృష్ణ కోరారు. దీంతో సీఎం రేవంత్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సాధ్యమైనంత త్వరగా సంబంధిత నివేదిక తెప్పించుకొని హోంగార్డులకు న్యాయం జరిగేలా చూస్తానని కూనంనేని, రామకృష్ణకు రేవంత్ రెడ్డి హామీనిచ్చారు.

ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి కనకరత్నమ్మ మృతిపట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాదాల రవి సంతాపం తెలిపారు. ఆదివారం అల్లు అరవింద్‌ను ఆయన నివాసంలో కలిసి సానుభూతి ప్రకటించారు.

త్వరలో మణిపూర్‌కు మోదీ

2023 అల్లర్ల తర్వాత ఈశాన్య రాష్ట్రానికి వెళ్లనున్న ప్రధాని



న్యూదిల్లీ: ఈశాన్య రాష్ట్రం ఘర్షణలతో 28 నెలల పాటు రగిలిపోయినా కన్నెత్తి చూడని ప్రధాని మోదీ ఎట్టకేలకు మణిపూర్‌లో అడుగుపెట్టబోతున్నారు. సెప్టెంబరు నెలలో ఆయన ఆ రాష్ట్రాన్ని సందర్శిస్తారు. సెప్టెంబరు 12-14 తేదీల్లో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రారంభించేందుకుగాను మిజోరం, అసోం రాష్ట్రాల పర్యటన క్రమంలో మోదీ మణిపూర్ వెళ్లనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మోదీ పర్యటన దృష్ట్యా రాష్ట్ర యంత్రాంగం ఏర్పాట్లు మొదలు పెట్టింది. భద్రతను కట్టుదిట్టం చేస్తోంది. ఈ మేరకు అధికారులు ఆదివారం వెల్లడించారు. రాజధాని ఇంఫాల్, చురచాంద్పూర్‌లో మోదీ పర్యటిస్తారు. హింస బాధితుల్ని కలుస్తారు. అయితే హింసతో అట్టుడికిన మణిపూర్‌ను ప్రధాని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. రెక్కలు కట్టుకొని విదేశాల్లో వాలిపోయే ప్రధానికి స్వదేశంలోని మణిపూర్‌కు వెళ్లే తీరిక లేదంటూ కాంగ్రెస్ సహా అనేక పార్టీలు చాలాసార్లు ఎద్దేవా చేశాయి. 2023, మే 3వ తేదీ నుంచి మణిపూర్ రాష్ట్రం హింసతో అట్టుడికిపోగా వందల మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది సర్వం కోల్పోయి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. మణిపూర్ ఫిబ్రవరి నుంచి రాష్ట్రపతి పాలనలో ఉంది. అయితే ఇటీవల కాలంలో హింస జరగలేదని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర హోంమంత్రి నిత్యానంద్ రాయ్ జులై 30న లోక్‌సభలో మాట్లాడుతూ 'నాలుగు నెలలుగా మణిపూర్‌లో ఎటువంటి హింస జరగలేదు. ఒక్కరూ చనిపోలేదు. గత ఎనిమిది నెలల్లో ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు' అని అన్నారు. మోదీ ప్రస్తుతం చైనాలో ఉన్నారు. ఆయన తాజా పర్యటనను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. హింస పీడిత మణిపూర్ ప్రజలు మోదీ రాక కోసం ఎదురుచూస్తుంటే ఆయన విదేశాల్లో విహరిస్తున్నారని దుయ్యబట్టారు. రాజకీయ పార్టీలు, నాయకులు, పౌర సంఘాలు, స్వయంగా ప్రజలు కూడా మణిపూర్‌ను ఓదార్చాలని కోరినప్పటికీ ప్రధాని మంకుపట్టుదల ప్రదర్శించారని విమర్శించారు. మణిపూర్‌ను మోదీ పట్టించుకోకపోవడం కేంద్ర హోంమంత్రి వైఫల్యానికి నిదర్శనమని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

బీహార్‌లో మళ్లీ ఎస్ఐఆర్

ఈసీకి 89 లక్షల ఫిర్యాదులిచ్చాం: కాంగ్రెస్

పట్నా: బీహార్‌లో ఎస్ఐఆర్‌ను కొత్తగా నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఏ రాజకీయ పార్టీ నుంచి ఫిర్యాదులు రాలేదని ఈసీ తప్పుడు కథనాలు అల్లుతోందని ఆరోపించింది. ఎస్ఐఆర్‌లో అవకతవకలకు సంబంధించి 89 లక్షల ఫిర్యాదులను ఈసీకి సమర్పించినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఆదివారం వెల్లడించారు. ఆయన పట్నాలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీలు కాకుండా వ్యక్తిగతంగానే ఫిర్యాదులు చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఈసీ చెబుతోందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై 'ఇండియా' పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. జాబితాలో పేర్లు లేకుండా చేయడం, సరైన నోటీసులు ఇవ్వకపోవడం ద్వారా లక్షలాది మంది ఓటు లేకుండా చేశారని ఆరోపించాయి. లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అధ్వర్యంలో ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బీహార్‌లో పెద్దఎత్తున 'ఓటర్ అధికార్ యాత్ర' సాగుతోంది. 'ఇండియా' దన్నుగా సాగుతున్న ఈ యాత్రకు అమితాదరణ లభించింది. సెప్టెంబర్ 1న పట్నాలో యాత్ర ముగియనుంది. ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను మినహాయించాలంటూ 1.98 లక్షల మంది ఫిర్యాదులు అందజేసినట్టు ఈసీ ఇప్పటికే తెలిపింది. జాబితాలో పేర్లు చేర్చాలని 30,000 విజ్ఞప్తులు వచ్చాయని ప్రకటించింది. ముసాయిదా జాబితాను ఆగస్టు 1న ఈసీ విడుదల చేయగా, వ్యక్తులు, రాజకీయ పార్టీలు తమ వాదనలు, అభ్యంతరాలను తెలియజేసేందుకు సెప్టెంబర్ 1వ తేదీ వరకూ గడువు విధించడం విదితమే.

బీహార్‌లో కొత్త ఓటర్ కార్డులు

పట్నా: బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తి కాగానే రాష్ట్రంలోని ఓటర్లందరికీ కొత్త ఓటరు గుర్తింపు కార్డులు ఇచ్చే ఆలోచనలో ఎన్నికల సంఘం ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. అయితే ఎప్పటి నుంచి కొత్త కార్డులు జారీ చేస్తారనే దానిపై ఇంకా ర్ణయం తీసుకోలేదని తెలిసింది. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఇచ్చేటప్పుడే దరఖాస్తు ఫారంపై కొత్తగా తీయించుకున్న ఫోటోను జత చేయాలని అధికారులు కోరారు. రికార్డులు అప్‌డేట్ చేసేటప్పుడు కొత్త ఫోటోలను జత చేసి కొత్త ఓటరు కార్డులు జారీ చేస్తారని ఈసీ వర్గాలు చెబుతున్నాయి. బీహార్ ముసాయిదా ఓటర్ల జాబితాను ఆగస్టు 1న ప్రచురించిన సంగతి తెలిసిందే. ఆ ప్రకారం రాష్ట్రంలో 7.24 కోట్ల ఓటర్లు ఉన్నారు. తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించనున్నారు. నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. బీహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబర్ 22వ తేదీతో ముగియనుండగా... ఆలోపు ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాడాల్సి ఉంటుంది. ఈసీ వర్గాల సమాచారం ప్రకారం... ఇంతవరకూ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసిన 99 శాతం మంది తమ డాక్యుమెంట్లు సమర్పించారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు గల్లంతైనందున జాబితాలో తమ పేర్లు చేర్చాలంటూ 30వేల మంది నుంచి విజ్ఞాపనలు వచ్చాయి.

42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం

- న్యాయపర చిక్కులు రాకుండా 'డెడికేషన్ కమిషన్'
- రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో రెండు బిల్లులు
- శాసనసభలో సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో గతంలో న్యాయపరంగా ఎదుర్కొన్న సమస్యలను పరిశీలించిన తరువాతనే 'డెడికేషన్ కమిషన్'ను నియమించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో వచ్చిన అడ్డంకులు తెలంగాణలో రాకూడదనే అధికారుల కమిటీని, మంత్రులను ఆయా రాష్ట్రాలకు పంపి సమాచారాన్ని సేకరించామని పేర్కొన్నారు. రెండో రోజైన ఆదివారం కొనసాగిన శాసనసభలో సీఎం మాట్లాడుతూ మొదట బీసీల వివరాలు సేకరించే బాధ్యతను రాష్ట్ర బీసీ కమిషన్‌కు అప్పగించామని చెప్పారు. బీసీ కమిషన్ ద్వారా కాకుండా డెడికేషన్ కమిషన్ ద్వారా సమాచార సేకరణ జరగాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. క్రిష్ణయ్య హైకోర్టులో రిట్ పిటిషన్ (రిట్ పిటిషన్ నెంబర్ 30381/2024) వేశారని గుర్తు చేశారు. పిటిషన్ విచారించి డెడికేషన్ కమిషన్ ను నియమించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ ఆదేశాల మేరకు చిత్తశు ద్ధితో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు డెడికేషన్ కమిషన్ ద్వారా కుల సర్వే నిర్వహించామని, బీహార్, రాజస్థాన్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో చేస్తే అడ్డంకులు వచ్చాయని గంగుల కమలాకర్ గతంలో చెప్పారని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియ ఫిబ్రవరి 4, 2024 న మొదలుపెట్టి... ఫిబ్రవరి 4, 2025న అంటే 365 రోజుల్లో పకడ్బందీగా చట్టాన్ని చేసి స్థానిక సంస్థల్లో బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. మంత్రివర్గ తీర్మానం చేసి శాసనసభలో ఆమోదింపజేసి... విద్య, ఉద్యోగ రంగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు రెండు వేర్వేరు బిల్లులను గవర్నర్ కు పంపించామన్నారు. గవర్నర్ వాటిని ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించారని, ఐదు నెలలుగా ఆ రెండు బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈలోగా స్థానిక సంస్థల ఎన్నికలపై కొందరు హైకోర్టుకు వెళ్లారని తెలిపారు. సెప్టెంబరు 30 లోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని వివరించారు. 2018లో కేసీఆర్ తీసుకొచ్చిన చట్టం గుదిబండగా మారిందని అన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చి 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేయాలని గవర్నర్‌కు పంపామని తెలిపారు. గవర్నర్ వీళ్ల మాటలు నమ్మి ఆ ఆర్డినెన్స్‌ను కూడా రాష్ట్రపతికి పంపించారని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. తెరవెనక లాబీయింగ్ చేసి రాష్ట్రపతికి పంపేలా చేశారని విమర్శించారు. ఆర్డినెన్స్ ఆమోదం పొందలేదు కాబట్టి అత్యవసరమైతే ఆ బిల్లును సభలో ఆమోదించుకుంటామన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే సంతోషంగా ఉండేవారిలో మొదటి వరుసలో గంగుల కమలాకర్ ఉంటానని స్పష్టంగా చెప్పారని అన్నారు. కానీ వాళ్ల నాయకులు సంతోషంగా ఉంటారని చెప్పడం లేదని, వాళ్ల నాయకులకు దుఃఖం, బాధ ... కడుపునిండా విషం పెట్టుకుని ఉన్నారని కమలాకర్ స్పష్టంగా చెప్పారని పేర్కొన్నారు. బీసీ కమిషన్‌కు ఇచ్చిన జీవోనైనా, డెడికేషన్ కమిషన్‌కు ఇచ్చిన జీఓనైనా, బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆకాంక్షతోనే దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లలేదని గంగుల కమలాకర్ మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అయిదుసార్లు ప్రధానికి లేఖ రాసి అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జంతర్‌మంతర్ దగ్గర ధర్నా చేపడితే దాదాపు 100 మంది వివిధ రాష్ట్రాల ఎంపీలు వచ్చి మద్దతు ఇచ్చారన్నారు. కానీ బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదని... అంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి వాళ్ల పార్టీ నాయకుడు సిద్ధంగా లేరని, వారికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ఇవాళ కూడా సభలో గందరగోళం సృష్టించి బిల్లు ఆమోదం పొందకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ఇలాంటి వారికి కనువిప్పు కలగడానికి ఫిబ్రవరి నాల్గో తేదీన 'సోషల్ జస్టిస్ డే'గా జరుపుకోవాలని నిర్ణయించామని చెప్పారు. వందేళ్లుగా చేయని పని మేం చేస్తే... మమ్మల్ని అభినందించి ఉంటే కేసీఆర్ పెద్దరికం పెరిగి ఉండేదన్నారు. ఈ ఒక్క విషయంలోనైనా వాళ్ల ఒత్తిడికి లొంగవద్దని గంగుల కమలాకర్‌కు సూచించారు. అది కల్వకుంట్ల కాదు... కల్వకుంట అని, ఎవరినీ కలవనీయకుండ చూసే కుటుంబం అంటూ విమర్శించారు.

పెండింగ్‌లో ఏడు వేల అవినీతి కేసులు: సీవీసీ

న్యూదిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) దర్యాప్తు చేసిన 7,072 అవినీతి కేసులు వివిధ కోర్టులలో విచారణ పెండింగ్‌లో ఉన్నాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) తెలిపింది. వాటిలో 379 కేసులు 20 ఏళ్లకు పైగా విచారణలో ఉన్నాయని ఆదివారం విడుదలైన తాజా వార్షిక నివేదిక పేర్కొంది. 2024, డిసెంబరు 31 నాటికి మొత్తం కేసుల్లో 1,506 కేసులు మూడేళ్ల లోపు, 791 కేసులు మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు, 2,115 కేసులు ఐదేళ్ల నుంచి 10 ఏళ్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. అవినీతి నిరోధక సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం... మొత్తం 2,281 కేసులు 10ఏళ్లకు పైగా మరియు 20 ఏళ్లకు పైగా విచారణలో ఉన్నాయని, 379 కేసులు 20 ఏళ్లకు పైగా విచారణలో ఉన్నాయని వివరించింది. అవినీతి కేసుల్లో 2,660 కేసులు 10 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయమని సీవీసీ పేర్కొంది. నివేదిక ప్రకారం...సీబీఐ, నిందితులు దాఖలు చేసిన 13,100 అప్పీళ్లు/సవరణలు వివిధ హైకోర్టులు... సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. వీటిలో 606 అప్పీళ్లు/ సవరణలు 20 సంవత్సరాలకు పైగా, 1,227 అప్పీళ్లు/సవరణలు 15 ఏళ్లకు పైగా 20 ఏళ్లకంటే తక్కువ కాలం, 2,989 కేసులు 10 సంవత్సరాల కంటే తక్కువ కాలం, 4,059 ఐదేళ్ల కంటే ఎక్కువ 10 ఏళ్ల కంటే తక్కువ కాలం, 1,778 కేసులు రెండేళ్ల కంటే ఎక్కువ ఐదేళ్ల కంటే తక్కువ కాలం... 2,441 కేసులు రెండేళ్ల కంటే తక్కువ కాలం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. '2024లో 644 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. వీటిలో 392 మందికి శిక్ష పడింది. 154 మంది విడుదలయ్యారు. 21మంది డిశ్చార్జ్ అయ్యారు. 77 మంది ఇతర కారణాల వలన తొలగించబడ్డారు' అని సీవీసీ తెలిపింది. 2023లో నేరాలకు శిక్షలు పడిన రేటు 71.47శాతంగా ఉండగా, గత ఏడాది 69.14శాతానికి పడిపోయింది. 2024 చివరి నాటికి, అవినీతితో సంబంధం లేని కేసులు సహా మొత్తం 11,384 కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని వివరించింది. 2024లో సీబీఐ 807 కేసులు నమోదు చేసిందని, వాటిలో 674 సాధారణ కేసులు... 133 ప్రాథమిక విచారణలు ఉన్నాయని నివేదిక తెలిపింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.